ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక



వయాపెసలు ANDHRA PATRIKA



ఎల్లోరాశిల్పం : శివతాండవం

—ఫోటో : నందగోపాల్, హైదరాబాదు.]

సంవత్సర చందా
రు. 13-0-0
విడిప్రతిక 25న.పై

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 41
4-6-58

Founder : K. NAGESWARA RAO

విలంబి జ్యేష్ఠ బహుళ తృతీయ బుధవారం

★

విషయానుక్రమణిక

★

ముఖచిత్రం:

కాశీనాథ్ ప్రొడక్షన్స్‌వారి
'శ్రీరామాంజనేయ యుద్ధం'లో

సంధ్య

★

లోకంతీరు	— 6
న్యూఢిల్లీ లేఖ	— 9
పంటిపోటు	— 11
విధివిధానం	— 18
సంఘజీవి	— 20
మహాభారతం	— 24
అపశృతి	— 28
నక్షత్రఫలితాలు	— 32
వనితాలోకం: కోపం	— 35
మంగళసూత్రం ఎందుకు తీసివేయాలి?	— 36
దగాపడిన తమ్ముడు	— 40
బాలసాహితి-తువ్వాయ్	— 44
కామాక్షి	— 45
సినిమా	— 50



ఐయోవా కళాశాల విద్యార్థులతో ప్రతివారం జరిపే ఇష్టాగోష్ఠిలో మోల్డెన్.

నీగ్రో యువతి జేన్ మోల్డెన్ మతసేవ

సచ్చిదానంద స్వరూపుడైన పరమేశ్వరుని సాన్నిధ్యం చేరటానికి సులభసాధ్యమైనది భక్తిమార్గమే. విద్యార్థిగణాలకు భక్తిని ప్రబోధిస్తూ సద్గుణసంపన్నులుగా తయారు చేయటంలో అందెవేసిన చేయి అమెరికన్ నీగ్రో యువతి ఏ. జేన్ మోల్డెన్.

ప్రముఖ అమెరికన్ మహిళలను గూర్చిన వ్యాసాలను "ఏమ్స్ డెయిలీ ట్రిబ్యూన్" ధారావాహికంగా ప్రకటించింది. దానిలో "వుమన్ ఆఫ్ ది వీక్" (ఈవారపు మహిళ) అనే వ్యాసంలో, దేశంనలుమూలలా మతోద్ధరణకోసం అవిశ్రాంతంగా కృషిచేస్తున్న వనితారత్నం జేన్ మోల్డెన్ విషయమై వ్రాసిన మాటలివి:


"మతసందేశాలనూ, బోధనలనూ వ్యక్తుల జీవితానికి జాగ్రత్తగా అన్వయింప చేయగలిగితే తమ స్థానం ఏదో గ్రహించి, ఈప్రపంచంలో నెరవేర్చవలసిన విద్యుక్తధర్మాలను ఆచరణలో పెట్టి ముక్తి పొందగలుగుతారు" అని కుమారి మోల్డెన్ వ్యక్తంచేసింది. ఆమె అయోవా స్టేట్ కాలేజీలో విద్యార్థివర్గానికి మతాధికారిణి (మినిస్టర్)గా పనిచేస్తున్నది. కాంగ్రిగేషనల్ చర్చి, ఇవాంజెలికల్ చర్చి, రిఫార్మ్డ్ చర్చికి సంబంధించిన 600 మంది విద్యార్థులకు ఆమె మతవిషయాలు బోధిస్తుంది. ఆ క్రైస్తవ చర్చిలు మూడు ఏకమై అచిరకాలంలో "యునైటెడ్ చర్చ్ ఆఫ్ క్రీస్ట్" అనే సమాఖ్యగా రూపొందబోతున్నది. అమెరికాలో కళాశాల ఆవరణలలో మత విషయాలను బోధించే మహిళల్లో కల్లా మోల్డెన్ పిన్న వయస్కురాలు. అలాంటి మతాధికారిణీ ఉద్యోగాలను స్త్రీలు నిర్వహించటం బహు అరుదు.

ఆమెకు దైవభక్తి కడు మెండు. కళాశాల విద్యార్థులకు మతం బోధించటంలోనే ఆమె తృప్తిపడలేదు. ఇతర స్థలాలకు కూడా వెళ్ళి మతబోధ చేస్తూంటుంది. ఏమ్స్‌లోని ఫస్ట్ కాంగ్రిగేషనల్ చర్చిలో క్రిస్టియన్ విద్యాశాఖ డైరెక్టరుగా పనిచేస్తున్నది. ఇక ఆమెకు వయస్సు తారతమ్యం అంటూ లేదు. అంటే తప్పటడుగులు వేసే పసిపాప నుంచి, తడబడుతూ నడిచే తాతవరకూ గల వివిధ వయస్కుల వారికీ ఆమె ఆ పరమేశ్వరుని లీలలు అనేక విధాల బోధించి వారిని పారవశ్యంలో ముంచెత్తుతుంది.

మిస్ మోల్డెన్ స్కాఫ్లర్ కళాశాలలో చదివి పట్టభద్రురాలయింది. వేదాంత శాస్త్ర బోధనలో ప్రఖ్యాతి వహించిన ప్రిన్స్‌టన్ థియొలాజికల్ సెమినరీలో ఉన్నత విద్యనభ్యసించి 'బాచులర్ ఆఫ్ డివినిటీ' పట్టంపొందింది. ఆమె శక్తిసామర్థ్యాలనూ, బోధనాగరిమనూ, మెచ్చుకొని ఆమెను కళాశాల ఆవరణ మతాధిపతిగా నియోగించారు.

"విద్యార్థులను అనేక ప్రదేశాల్లో అనేక సమయాల్లో కలుసుకొంటూంటాము. విద్యార్థి బృందాలు జరిపే గోష్ఠులలోనూ, విద్యార్థి వసతి గృహంలో జరిగే విందులలోనూ విద్యార్థి క్లబ్బులో జరిగే చర్చల్లోనూ పాల్గొంటాము. అక్కడిచర్చలు విచిత్రానుభూతిని కలిగిస్తూంటాయి" అంటుంది ఆమె.

ఆ నీగ్రో యువతి దినచర్య చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది. సహనానికీ, సామర్థ్యానికీ, ఆప్యాయతకూ, అవిరళ కృషికీ, పట్టుదలకూ, పటుత్వానికీ, నిరాడంబరత్వానికీ, నిర్మలతకూ — ఆమెకు ఆమే సాటి. తెల్లవారుజామున లేచి దైవప్రార్థనాది ప్రాతఃకాల కృత్యాలన్నీ ముగించుకొని అరున్నర అయేసరికలా ఇంచుమించు నిత్యం జరిగే కమిటీ సమావేశాలలో పాల్గొంటుంది. విద్యార్థి కేంద్రంలో కాంగ్రిగేషనల్ చర్చి ఆధ్వర్యాన అర్ధరాత్రి జరిగే ఫెలోషిప్ కార్యక్రమంలో పాల్గొనటంతో ఆమె తన దైనందిన కార్యక్రమం ముగిస్తుందని చెప్పవచ్చు. ఈలోపుగా ఆమె నిర్వర్తించే విధులు అనంతం. కాలేజీ ఆస్పత్రికి వెళ్ళి అక్కడి రోగులకు మత విషయాలు



ఉన్నతపాఠశాలల విద్యార్థినులతో కలిసి చర్చిలలో ప్రార్థన గీతాలాపనలు

విలసిల్లుతూంటుంది.

"విద్యార్థులలో మత విషయాలపట్ల కలిగే శ్రద్ధాసక్తులను గురించి మేము చర్చిస్తుంటాము. మతసంస్థల్లో సభ్యులుకాని వారెంత మందినో కలుసుకొని వారికి దైవచింతనపట్ల శ్రద్ధ కలిగేటట్లు చేస్తూంటాము. అయోవా స్టేట్ కళాశాల క్రైస్తవ మత సిద్ధాంతాలనూ, ప్రజాస్వామ్య సూత్రాలనూ బోధిస్తూ ఉంటుంది కనుక ఆవరణంలోని విద్యార్థులందరూ ప్రముఖమైన పాత్ర వహించవలసి ఉంటుంది," అని అంటుందామె.

అక్కడి సెకండరీ పాఠశాలల్లో ఆమెను ఎరగని వారంటూ లేరు. మత విషయాలు సుగ్రాహ్యం చేసుకోనేటందుకు ఏర్పాటు చేయబడిన కార్యక్రమాలోనూ, పాఠశాలల తరగతుల్లోనూ బోధించవలసిందిగా ఆమెకు ఆహ్వానాలు అపరిమితంగా వస్తూంటవి. ఆమె తన చర్చిద్వారా చిన్నారిపాపల నిర్మల హృదయాలలో విశ్వేశ్వరునకు స్థానం కల్పిస్తుంది. ఆ రాష్ట్రంలోగల వివిధ చర్చిలకు చెందిన విద్యార్థులందరూ వేసంగిలో సమావేశమయినప్పుడు అధ్యాపక మండలి సభ్యురాలిగా ఆ కార్యక్రమాల్లో ఆమె కూడా


జేన్ మోర్డెన్

బోధించి, వారిమనస్సుల్లో ఉల్లాసం జనింపజేసి, వ్యాధి విషయాలు మరచిపోయి వారంతా దైవచింతనలో మునిగిపోయేటు చేస్తుంది; కళాశాలలో మతవిషయిక తరగతుల్లో అధ్యాపకత్వం వహిస్తుంది; ప్రార్థనా సమావేశాల్లో పాల్గొంటుంది; మత చర్చలను నిర్వహిస్తుంది. విద్యార్థులు తమ సొంత విషయాల్లో ఎదుర్కొనే సమస్యలు సులువుగా పరిష్కారమయే మార్గాలు సూచించి హితబోధ చేస్తుంది. ఇవిగాక చర్చిలో జరిగే సమావేశాలకు విద్యావిషయ పరిశీలనలకూ విద్యార్థులను అనుసరించి వారికి చేదోడు వాదోడుగా ఉంటుంది.

కళాశాల తాలూకు ఇంటర్—ఫెయిత్ రెలిజియస్ కౌన్సిల్ కు ఆమె అధ్యక్షురాలు. శ్రోతలను మంత్రముగ్ధులను చేయగల శ్రావ్యత ఆమెకంఠంలో ఉంది. పరమాత్ముని మహిమను తన మృదుమధుర కంఠంతో పాడుతూ వ్యక్తం చేస్తున్నప్పుడు ప్రేక్షకులందరూ భగవద్దర్శనం లభించినట్లు జన్మలు తరించిపోయినవనీ భావిస్తూంటారు. ఆ విద్యాసంస్థలూ 9,600 మంది విద్యార్థులు అందరూ ఆ మత సంస ఆదేశాలనూ, ఆదర్శాలనూ గ్రహించేటట్టు చేయగలదిట్ట మిస్ జేన్. విద్యార్థి వసతి గృహాల్లో జరిగే భోజనాంతర గోష్ఠులలో ఆమె వారందరి అభిమానాన్ని చూరగొన్న నాయకురాలిగా



అయోవా కళాశాల ఆస్పత్రిలో చికిత్సపొందే విద్యార్థినులకు అభయవచనా



పాఠశాల విద్యార్థులైన చిన్నవారితో
కులాసా కబుర్లు

పాల్గొని ప్రార్థన సమావేశాలనూ, సంగీత సమావేశాలనూ నిర్వహిస్తుంది. విలాస కృత్యాల కార్యక్రమాన్ని నడిపిస్తుంది. చిన్నపిల్లలకు ప్రతి విషయంలోనూ సలహాలిస్తూ వారు సన్మార్గంలో నడిచేటట్టు చూస్తుంది. కార్యకర్తగా ఆమె జాతీయ మత సంబంధమైన సమావేశాల్లో పాల్గొంటుంది.

ఆధ్యాత్మిక చింతన కలిగిన యువతిగా తన విభాగానికి చెందిన చర్చిలలో జరిగే ప్రాతఃకాల ప్రార్థనలలో పాల్గొనటమే కాక మహిళా సమాజాలనూ, యువక మండలులనూ ప్రత్యేక ఆహ్వానం పై వెళ్లి కలుసుకొంటుంది. "చర్చి—కాంపస్" మినిస్ట్రీ అనేక విషయాన్ని గురించి ఇటీవల ఒక టెలివిజన్ కార్యక్రమాన్ని పూర్తి చేసింది.

ఫస్ట్ కాంగ్రిగేషనల్ చర్చిలో ఆమె ఒక నాట్యబృందాన్ని స్థాపించి, దానిని నిర్వహిస్తున్నది. ఈ కళ ద్వారా సెకండరీ పాఠశాలల విద్యార్థినులందరూ భగవంతుని ఆరాధిస్తుంటారు.

"నేను నిర్వహిస్తున్న ఈ విధులు నాకెంతో ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ ఉద్వేగాన్ని కలిగిస్తూంటవి. అది గర్వించ తగిన కృషి. ముఖ్యంగా విద్యార్థులతో అయితే చెప్పనే అక్కర్లేదు. నేను పశ్చాత్తప హృదయురాలను కాదు. అంటే నేను చేసిన పాపాలేమయినా ఉంటే వాటిని పారద్రోలి నా జన్మ పునీతం చేయమని ప్రార్థించేదానిని కాదు. కాని నేను ప్రత్యేకించి చేస్తున్న ఈ కృషిని జీవితాంతంవరకూ కొనసాగించేశక్తి నాకిమ్మని భగవంతుని ప్రార్థిస్తున్నాను అని శీలవతి జేన్ హాల్డేన్ అంటుంది.


ఆమెకు శైశవంలో పక్షవాతం వచ్చి తగ్గిపోయింది. తర్వాత ఆమె వజ్రశరీర మైంది, ఆమె వ్యాయామ క్రీడల్లో కూడ అద్వితీయస్థానం ఆక్రమించింది. 1948 లో తన సొంత రాష్ట్రమైన నెబ్రాస్కా లో గరల్ ఛాంపియన్ హార్స్ షూ పిచర్ గా ప్రఖ్యాతిగాంచింది. బాస్కెట్ బాల్, బాడ్మింటన్, టెన్నిస్ క్రీడల్లో దిట. ఆమె విరామ సమయాల్లో విలాసారంపద్యా లను అల్లుతూంటుంది అంటే ఆమె కవయిత్రి కూడాను.

కుమారి హాల్డేన్ అయోవా స్టేట్ కాలేజీలో చేరక పూర్వం, చికాగో నగరంలో తన చర్చి కాలూకు మత సంబంధమైన విద్యా కార్యక్రమాలలోనూ, మనోల్లాసకర కార్యక్రమాల్లోనూ పాల్గొని బాలకులూ, యువతీ యువకులకూ మత సామరస్యాన్ని గురించి బోధిస్తూండేది. సెమినరీలో విద్యార్థినిగా ఉన్నప్పుడు విద్యార్థుల వేసవి సమావేశాల్లో ప్రసంగిస్తూ మూడు పర్యాయాలు వివిధ రాష్ట్రాలను పర్యటించింది.

క్రిషియన్ సైన్స్ మానిటర్ పత్రిక ఈ ప్రముఖ యువతీమణిని అభినందిస్తూ ఇటీవల ప్రకటించిన ఒక వ్యాసంలో ఇలా వ్రాసింది.

"విద్యార్థులందరూ దైవచింతన కలవారనీ, తమ భావాలను కొందరు పూర్వాచారపరాయణులుగానూ, మరికొందరు ఆధునిక పద్ధతులలోనూ వెలిబుచ్చుతుంటారనీ జేన్ హాల్డేన్ గ్రహించింది. వారు ఆటస్థలాల్లో ఉండనీ, విలాసార్థం ఏర్పాటు చేయబడిన సమావేశాలలో ఉండనీ, తదితరచోట్ల ఉండనీ, వారిని కలుసుకొని మత విషయాలు బోధించగల సమర్థురాలు హాల్డేన్. విద్యార్థులపట్ల ఆమె కెంతో విశ్వాసం ఉన్నది. ఆ నమ్మకమే వారందరినీ మనస్ఫూర్తిగా దైవప్రార్థనల్లో పాల్గొనేటట్లు చేస్తుంది." ★

—యు. ఎస్. ఐ. ఎస్.]



★ శకునపక్షులు... ★

ఈ ప్రపంచంలో జీవించే జీవరాసుల్లో గొంగళిపురుగు జీవితం చాలా విచిత్రమైనది—అంటూ ఒక కవి చక్రవర్తి వర్ణించాడు. కాని నన్నడిగితే మీరు నన్నడక్కపోయినా సరే—మానవజీవిత మంతవిచిత్రమైన జీవితం మరొకటి లేదనే అంటాను! వారి సమస్యలున్నాయి చూశారూ భలే తమాషాగా వుంటాయి! వర్ణించ సాధ్యం కానివికూడా! అవన్నీ వివరంగా వ్రాయటం ఆరంభించానంటే ఆ తర్వాత ఎక్కడ ఆపుచెయ్యాలో నాకే తెలియదేమో! పైగా స్థలంకూడా చాలదు. ప్రత్యేకంగా ఒక మహాభారతాన్నే వ్రాయాలి! కాని—క్లుప్తంగా కొన్నింటిని మాత్రం చెప్తాను.

ఒకరికి శకునాల సమస్య; ఇంకొకరికి సంతోషంగా ఎందుకు వుండలేక పోతున్నామూ అనే సమస్య; మరొకరికి ఎదటివాళ్లతో ఎందుచేత స్నేహం చెయ్యలేక పోతున్నామనే సమస్య; మరింకొకరికి ఆఫీసులో స్నేహితులు అడిగే అప్పుల సమస్య! ఇంకా కొందరున్నారు—ఇంటికి వచ్చే అతిథుల సమస్య!.........ఎట్సెట్రా......ఎట్సెట్రా.........ఎట్సెట్రా.........

ప్రపంచంలో అనేకమంది అనేక విషయాలు సాధించటంకోసం ఏదైనా ఒక సభో, సమాజమో, సంఘమో స్థాపిస్తూనే వస్తున్నారు. బాగానే వుంది. కాని—వితంతువుల గతీ మోక్షానికికూడా ఏదైనా ఒక సభకాని, సమాజంగాని, సంఘం కాని ఎందుకు ఏర్పాటు చెయ్యకూడదా అనే ఆలోచన తటింది నాకు ఈమధ్యనే. వితంతువుల పరితాప పరిస్థితులు, వాళ్లుపడే కష్టాలు నాకు తెలియనివి కావు. వాళ్లనుగురించి విచారించి, విచారించి విలపించాను కూడా! ఎందుచేతనో గాని అకస్మాత్తుగా నాకు వాళ్లమీద అపారమైన జాలి పుట్టుకొచ్చింది. డియర్ ఫ్రెండ్స్! ఇటువంటి విషయంలో—అవసరం ఏమిటి? అంతరార్థం ఏమిటి? అంటూ చొప్పదంటు ప్రశ్నలు మీరెవరూ వేయకూడదు! ముందస్తుగానే చెప్పేస్తున్నాను......................!

అసలు-వితంతువు అంటే-చాలామంది కళ్లకు ఒక బ్రహ్మజెముడు చెట్టులా కన్పిస్తుంది! కానివాళ్లకి ఎంత అపారమైన శక్తి వుందో ఎవరైనా ఎప్పుడైనా ఆలోచించారా? ఏదైనా ఒకపని చెయ్యాలన్నా, చెడగొట్టాలన్నా వాళ్లవల్లే సాధ్యమవుతుందనేది

యన్. శ్రీ కృష్ణారావు

నూటికి నూరుపాళ్లూ నిజం! మీరు నమ్మరంటారా? అయితే...వినండి!

మీ ఇంట్లో ఒక పెళ్లి జరగబోతోందనుకోండి. 'జరగదు' అని ముందే అపశకునంగా మాట్లాడకండి. జరగబోతోందనే అనుకోండి. నిశ్చితార్థ తాంబూలాలు పుచ్చుకోనేందుకు ముఖ్యమైన మీవాళ్లంతా ఒకచోట చేరాలని నిశ్చయించుకొంటారు. మీ ఊళ్లో మీ మీద కక్షకట్టిన ఒక వితంతువు వుందనుకోండి. ఆవిడగారు ఆ పెళ్లిని ఆపెయ్యాలని అనుకొందంటే ఆ పని ఆవిడగారికి అక్షరాలా సాధ్యమే! అందుకోసం ఆవిడ పెద్ద కుయుక్తిగాని, కుట్రగాని పన్నవలసిన అవసరం ఎంతమాత్రమూ లేదు! మీరంతా తాంబూలాలు పుచ్చుకోవటానికి బయల్దేరే సమయంచూసి చటుక్కున మీకు ఎదురుగా వచ్చిందంటే చాలు! ఫినిష్! మీరు పడ్డ శ్రమఅంతా బూడిదలో పోసిన పన్నీరే! ఎందుకలా నవ్వుతారు? నేను చెప్పింది అబద్ధమంటారా? ఆ సంబంధం 'కాన్సిలు' అయిపోయినట్టే కదా? మరి ఇప్పుడు చెప్పండి వితంతువుల గతీమోక్షానికి ఒక సభకాని, సంఘంకాని, సమాజంకాని అవసర మంటారా కాదంటారా? పాపం! వాళ్లు ఎదటివాళ్లు పెట్టే శాపనార్థాలతో కుమిలి పోతున్నారు! వాళ్లకి ఏదైనా ఒకదారి చూపించండి!

కొందరికి బ్రాహ్మల్ని చూస్తే గిట్టదు! ఎందుచేతనంటే బ్రాహ్మలకి బ్రహ్మగారు ఓ బ్రహ్మాండమైన శక్తి యిచ్చాడుట! బ్రాహ్మణేతరులమీద కక్ష సాధించుకోనేందుకు ఆ బ్రాహ్మలు ఒక యుక్తి పన్నుతారట! అంటే వాళ్లు చాటుగావచ్చి, కర్రా, బుర్రా పట్టుకొచ్చి అకస్మాత్తుగా నెత్తి బద్దలు కొటరుట! అసలు బ్రాహ్మలంటే చాలా తెలివైనవారుట! బ్రాహ్మణేతరులు తిథి, వార, నక్షత్ర, లగ్న రాసులన్నీ జాగ్రత్తగా చూసుకొని, బయల్దేరబోయే శుభసమయంలో ఒంటి బ్రాహ్మడు చటుక్కున శకునం వస్తాడుట! ఇంక నూసుకోండి తమాషా! ఇంక రాయక్కర్లేదు! బ్రాహ్మలలో బ్రాహ్మలకికూడా ఈ పట్టింపే లేకపోలేదనుకోండి.

'బ్రాహ్మలేనా అంత గొప్పవాళ్లు' మేము చచ్చుపీనుగుల మనుకొంటున్నారా? అని కోపం వస్తుంది తెలకలవారికి. బ్రాహ్మలు శుభముహూర్తం నిర్ణయించుకొని టిప్‌టాప్‌గా సింగారించుకొని ఏ పెళ్లి సంబంధం నిశ్చయం చేసుకోనేందుకో ఏదైనా కొత్త వ్యాపారం ప్రారంభించటానికో, ఏ ఊరో ప్రయాణానికో బయల్దేరబోతున్న సమయంచూసి నూనె కావిడితో ఎదురుగా ప్రత్యక్షమవుతారు అనుకోండి ఆ సమయంలో వారి మొహాలు చూడాలి ఫేంవుట్ !

ప్రపంచంలో వినటానికి యింపైన స్వ

ఏమిటని మీరు నన్నడిగారంటే గార్ధభ స్వరం అని చెప్తాను! మీకు నవ్వొస్తోందా? నవ్వకండి! గాడిద గట్టిగా అరిచే సమయం చూసి ఆ సమయంలో మీరు బయలేరారంటే అంతకన్నా మంచి శకునం మరొకటి లేదనే సంగతి మీకు తెలుసునా? మరి గార్ధభస్వరం వినటానికి యింపైనదే నని ఎందుకనుకోకూడదు? జీవితంలో అస్తమానూ అపజయం పొందుతూ అవస్థపడే వాళ్ళు నేను చెప్పిన మాట వినండి! గాడిదలను ఎక్కువగా పెంచే చాకలివాళ్ల యిళ్ల పక్కనే కాపురం వుండండి ఇంక ఆ తర్వాత చూసుకోండి జీవితంలో వచ్చే మార్పులు! మీరు కార్యసిద్ధి పొందటం నిశ్చయం! గ్యారంటీ!

గుఱ్ఱపు పందాలలో ప్రతిరోజూ ఓడిపోతూ 'మూడో చేస్తు' ముఖంతో యింటికి తిరిగివచ్చే మిత్రులకి ఒక సలహా! ఈ కాలంలో కొంతమంది భాగ్యవంతులు పిల్లి పిల్లల్నీ, కుక్కపిల్లల్నీ, కుందేలు పిల్లల్నీ, చిలకల్నీ మొదలైనవాటిని పెంచుతూ ఆ ప్రాణులనికూడా తాము కన్న పిల్లలాగే ఎంతో గారాబంగా చూసుకొంటున్నారు. నన్నడిగితే వాళ్లంతా తలకాయమీద బుర్ర కాయలేని పిచ్చివాళ్ళు! మీరుమాత్రం ఎక్కడికైనాసరే వెళ్ళి, ఎల్లాగైనాసరే అవస్థపడి ఓ నక్కను పట్టుకొని తెచ్చుకొని ఇంట్లో పెట్టి పోషించండి! పొద్దున్నే లేచి దాని మొహాన్ని ఒకసారి చూసి, దాని వెనకాలకు వెళ్ళి మెల్లిగా మీ కుడికాలుతో దానితోక ఒకసారి తొక్కండి! మెల్లిగా తొక్కండి సుమా! గట్టిగా తొక్కారంటే మీ కాలి కండరాన్ని బయటకు లాగేస్తుంది ఆ నక్క! ఇంక చూసుకోండి ఆవాళ తమాషా! ఆరోజు పందెంలో మీరు ఫస్టు ప్రైజు కొట్టకపోతే అడగండి!—క్షమించాలి! పొరపాటు. ఆ నక్కనే అడగండి! అందుకనే ఏ పనిలోనైనా అనుకోని లాభం వచ్చినపుడు 'ఇవాళ వీడు నక్కని తొక్కివచ్చాడు' అని కొందరంటూ వుంటారు మీకు తెలుసా? అసలు నిజానికి అది సరైన సామెత కాదు. 'ఇవాళ నక్కతోక తొక్కివచ్చాడు' అనేదే కరెక్టు సామెత!


మరి రాత్రిళ్ళు నక్క తన కూతలతో బెదరగొట్టేస్తుందేమో, నిద్రంతా చెడిపోతుందేమో అని అడుగుతారా? దానికి నేనేం చెయ్యను చెప్పండి! మీరు పందెంలో గెలవాలంటే దీనికి మించిన ఉపాయం లేదు! కాని ఒక విషయంమాత్రం చాలా చాలా ముఖ్యం! మీరు పొద్దున్నే లేచి నక్క మొహంచూసి, అతి జాగ్రత్తగానూ, అతి మెల్లగాను దానితోక తొక్కి బయల్దేరారనుకోండి, ఆ సమయంలో చుట్టుపక్కల ఏ పిల్లి పిల్లయినా మీ ముందునుంచి వెళ్లిందంటే, ఆ రోజు మీకు వచ్చే అపజయానికి నేనూ కారణం కాదు! ఆ నక్కా కాదు! అందుచేత ముందసుగా మీరు ఒక పని చెయ్యాలి! మీ ఇంట్లోగాని, మీ ఇంటి చుట్టుపక్కలగాని పిల్లులు సంసారాలు ఏవైనా వున్నట్లయితే, వాటిని వెంటనే గృహ బహిష్కరణ చేయించండి! ఇది కొంచెం శ్రమమైన పనే! కాదని చెప్పను. కాని, కార్య సాధకుడు ఒకచో...భర్తృహరి సుభాషితం జ్ఞాపకం తెచ్చుకోండి!

ఇంత రాసిన తర్వాత నా స్వంత విషయంలో జరిగిన అనుభవం ఒక్కటైనా చెప్పకుండా వుండగలనా?

కాలేజీలో చదువుకొనే రోజుల్లో జరిగింది ఈ సంఘటన. మా పక్కింటి ఆవిడకు ఒక కొడుకున్నాడు; ఘనుఘోరం చదువుతున్నాడు ఆ రోజుల్లో. ఒక్కడే కొడుకు అవటంవల్ల ఆవిడకు కొడుకుమీద అపార ప్రేమ. గారాబంకూడా చాలా ఎక్కువ. పైగా ఆవిడకు శకునాల విషయంలోమాత్రం కొడుకుమీదవున్న ప్రేమకన్నా ఎక్కువ ప్రేమ! ప్రతిరోజూ కొడుకు బడికివెళ్ళే సమయంలో నే శకునం చూడకుండా పంపని ఆవిడ, పరీక్షల సమయంలో ఎన్ని శకునాలు చూస్తుందో ప్రత్యేకంగా చెప్పాలా? మొదటిరోజు తెలుగు పరీక్ష. నాకు ఆవాళ కాలేజీకి సెలవురోజు. ఆవిడ పొద్దున్నే లేచి, కొడుక్కి తలంటుపోసి, పూజచేయించి, శుభ్రంగా మంచిబట్టలు తొడిగి, భోజనంకూడా పూర్తి చేయించేసరికి పదిగంటలయిపోయింది ఆ అబ్బాయిని లోపలే నిల్చోబెట్టి ఆవిడగారు శకునం చూడటంకోసం వీధిగుమ్మంలోనికి వచ్చినిలబడింది. కొన్ని క్షణాలతర్వాత లోపలకి చూస్తూ "రా! రా! ఎవరూ రావటంలేదు. గబ గబా రా!" అని కొడుకుని కేక వేసింది. ఆ కొడుకికి తొందరపడటం అలవాటు ఆ అబ్బాయి లోపలి గదిలోనుంచి పరుగెత్తుకుని వీధిగుమ్మంలోకి వచ్చేసరికి "పో! పో! వెనక్కిపో! లోపలకివెళ్ళి కాళ్ళు కడుక్కుని రా!" అని ఆవిడగారు కొడుకుని లోపలకి పంపించేసింది. పక్కవాటాలోనే వుంటూన్న నేను "కారణమేమిటా" అనుకుంటూ బయటికివచ్చాను. ఒక వితంతువు మా సెనీసాతో అప్పుడే మా గుమ్మందాటి వెళ్ళింది! రెండోసారి అక్రాదు బయల్దేరినప్పుడు ప్రతిరోజూ ఆ యింటికి వచ్చే వ్యాయవారం బ్రాహ్మడు అకస్మాత్తుగా పక్కయింటోనుంచి బయటకు వచ్చాడు. ఆ బ్రాహ్మడంటే ఆవిడకు చాలా జాలి. ప్రతిరోజూ లేదనకుండా భిక్షకూడా వేస్తుంది. కాని ఆ సమయంలో శకునపక్షిలా తయారైనందుకు ఆ బ్రాహ్మడిని ఆవిడ పెట్టిన శాపనార్థాల్లో కనీసం ఒక్కటంటే ఒక్కటైనా—ఫలించి వున్నట్లయితే.....యింక చెప్పేందుకేముంది? ఆ బ్రాహ్మడి జీవితాన్ని ఏ దురదృష్టపు ఇన్సూరెన్సు కంపెనీ అయినా భీమా చేసికొని వున్నటయితే, దానినోట్లో దుమ్ముపడేదన్నమాటేకదా!

ఇంతలో కే 10-30 అయిపోయింది. మూడోశకునం పుల్లకావిడి! ఆ తర్వాత కొంచెంసేపు ఏ శకునమూ రాలేదు. మూడుసార్లు దుశ్శకునాలు కనిపించిన తర్వాత మంచిశకునం చూడకుండా ఆ కుర్రాణ్ణి పంపటం ఆవిడకు ఇష్టంలేకపోయింది. అప్పటికి టైము 10 45 అయిపోయింది. ఆ సమయంలో నీళ్లబిందె ఎత్తుకొని ఒక సుమంగళి ఆటువైపు వస్తోంది. ఆ శకునాన్ని చూసి పరవశం చెందిన ఆవిడ కుర్రాణ్ణి బడికి పంపించింది 'దివ్యమైన శుభశకునం. ఇవాళ మా అబ్బాయి నూటికినూరు మార్కులూ తెచ్చుకొంటాడు.' అంటూ ఆవిడ మురిసిపోయింది నాకుమాత్రం ఎందుకో సందేహం కలిగింది.

(54-వ పేజీ చూడండి)



చల్లదనంకోసం కొండలకు యాత్రలు!

ఇక్కడ ఎండలు మండిపోతున్నాయి; దుమ్ము రేగిపోతున్నది. మే జూన్ నెలలు వచ్చాయంటే ఇది ఇక్కడ మామూలే. వాతావరణమంతా బహు పొడిగా తయారవుతుంది. వాతావరణం పొడిగా వుండడం వంటికి మంచిదేగానీ దుమ్మమాత్రం అతి దుర్భర మనిపిస్తుంది. విధీ విరామం లేకుండా వీధులన్నీ దుమ్ముమయంగా తయారయితే, చిరాకు వేస్తుంది. అసహ్యమనిపిస్తుంది అయితే, ఒక విధంగా చూస్తే దుమ్మువల్ల కొంత మేలుకూడా లేకపోలేదు. వాతావరణ ఉష్ణోగ్రతను కొన్ని డిగ్రీలైనా తగ్గించడానికి ఈ దుమ్ము సహాయపడుతుంది.

బ్రిటిషువారి హయాంలో గ్రీష్మ ఋతువు వచ్చిందనగానే, చలదనంకోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని కొండలమీదికి తీసుకుపోయేవారు. అలా చేస్తున్నందుకు మనం విదేశీ పాలకులను బహు తీవ్రంగా ఖండించేవాళ్ళం. శాఖలుగా, ఉపశాఖలుగా విసరించి పోయిన ప్రస్తుత ప్రభుత్వ యంత్రాంగాన్ని కొండల మీదికి తరలించడం బ్రిటిషువారి తరంకూడా అయేదికాదేమో అనిపిస్తుంది!

* * *

చల్లదనంకోసం అధికారవర్గాలు పర్వతాగ్రపటణాలకు తరలిపోవడమన్నది ఇప్పుడు మారు రూపం ధరించేదేమోననిపిస్తున్నది. ఎక్కడలేని సమావేశాలూ ఎండాకాలంలోనే జరుగుతాయి. అందులోనూ అవన్నీ పర్వతాగ్రపటణాల మీదే ఏర్పాటవుతుంటాయి. దేశంలో బ్రిటిషువారి ధర్మమా అని అనేక పర్వతాగ్రపటణాలువెలిశాయికాబట్టి వాటిలో ఏదైతే సమావేశం జరపడానికి ఎక్కువ హాయిగా వుంటుందో ఆయా అధికారులు నిర్ణయించేస్తుంటారు. మూడేళ్ళక్రితం మద్రాసు రాష్ట్రంలో వున్న ఉదకమండలాన్ని అభిమానించారు; గత సంవత్సరం కాశ్మీర్. ఈ ఏడాదికి నైనిటాల్! బ్రిటిషు పాలకులు తరచూ కొండలకుపోయి ప్రజల డబ్బు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుపెట్టేవారు కాబట్టి, స్వపరిపాలనలో అలాంటి దుబారా ఖర్చుకు అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతో, పొదుపు ప్రోత్సహించడానికి ప్రతి మంత్రిత్వ కార్యాలయంలోనూ ఏర్ కండిషన్ సౌకర్యాన్ని కల్పించారు; ఇంతేకాదు; వారు నివసించే ఇళ్లలో కనీసం ఒకగది అయినా ఏర్ కండిషన్ చేసింది ఉంటుంది. డబ్బుఖర్చుచేసి యిన్ని సౌకర్యాలు కల్పించినా, దాదాపు మంత్రులందరూ మే జూన్‌మాసాలు వచ్చాయనగానే కొండలమీదికి తరలిపోనే పోతారు; అవకాశం కలిసివస్తే ఏదోఒక నెపంమీద విదేశాలకైనా బయలుదేరుతారు!

శ్రీకృష్ణ

[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

ప్రధాని నెహ్రూ కొద్దిరోజులపాటు విశ్రాంతికని రాజధానినుంచి వెళ్ళిపోయారు. ఇతర మంత్రులలో కూడా ఎక్కువమంది న్యూఢిల్లీలో లేరు.

• • •

జ్వాలాముఖి (రాజస్థాన్) త్రవ్వకాలలో ఒకరకమైన వాయువు (గ్యాస్) బయటపడ్డది. బ్రిటిష్‌వారి యాజమాన్యాన వారి సంపాదకత్వాన నడిచే పత్రికలలో యీ పరిశోధనను తెగపొగడుతున్నారు. ఇదివరలో వంటలకు వార్పులకూ వీలయిన "సోలార్ కుక్కర్" ఒకదాన్ని కనిపెట్టినప్పుడు కూడా ఇలాగే జరిగింది. ఏమాత్రం ఖర్చులేకుండా కేవలం సూర్యరశ్మితో ఆ 'కుక్కర్' పనిచేస్తుందని తెగప్రగల్భాలు పలికారు. రానురాను ఆ 'కుక్కర్' సంగతే లోకం మరిచిపోయింది! ఒకప్పుడుకృత్రిమ బియ్యానికి కూడా ఇదేలాంటి ప్రచారం చేశారు! ఆ కృత్రిమ బియ్యానికీ, సోలార్ కుక్కర్‌కూ పట్టినలాంటి అవస్థ ఈ జ్వాలాముఖి గ్యాస్‌కు కూడా పట్టవని ఆశిద్దాము.

* * *

జ్వాలాముఖిలో త్రవ్వకాలు సాగిస్తున్న ప్రభుత్వోద్యోగులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం పెట్టించవలసిందని పెట్రోల్, గ్యాస్‌శాఖ కేంద్రమంత్రి ఏడాదిక్రితం ఉత్తర్వు జారీచేశారట. కేంద్ర ఆర్థికశాఖ ప్రదర్శించిన సంకుచితధోరణి కారణంగా తమ ఉత్తర్వు అమలులోకిరాలేదని "మంత్రి బహదూర్" వారు గతవారం గ్రహించి ఆశ్చర్యచకితులైనారట!

ఖర్చులకు సంబంధించినంతవరకు కేంద్ర ఆర్థికశాఖ, ఆడిటర్ జనరలూ ఒక్క పార్లమెంటునుతప్ప ఏ ఇతర అధికారాన్ని ఖాతరు చేయరు. ఇదొకదురదృష్టం! భారతప్రభుత్వం నిత్యపరిపాలనా వ్యవహారాలలో ఏవిధంగా పనిచేస్తున్నదీ పైనచెప్పినసంఘటనవల్ల వ్యక్తమవుతుంది. ప్రభుత్వాన్ని కొంతమంది మంత్రులు తమ వ్యక్తిగత కుటుంబ వ్యవహారంగా పాటిస్తారు. తమ సొంత ఖాతాలోనుంచి తీసి ఇస్తున్నట్లుగా డబ్బు ఖర్చును ఆజ్ఞాపిస్తుంటారు; మరికొందరు తను సొంత డబ్బుకాదు కాబట్టి బహుధారాళంగా ఖర్చులు పురమాయించి ఆమోదిస్తుంటారు. జ్వాలాముఖిలోపనిచేసేవారికి ఉచితభోజన వసతి కల్పించమన్నారు కాబట్టి ఆ మంత్రి అక్కడి ఉద్యోగులందరికీ అతిప్రేమపాత్రులైనారు. చివరకు జరిగింది శూన్యం! ఆర్థికశాఖ చర్యకు ఆయన ఏవిధమైన ప్రతిచర్య జరుపుతారో చూడాలి.

• * •

ఎవరికైనా జ్ఞానోదయానికి తప్పక కొంత వ్యవధి తీసుకుంటుంది. ప్రజాభిమతానికి వ్యతిరేకంగావుండే ఏ దృక్పథాన్ని ఎవరు బలపరిచినా వారిలో దేశభక్తి లేదని ఇట్టే తీర్పు చెప్పేస్తారు. ద్వితీయ పంచవర్ష ప్రణాళిక దేశశక్తి సామర్థ్యాలకు మించినదని విమర్శించినవారందరికీ ఇదే జరిగింది. విను

న్యూఢిల్లీ లేఖ

ర్షకులు అభివృద్ధి నిరోధకులన్నారు. చివరకు ఇప్పుడేమైంది? మొదట్లో అలా విమర్శించినవారి ధోరణే సరిఅయినదని రుజువైంది. ఏడాది క్రితం విదేశీ ద్రవ్య మారకంలోపించింది కాబట్టి ద్వితీయ ప్రణాళిక దెబ్బతింటున్నదని వాపోయాము; అంత బ్రహ్మాండమైన ప్రణాళికను నిర్వహించడానికి దేశానికి ఆర్థిక స్తోమతు లేదని కూడా క్రమక్రమంగా బయట పడిపోయింది. అయినా, ఆర్థిక స్తోమతువున్నా లేకపోయినా, ప్రణాళికను వున్నగున్నట్లు అమలు జరిపి తీరుతామనే ప్రబుద్ధులు ఇప్పటికీ లేకపోలేదు!


ద్వితీయ ప్రణాళిక "అంచనాల సంఘం" ధోరణికూడా ఇందుకు ఏమాత్రం భిన్నంగా లేదు. మూడేళ్ల క్రితమే ఒక లేఖలో ఈ సంఘం ధోరణి నిశితంగా విమర్శించాను. అంచనాల సంఘం సువిస్తృతాధికారాలతో దేశంలో పార్లమెంటరీ పరిపాలనా నిర్వహణను అసాధ్యం చేస్తున్నదని అప్పుడే విమర్శించాను. ఆవిమర్శను కొందరు హేళనచేశారు

అంచనాల సంఘం ధోరణి ఇటీవల మరీ వికృతంగా తయారైంది. కేంద్ర మంత్రి మండలికంటే కూడా తనదే గొప్ప ప్రతిపత్తి అన్నట్లు వ్యవహరిస్తూ దేశాన్ని శాసించదలిచింది. ప్రభుత్వ విధానాలను నిర్ణయించుకునే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్న ప్రాథమిక సూత్రాన్ని కూడా ఇది గమనించలేకపోతున్నది. ఇందుకు కొన్ని ఉదాహరణలు చెబుతాను.

దేశంలో నూనె పరిశ్రమకు, నూనె రిఫైనరీ యంత్రాగారాల స్థాపనకు సంబంధించిన వ్యవహారం కేంద్ర ప్రభుత్వానిది. ఈ విషయాన్ని అంచనాల సంఘం మరిచిపోయినట్లున్నది ఇటీవల ఒక నివేదికను ప్రచురిస్తూ నూనె రిఫైనరీ యంత్రాగారాన్ని ప్రైవేట్ పెట్టుబడిదారుల చేత భావనగర్‌లో స్థాపించుకోనివ్వవచ్చునని సిఫార్సు చేసింది! కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుపట్ల బాధ్యత వహించి ప్రవర్తిస్తుంది. అంతేగాని, అంచనాల సంఘం సిఫార్సుల ప్రకారం నడుచుకోదు. ఈ సంఘం పార్లమెంటు ఏర్పాటు చేసింది: అందుచేత అది తన నివేదికను పార్లమెంటుకే అందజేయాలి కాని, ప్రభుత్వాన్ని అదుపాజ్ఞలలో పెటడానికి ప్రయత్నించకూడదు.

నూనె రిఫైనరీ యంత్రాగారాల స్థాపన వ్యవహారమంతా ప్రభుత్వ పెట్టుబడితోనే నడవాలని పార్లమెంటు ఎప్పుడో నిర్ణయించింది. ఈవిధంగా ఈ సంఘం పార్లమెంటు

(56-వ పేజీ చూడండి)


ఈ పాత ఇల్లు క్రొత్తదాని వలె
కనపడుతోంది
—కారణము
గుడ్‌లాస్ నెరోలేక్ పెయింటులతో దానికి
రంగువేయబడినది
గుడ్‌లాస్
నెరోలేక్
పెయింటులనే
కావాలని కోరండి
TRADE MARK
అందమైన రంగుల
పూత పూయుటకు
ఇవి అద్భుతమైన
పెయింట్లు
గుడ్‌లాస్ నెరోలేక్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్
ఏజంట్లు:
టి. టి. కృష్ణమాచారి అండు కంపెనీ.,
పోస్టుబాక్స్ నెం. 200, మద్రాసు-1.

పంటి పోటు

★ అయ్యగారి విశ్వేశ్వరరావు ★

పాపం-భానుమూర్తిగారికి పంటిపోటట్రా. కొంచెంచూసి రాకూడదా. ఇరుగూ-పొరుగు కాదా - అంది మా అమ్మ. మా అమ్మది చాలా జాలిగుండె. ఎవరైనా బాధ పడుతూంటే చూళ్లేదు. చేతనయినంత సహాయం తానూ చేస్తుంది. ఎదటివాళ్లని కూడా చేయమంటుంది. అలా చేసేదాకా చెవిని ఇల్లుకట్టుకొని పోరుతుంది. అంచేత నే కాంతమ్మగారంటే ఘరాణామనిషి అంటారంతా.

మా అమ్మమాట నాకు వేదవాక్యం. ఆవిడ చెప్పిందికదా - అని భానుమూర్తి గారిని చూడటానికి వెళ్లాను. భానుమూర్తి గారు చిన్నవాడూ కాదు చితకవాడూ కాదు. మనమల్ని ఎత్తిన ఓబాపతు ముసలివాడే అవాలి కాని ఈయనకి చిన్నరోగం వచ్చినా - యింటిల్లపాతిని చంపేస్తాడు. ఇంతెందుకు - కొంచెం తలనొప్పి వచ్చిందంటే - ఎంతో బెంబేలుపడతాడు. ఇంకే వుంది నవనాడులూ లాక్కొనిపోతున్నాయంటాడు. ఊరగాయకుండలు సర్దుకోండర్రా! అంటూ అప్పగింతలు ఆరంభిస్తాడు. తనగోడవే తనదికాని - 'ఫరవాలేదయ్యా - తలనొప్పికే ఛస్తారా' అని అన్నామా - 'నీకేం తెలుసునోయి - చావు మూడిందంటే తలనొప్పిచాలదా - ఏరోగం లేకుండా ఎందరు చావటంలేదు-' అంటూ చావులూ - ఆ చావుల కారణాలు ఏకరువు పెడతాడు. ఈయనతో వేగలేక - అలాగే పరిపెట్టుకుంటారు పాపం - యింట్లోవాళ్లు.

నన్ను చూసే - భానుమూర్తిగారు బ్రహ్మానందపడ్డట్టు సూచనగా - అంతవఱకూ సమానరాగంతో పట్టుతూన్న మూలుగు మాని - దుప్పటి ముసుగు తీసి చూసి - ఆ మూలుగు అక్షరాలతోనే - మధ్యమధ్య ఆపుతూ - బాధని యీ సమయంలోనే ప్రకటిస్తూ - 'వచ్చా-వా-నా యనా' అన్నాడు.

అవునండి - మాఅమ్మ చెప్పింది - మీరు చాలా బాధపడుతున్నారని. చూసిపోదాం అని వచ్చాను - అన్నాను.

'ఏమీ లేదునాయనా—యీ పన్ను చూశావూ' అంటూ నోరు తెరిచి ఓదంతాన్ని వేలెట్టి చూపించాడు. 'ఆఁ' అన్నాను. 'ఇదేనయ్యా ప్రాణాలు తీసేస్తోంది. ఒక్కటే సలుపు. సలుపన్న సలుపా—దీని తస్సాదియ్యా—ప్రాణాలు తోడేస్తోంది. ఏమీ తిననీయదు. నమలనీయదు. ఒకటేపోటు—ఏమీ తోచదు. యమబాధ. దీనికి సాధనం యేమిటో తెలియటం లేదబ్బాయీ—' అన్నాడాయన.

'దీని కింత బ్రహ్మాండం ఏవిటండీ—పంటివైద్యుడు మన ప్రక్కయింటిలోనే వున్నాడుగదా. పీకి పారేయించకూడదా. ఎందుకీ వృధాబాధ;' అన్నాను నేను.

'సరే — మన ప్రక్కయింటి డాక్టరు సంగతి చెబుతున్నావ్ — బావుంది—' అంటూ చాలా అసంతృప్తిని ప్రకటించే అభినయ పూర్వకంగా పాడి అక్షరాల్ని చప్పరిస్తూ వదిలాడు. ఆ వరస అంతా చూస్తే—ఆయనభావం నాకేమీ బోధపడలేదు. ఇంతకీ ఆయన్ని 'అలా అనడంలో మీ వుద్దేశం ఏవి' టన్నాను.

'ఆఁ ఏమిలేదు. అందరికీ తెలిసిన సంగతే గదా. మన పంటివైద్యుడు గారికి అంత ప్రాక్టీసు లేదని. ఏ నాబోటి అభాగ్యుడికో యిలాంటి విపత్తు రావడం, ఆయన సంపత్తు అనుకుంటాడు. భరింపరాని ఫీజుతో బిల్లు పంపుతాడు. మనం తూగగలమా నాయనా—' అంటూ ఆయన, ఆదాయ వ్యయ విమర్శన ప్రారంభిస్తూ—ప్రసుత ధరవరల పెరుగుదలని ఉదాహరిస్తూ 'వట్టి పంటిపోటుకే యింతింత బిల్లులు చెల్లించాలంటే—పిల్లలున్నవాళ్ళం పెద్ద కుటుంబీకులం—మనకి సాధ్యమా? చెప్పనాయనా!, అని అందుకున్నాడు.

'ఇంతకీ ఆయన ఏమన్నాడేవిటి—పోనీ నేనువెళ్లి తీసుకురానా—' అన్నాను.

వెంటనే అందుకున్నాడు భానుమూర్తి గారు. 'పన్ను తీసేయమన్నాను. అంతే వెండి పన్ను కాదు-బంగారుపన్ను కాదు-ఏదీఇమ్మనలేదు. ఈయమబాధపెట్టేపన్నుపట్టకారుతో పీకిపారేయడంఏమంతఘనకార్యం చెప్పు' పన్ను పీకడానికి తనకేం ఖర్చు చెప్పు! అవునా! యీ మాత్రం పన్ను పీకడానికి-మన పొరుగింటి డాక్టరుకి—అయిదు రూపాయలు అధమం ఫీజుట. ఏం చెప్పను నా మొహం. అందంగా వుండే పన్ను పీకి పారేశాక—నాకేమన్నా అందం వుందంటావా-ఆనందం వుందంటావా. పైపెచ్చు నోరు తెరిస్తే—ఆ పీకినస్థలంలో వట్టి బోసితనం కదా. అంచేత నే—డాక్టర్ని అడిగాను. పెద్దవాణ్ణి. పుణ్యమూ—పురుషార్థం—పెటుబడిలేనిపని. పూరికే పీకి పారేయండి. మరి కొన్నాళ్లకి—ఇంకేమైనా పళ్లు వూడేటట్టుంటే మీ చేత వూడదీయించుకుంటాను. అన్ని పళ్లూ వూడదీశాక—ఆఖర్ని మంచి పళ్ళు మీ చేతే కట్టించుకుంటాను. శక్తి వంచన లేకుండా చంద్రుడికో నూలుపోగన్నట్లు మీకు నేనిచ్చుకోనేది-ఇస్తాను-అంతా సాటివాళ్లం—మనం—మనం వొకటి—మీ నాన్నగారెంతటివారు. వసంతకుసుమాకరాన్ని ఇంట్లో వండించి ఎంతోమంది అతిమూత్ర వ్యాధుల్ని—దయాసముద్రులై—ఉచితంగా నివారణ చేసిన మహనీయులని—ఇంకా ఏవేవో చెప్పినా—ఆ పెంకి మనిషి కొంచమైనా విన్నాడా. పరీక్షలు ప్యాసయి—బోర్డులు కట్టుకొని—బస్తీలలో డిస్పెన్సరీలు పెట్టుకొని చేవార్సు వైద్యం చేస్తే—వేరే బిచ్చం ఎత్తుకోక్కర్లేదంటూ—తన వెలితిని ముఖాన పెట్టాడనుకో అబ్బాయీ అన్నాడు రుసరుసలాడుతూ భానుమూర్తిగారు.

'పోనీ—అయిదు రూపాయలేకదండీ—ఈ యమబాధ పడేకన్న—చేతివి అయిదు రూపాయలు పోనిచ్చి—పన్ను తీయించి పారేసి హాయిగా వుండదా? అయిదు రూపాయలకి కక్కుర్తిపడి—లోభించి—బాధపడడం నాకిష్టం లేదన్నాను.

'పడుచు కాపురం—చిలుకల మంటా!' అన్నారు. అయిదు రూపాయలంటే అంత తేలికటయ్యా. ఎంత కష్టపడితే అయిదు రూపాయలురాను. చెమటవోడ్చి సంపాదించిన సొమ్మని అంత తేలికగా ఖర్చు చేయడం ఏం వివేకం చెప్పు. రావడం కష్టం—వచ్చిన సొమ్మును యిలా వెచ్చిస్తే ఈ రోజుల్లో బ్రతకగలమా చెప్పు, పన్ను పీకడానికి - ఇంత ఫీజేమిటి, అబ్బాయీ - బాధైనా పడతాను కాని - ఆ పెంకిడాక్టరు కోరిన ఫీజు యిస్తాననుకొన్నావా? ఛస్తే-

★ పంటిపోటు ★

యివ్వను. యివ్వనంటే యివ్వను' అన్నాడు.

'పోనీ ధర్మాసుపత్రికి వెళ్ళకూడదా - అక్కడ వూరికే వైద్యం చేస్తారు. మందు లిస్తారు. పళ్ళుపీకుతారు. ఏ రోగాన్నైనా నయంచేస్తారు. నామాటవిని ధర్మాసుపత్రికి పొండి,' అన్నాను - తెలిసిందిగా - భానుమూర్తిగారు మహాలోభి.

'మానాయనే, కొంచం యడ్రసు చెప్పు. ఆ ధర్మాసుపత్రికి తోవ చెప్పు' అంటూ హఠాత్తుగా ఆనందం తెచ్చుకొని ధర్మాసుపత్రి వివరాలు విన్నాడాయన. 'తప్పకుండా వెళ్ళండి. బాధపడకండి,' అని చెబుతూ నేను ఇంటికివచ్చాను. మా అమ్మకి జరిగినదంతా చెప్పాను. 'భానుమూర్తిగారు చాలాలోభి. లోభికి ఖర్చుక్కువ. ఏబ్రాసికి పనెక్కువ అంటారు కాదటమ్మా' అన్నాను మా అమ్మతో.

ఆవిడకి భానుమూర్తి గారంటే పెద్దవాడని గౌరవం. పూర్వపు వాళ్ళకీ - ఇప్పటి వాళ్ళకీ ఆహార విహారాలలో - ఆరోగ్యంలో ఆదాయవ్యయాలలో ఎంతభేదం వుందో మా అమ్మ గంభీరోపన్యాసం యిచ్చింది - ఎకనమిక్సు చదివిన ఉపన్యాసకురాలులాగ, ఆవిడమీదవుండే గౌరవంకొద్దీ-మాఅమ్మతో వాదించక ఆఫీసుకు పోయాను. సాయంకాలం యింటికివచ్చాను. మాఅమ్మ భానుమూర్తిగారి ఇంటికి పోయిందన్నారు. ఎలావున్నాడో ముసలాడు అనుకుంటూండగానే మా అమ్మ ఇంటికివచ్చింది. ఎలావుందమ్మా? భానుమూర్తిగారికి? ధర్మాసుపత్రికి పోలేదా-ఆయన?' అన్నాను.

'వెళ్ళాడురా పాపం ఒక్కడూను. అక్కడ ఏదో చీటీ తీసుకోవాలట. ఆ చీటీ తీసుకోవడానికి బ్రహ్మాండంగా జనం వున్నారట. కొల్లేటి చేంతాడులాగవున్న ఆ వరసలో నిలబడి నిలబడి-భానుమూర్తిగారి కాళ్ళు పీక్కుపోయాయట. సరేనని-నానా అవస్థపడి-ఎలాగో చివరికి చీటీ సంపాయించుకొని-పంటివైద్యంచేసే చోటుకి మేడమెట్లెక్కిపోయాడట. అక్కడ ఇంకా చాలామంది వున్నారట. అది పెద్ద వరసలో నుంచోవాలట. పాపం అలా నుంచుంటోండగానే ఒంటిగంట అయిందట. ఆ డాక్టరు కొంతమందిని తనిఖీచేసేసి-మిగిలినవాళ్ళంతా రేపురండి! అన్నాడట. ఈయనా-ఈయనతోటి పంటిరోగులు చక్కావచ్చారట. పాపం మళ్ళీ రేపు వెళ్ళాలంటున్నాడు-' అంది మా అమ్మ.

'అరే! అలాగయిందా! తప్పకుండా రేపు వెళ్ళమనవమ్మా-కానీ ఖర్చులేకుండా పన్ను పీకేస్తారు—' అన్నాను.

'ధర్మాసుపత్రికి వెళ్ళిరావడానికి ఒక రూపాయి ఖర్చయిందట ఆయనకి. మళ్ళీ రేపు పోవాలికదా. ఇంకో రూపాయి ఖర్చు. అప్పుడే రెండు రూపాయలు ఖర్చవుతోందే-అన్నాడాయన. పెందరాళేపోతే యివాళే పన్ను పోయేది! రేపు పెందరాళే పోవాలి! అంటున్నాడు భానుమూర్తిగారంది-అమ్మ!

"అలా చూసుకున్నా అయిదు రూపాయల ఖర్చు తప్పిందికదా—రెండు రూపాయలతో పన్నుపోతే మూడు రూపాయలు భానుమూర్తిగారికి లాభమేనమ్మా' అన్నాను నేను.

'ఆయనా అలాగే అనుకుంటున్నాడు. పంటిబాధ ప్రమాదం కాదనీ— ఇలాంటిలాంటి బాధ పడుతూన్న వాళ్ళని ధర్మాసుపత్రిలో చాలా మందిని చూశాననీ—తనకేం ఫరవాలేదనీ— ఇవాళకి కొంచెం ఓపికపడితే—రేపు పూర్తిగా పంటిని పీకేయించుకోవచ్చుననీ— ఇదంతా నీవు చూపించిన సదుపాయం—అనీ —ధీమాగా వున్నాడురా భానుమూర్తిగారు—" అంది అమ్మ.

'పోనీ లేవమ్మా—వెయ్యేళ్ళకీ ఆయన ఖులాసాగావుంటే అంతేచాలు! పెద్దవాడు పాపం' అన్నాను.

మర్నాడు ఆఫీసునుంచి వచ్చింకే తడవుగా-మా అమ్మ ఆతురతతో "పోయి - భానుమూర్తి మావగార్ని చూశిరా! నాయనా!" అంది. "ఏమమ్మా - ఖులాసాలేదా - అంత కంగారుచేస్తావెందుకమ్మా" అన్నాను.

"ముందు-వెళ్ళిచూసిరారా" అంది అమ్మ. ఏంకొంపమునిగిందోనని-గుండెల్ని గుప్పెట్లో పెట్టుకొని బయలుదేరాను. నేనేగా ధర్మాసుపత్రికి పొమ్మన్నది. ఏమయిందో అక్కడ. ఏలావున్నాడో యిక్కడ! ఏమిటో అయోమయంగా కనబడింది. చరా-చరా-భానుమూర్తిగారి ఇంటికిపోయాను. వీడిల్లు బంగారంగాను తెగ అల్లరిచేస్తున్నాడు. కుర్రాడిలాగ, ఒక్కటే కాకిగోల. పన్నుపీకించుకొని-ఇంత గాబరాచేస్తాడెందుకో నాకర్థం కాలేదు.

"ఏమిటి మావగారూ - ఏమిటిదంతా-" అన్నాను.

"వచ్చావా - నాయనా - రా! బాబూ! కూర్చో!" అంటూ బాధతో ఒగరుస్తున్నాడు - ఆ ఒగర్పుతోనే చెబుతున్నాడు.

"నిన్న ఏంజరిగిందో విన్నావుకదా"— అన్నాడు.

'ఆఁ మా అమ్మచెప్పింది'-అన్నాను.

"చెప్పిందికదా, ఇవాళ పెందరాళే వెళ్ళాను ఆస్పత్రికి. మళ్ళీ యింకోరూపాయి ఖర్చు. మొత్తం రెండు. నిన్నా - యివాళా కలిపి రెండురూపాయలయ్యాయి. రూపాయలమాట అటుంచు, అక్కడ యీ పంటిబాధగల ఆసాముల నందర్ని ఒక కోటుమనిషి వచ్చి తనిఖీచేశాడు. తనిఖీచేసి ఒక గదిలోకి పొమ్మన్నాడు. వరసాగ్గా - అందరం ఆ గదిలో కూర్చున్నాం. మరో కోటుమనిషి వచ్చి నోరుతెరవండి - అలాగే తెరుచుకొని వుండండి అన్నాడు. అక్కడ వున్నవాళ్ళందరం నోళ్ళు అలాగే తెరుచుకొని వున్నాం. ఒక సీసాడు మందుతో ఆ కోటుమనిషి ఒక్కొక్కడి పంటివరసకే మందు పులుముతున్నాడు నాదగ్గరికే వచ్చాడు. బాగా రుద్దేసిపోయాడు అబ్బాయీ. నమ్ముతావో నమ్మవో కాని-ఆ మందు ఆ పళ్ళవరసకి రుద్దేశాక అంతా అయోమయంగా వుందనుకో— అన్నాడు భానుమూర్తిగారు.

'ఏం - వికారంపెట్టి - పైత్యించిందా?' అన్నాను.

"పైత్యమూ కాదు శైత్యమూ కాదయ్యా నాయనా. ఆ మందుపూత వున్నంత మేరా మొద్దుతిమ్మిర అనుకో. బాధపెట్టే పంటి గొడవ గప్‌చిప్. వ్యాధులు డాక్టర్లకి హడిలిపోతాయికొంసు - మంత్రగాడికి దెయ్యాల లొంగినట్లు!" అంటాడాయన.

'బాగానే వుంది - ఇంతవరకూ. తరవాత ఏమయిం' దన్నాను.

(56- వ పేజీ చూడండి)

విధి విధానమ్

(నాటిక)



(గతసంచిక తరువాయి)

3 వ రంగము

[ఒక వారం తర్వాత. ప్రొద్దుట 9 గం.ల వేళ. రాజేశ్వరి ఇంటిముందరి పువ్వులచెట్టు దగ్గిరనుంచుని పుష్పాలు సజ్జలో కోస్తోంది. ఇంకో పక్కనుంచి వెంకట్రావు వచ్చి నిలబడతాడు.]

వెం : (మెల్లిగా) క్షమించండి. (రాజేశ్వరి ఉలిక్కిపడి అతనికేసి చూస్తుంది.) మీతో కొంచెం మాట్లాడదామని వచ్చాను. మీకేం అభ్యంతరం లేకపోతే...

రా : (మధ్యలో ఆపుతూ) ఇంట్లోకెళ్ళి మాట్లాడుకుందాం. లోపలికిరండి.

వెం : ఒద్దు. నా ఉద్దేశం మీతో ఏకాంతంగా మాట్లాడాలనీ. ఇంట్లో అయితే అంతా వుంటారు.

రా : (జంకుగా) కాని, మనం ఏకాంతంగా మాట్లాడుకోవలసిన అవసరం నాకేం కనిపించడం లేదు.

వెం : మీరు నన్ను తప్పర్థం చేసుకోవద్దని కోరుతున్నా. ఇప్పటి కన్నో పుస్తకాల్లో చదివినట్టూ, సినీమాల్లో చూసినట్టూ, నేను మీ ప్రేమ నర్థించడానికే వచ్చాను. అయితే, నా ఉద్దేశం మిమ్మల్ని మోసం చెయ్యడం మాత్రం కాదు.

రా : క్షమించాలి. నా పై అధికారి మా నాన్నగారు. మీ రాయనతోనే మాట్లాడ్డం భావ్యంగా వుంటుంది.

వెం : (నిరుత్సాహంగా) అయితే మీకు నామీద ఏమాత్రం ప్రేమలేదా?

రా: (నిర్లిప్తతగా) అటువంటి ప్రశ్నల వల్ల ఏం లాభం? నేను సమాధానం చెప్పడానికి నిరాకరిస్తాను.

వెం: పోనీ, ఇదైనా చెప్పండి. నాతో వివాహాన్కి మీకేమైనా అభ్యంతరం వుంటుందా?

రా: ఉండదు-మా నాన్నగారికేం అభ్యంతరం లేకపోతే.

వెం: అయితే, మీకు నామీద ప్రత్యేకమైన...ఆఁ...ఇదేం లేదన్నమాట! అంటే నా వుద్దేశం, మీ నాన్నగారి కెవరు నచ్చితే వారినే వివాహం చేసుకుంటారన్నమాట? అవునా?

రా: (చిరునవ్వుతో) అవును. అందులో ఏమన్నా తప్పుందా? మా నాన్నగారిమీద నాకెంతటిభక్తి-గౌరవాలున్నాయో, మా నాన్నగారికి కూడా నామీదంతటి ప్రేమాభిమానాలున్నాయి.

వెం: (ఆలోచనగా) నా అదృష్టాన్ని పరీక్షించుకుందుకు ఒక అవకాశాన్నిస్తున్నారన్నమాట. నే నింటికెళ్ళి...(రామారావు గారు ఇంట్లోంచి బయటకొస్తారు. ముక్కుమీద కళ్ళజోడూ, చెవులో పెన్సిలూ వుంటాయి. నాలుగువైపులా చూస్తారు. రాజేశ్వరీ, వెంకట్రావూ కనిపిస్తారు. ఆయన ముఖభావాలు కోపముగా మారిపోతాయి.)

రామా: (కఠినంగా) అమ్మాయి, మీఅమ్మ పిలుస్తోంది నిన్ను. లోపలికెళ్ళు. (రాజేశ్వరి లోపలి కెళ్ళిపోతుంది. ఇంకో పక్కనుంచి వెంకట్రావు కూడా వెళ్ళిపోతాడు.)

[తెర పడిపోయి మళ్ళీ లేస్తుంది. మేడమీద ప్రభాకరం గదిలో, ప్రభాకరం, వెంకట్రావూ వుంటారు.]

వెం: (కంగారుగా) ప్రభాకరం, నువ్విప్పుడు నన్ను రక్షించాలి.

ప్ర: (చెయ్యి ముందరికి చాపి) అభయమిచ్చాను వత్సా, నీకు వచ్చిన విపత్తేమి?

వెం: వేళాకోళం కాదు. నేన్నిజంగానే అడుగుతున్నా. నేను మీ చెల్లాయిని ప్రేమిస్తున్నాను. ఆవిడకి నన్ను పెళ్ళి చేసుకుందుకు ఇష్టం వుందో లేదో, తెలుసుకుందామనీ అడుగుతూంటే...

ప్ర: ఈపాటి దానికి భయపడగడ మెందుకూ? పన్నడగమంటే నేనడిగుందును కదూ! అది సరేకాని, ఈ ప్రేమ వ్యవహారం పెళ్లి చేసుకుందుకా, లేక గిరీశం చేద్దామనా?

వెం: (చురుగ్గా) గిరీశం చెయ్యడం లేదు-ఏం లేదు. నువ్వుకూడా అలా మాట్లాడుతావేమిటోయ్? చదువుకున్నవాడవ్?

ప్ర : (అనునయంగా) నిన్ను నొప్పిందామని అవలేదు. నాకు రొమాన్సు అర్థం కాదు అంతే. అయితే ఇంతకీ నువ్వనే దేమిటి?

వెం : మీ చెల్లెలు ఒక షరతుమీద ఒప్పుకొంది. నేను ఇంటికి వెళ్ళి పెద్దల ద్వారా పెళ్ళి ప్రయత్నాలు జరిపిస్తాను.

ప్ర : హేయ్! కంగ్రాచు లేషన్స్! పనులు చాలా చురుగ్గా జరిపించేస్తున్నావు. మరయితే ఇందులో నేను రక్షించాల్సిందే వుంది? (వేలగా) నాలో వుత్తి ఆశలు లేవా? నిన్ను నిజంగా రక్షించాలేమోని ఎంతో ఆశపడ్డాను. కాని......

వెం : (నవ్వి) తొందర పడకు నేచెప్పేది విను. నేను మీ చెల్లెలుతో మాట్లాడుతుంటే (గోపి గదిలో కొస్తాడు.)

గో : అన్నయ్యా, నాన్నగారు నిన్ను రమ్మంటున్నారు.

ప్ర : వస్తానుండు (వెంకట్రావు కేసి తిరిగి) సరే త్వరగా చెప్పెయ్, తర్వాతేం జరిగింది.

వెం : ఏంలేదూ మేం మాట్లాడు కోడం మీ నాన్నగారు చూశారు అంతే. కోపంగా మారిపోయారు. దాంతో నాకేం

★ విధివిధానమ్ ★

మాట్లాడా వికిభయం వేసింది. ఇలా వచ్చేశాను. ఇప్పుడు నువ్వెళ్ళి సర్ది చెప్పు మీ నాన్నగార్కి. నేనీవేళే ఇంటికి కడుతున్నా. మా వాళ్లతో మాట్లాడి వెంటనే నీకు త్తరం రాస్తా.

ప్ర: ఊఁహుఁ. సరే అయితే ముందర నేను కిందకెళ్ళి నాన్నగార్ని చూస్తా. తర్వాత నీ ప్రయాణం విషయం మాట్లాడుకుందాం. (లేచి గోపీని తీసుకు బయటకి వస్తాం టే.)

[తెర పడిపోతుంది]

[రంగము : 4]

[అదే రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలవేళ హాలు పక్కనున్న గదిలో రాజేశ్వరి ఒకమంచంమీద కూర్చునుంటుంది. ప్రభాకరం, వాళ్ళమ్మగారూ వాళ్ళక్కయ్య తలోకుర్చీలోనూ కూర్చునుంటారు. అందరూ కబుర్లు చెప్పుకుంటూంటారు. అప్పుడే సుమిత్ర వస్తుంది. రాజేశ్వరి పక్కని కూర్చోమని చెయ్యూపుతుంది. సుమిత్ర కూర్చుంటుంది.]

సు: అల్లా వున్నారేమండీ?

రా: తలకాయ నొప్పిగా వుందండీ.

ప్ర: అదంతా వేరే వ్యవహారం లెండి, తలకాయ నొప్పి కాదు....

సు: (ఆశ్చర్యంగా) ఆఁ?

ప్ర: ఆఁ కాదు. ఏమిటి వ్యవహారం అనండి.

సు: (నవ్వుతూ) ఏమిటి వ్యవహారం?

ప్ర: (చిరునవ్వుతో) మనందరం పెళ్ళివార మవబోతున్నాం. (సుమిత్ర రాజేశ్వరి కేసి చూస్తుంది.)



రా: (సిగుపడ్డానిక్కి మొహమాటపడి, విసుగ్గా) ఏవిట్రా అన్నయ్యా, చంటి కుర్రాడిలాగ.

సు: (ఆతృతగా) పెళ్ళికొడు కెవరో అడగచ్చునా?

అమ్మ: (చటుక్కున జ్ఞాపకంవచ్చి) ఏరా అబ్బాయీ, వాళ్ళకేవన్నా ఆస్తుందా?

ప్ర: (సుమిత్రకేసి తిరిగి, అదేదో గమ్మత్తులా మొహంపెట్టి) మా ఇంట్లోనే వున్నాడు. (వాళ్ళమ్మగారి కేసి తిరిగి) వాళ్ళు బీదవాళ్ళు కాదు. అంతవరకూ నాకు తెలుసు. అంతకంటే వివరాలు తెలవ్వు.

సు: (సందేహంగా) మరయితే ఆయన ఇక్కడే వున్నారుకదా...?

[ఇంతలో గోపీ వస్తాడు]

గో: అన్నయ్యా, ఆయన భోజనం మాటేం చేశావో అడిగి రమన్నారు.

ప్ర: (కంగారుగా) ఏమే అమ్మా, అతనికి అన్నం పెట్టించెయ్యవే లేకపోతే ప్రయాణానికి పొద్దుపోతుంది.

అమ్మ: వెళ్ళమ్మా రాజేశ్వరీ, వెళ్ళి వంటావిడతో చెప్పిరా.

రా: అన్నింటికీ నేనే (విసుగ్గా లేచి లోపల కెడుతుంది)

[సుమిత్ర లేచి బయటికెళ్ళి పోతుంది]

అమ్మ: (విచారంగా) ఈ ఆడపిల్లలే కూడా-కూడా తిరుగుతూంటారు. మనస్సు కెంతో దగ్గరనా వుంటారు. వాళ్ళింకో ఇంటివాళ్ళై, వెళ్ళిపోతారంటే, మనస్సెలాగో అయిపోతుంది.

ప్ర: మరింతకాలం, అదెప్పుడు ఒక ఇంటి దాతుందో అని గొడవ లేవు.

అక్క: మరేనాయినా, కోడళ్లకి చోటు చెయ్యడానికనీ (రాజేశ్వరి వస్తుంది. భోజనం సిద్ధంగా వున్నట్లు తలూపి, వెళ్ళి మంచంమీద కూర్చుంటుంది)

ప్ర: వెళ్ళరాగోపీ...ఒద్దులే నేనే వెడతాను. (లోపలకి వెడతాడు.)

గో: అమ్మా, ఏమన్నా తింటే బాగుండు ననిపిస్తోందే.

అక్క: అల్లాగామ్మ బాబూ, రెండు తన్నులు తింటే బాగుండుననిపించడం లేదూ?

గో: (చేతులు తిప్పుతూ, మాటలు సాగ తీస్తూ) లేదమ్మా. అవి మీ అబ్బాయికోసం వుంచుకో. (వాళ్ళమ్మగారి దగ్గరకి వెళ్ళి కొంగులాగుతాడు. చేతికి ముడితగులుతుంది. విప్పుతూంటాడు.)

రా: (చిరాగ్గా) వాడికి రెండు తగల్నివ్వక ఏవిటే అమ్మా, ఆ ముద్దు?

అమ్మ: (నవ్వుతూ, ఉత్తుత్తికోపంతో) ఫోరా, వీధిలోకి. ఆ సత్రూవం దబ్బలాటకే

గో: (చీరముడివిప్పి, బిస్కట్లు చేతిలోకి తీసుకుని) ఆ దెబ్బలు మీ అబ్బాయి పుట్టేదాకా దాచుంచుకోమ్మా. (రాజేశ్వరి కోపంగా లేస్తుంది. గోపి ఒక బిస్కట్టు నోట్లో వేసుకుని, అక్కలిద్దరికేసి, నాలిక తిప్పి వెక్కిరించి వీధిలోకి పరిగెత్తుకు వెళ్ళిపోతాడు. తెర పడిపోతుంది.)

[మళ్ళీ 30 నిమిషాలతర్వాత తెర లేస్తుంది. అదే గది. రాజేశ్వరీ, వాళ్ళమ్మగారూ, అక్కా కూర్చునివుంటారు. పనికుర్రాడు వెడింగూ, ఒకపెట్టె పుచ్చుకుని హాల్లోకి వెడతాడు. ప్రభాకరం, వెంకట్రావూ గదిలోకొస్తారు.]

వెం: (అమ్మగారికేసి తిరిగి) వెళ్తొస్తానండీ.. (ఇంకా ఏదో చెప్పబోయినట్టు మొహంపెట్టి, మొహమాటపడి వూరుకుంటాడు)

అమ్మ: వెళ్ళిరా నాయనా. వెళ్ళగానే క్షేమ-సమాచారాలు ఉత్తరం రాయించు. (వెంకట్రావు తలూపి, రాజేశ్వరికేసి ఒక చూపు విసిరి హాల్లోకి నడుస్తాడు.)

ప్ర: అతన్ని బస్సెక్కించి వస్తానే అమ్మా. (హాల్లోనుంచి సుమిత్ర గొంతుక వినిపిస్తుంది.)

సు. గొం: ఈ పుస్తకం తీసుకెళ్ళి దారిలో చదువుకోండి. కాలక్షేపంగా వుంటుంది.

వెం. గొం: (ముభావంగా) థాంక్స్. (గదిలోనివారంతా ఒకరిముఖా లొకరు చూసుకుంటారు.) (ప్రభాకరం బయటికెళ్లి పోతాడు.)

సు: (గదిలోకివస్తూ) ఇక్కడ పుస్తకాలు మర్చిపోయానాండీ! ఇంట్లో కనిపించకపోతే ఇక్కడ మర్చిపోయానేమోనని వచ్చా.

రా: చూసుకోండి. (నాలుగు వెంపులకీ చూసి) ఇక్కడ ఎక్కడా కనిపించడం లేదు మరి; ఎక్కడ మర్చిపోయారో.

సు: దార్లో ఇంకో స్నేహితురాలింటికి వెళ్ళాను లెండి' అక్కడ మర్చిపోయానేమో చూస్తా...వస్తా. (బయటికి వెళ్లిపోతుంది.)

అక్క: (రాజేశ్వరికేసి తిరిగి, చురుగ్గా) అదంతే నాగరిక లేవిటే, ఆ పిల్లాడికి పుస్తకమియ్యడం, అదీను?

రా: (నొచ్చుకుని) ఏమో. ఆ అమ్మాయి పద్ధతంతా అదో రకం. నాకేం అర్థంకాదు. మొన్న నన్ను పెళ్ళిచేసుకో తల్చుకో లేదా అనడిగింది.

అక్క: (గంభీరంగా) ఏం సమాధానం చెప్పేవు?

రా: (మామూలుగా) ఎందుకు చేసుకోమా మావాళ్ళు ఎప్పుడు చేస్తే, అప్పుడు చేసుకుంటానని చెప్పేను.

అక్క: (వాళ్ళమ్మగారి కేసి తిరిగి,)

వెటకారంగా) విన్నావే అమ్మా? అదిట దీని సమాధానం! (కోపాన్నాపుకుంటూ) ఆ పిల్ల మనింటికొచ్చి మాటలంటూంటే, ఈవిడ గారు నోరు మూసుకు కూచుంది. నన్నడ గాల్సింది చెబుదును.

రా: (కొంచెం కోపంగా) నువ్వేదీ మరీబాగుందే! మనింటికొచ్చిన అమ్మాయిని పట్టుకు మాటలనమంటావు?

అమ్మ: (శాంతంగా) మాట మనమీదుంటే ఏం నష్టం లేదు. చెడ్డ వాళ్ళని వాళ్ళే రక్షించుకోవాలి కాని, మంచివాళ్ళని భగవంతుడు రక్షిస్తాడు. (లేస్తూ) లేవండి. భోజనాల వేళయింది; మీనాన్నగారు వస్తారు. (అంతా లేస్తారు.)

[తెర పడిపోతుంది.]

[రంగము : 5]

[8 వారాల తర్వాత. అదే ఇల్లు. హాలు పక్కనున్న గదిలో రాజేశ్వరి కూర్చుని పుస్తకం చదువుకుంటూంటుంది. సాయంత్రం నాలుగు గంటల సమయం. ప్రభాకరం ఒక ఉత్తరం పుచ్చుకుని గదిలోకి వస్తాడు.)

ప్ర: చెల్లాయ్, ఇన్నాళ్ళనుంచీ ఎదురు చూసిన ఉత్తరం వచ్చింది. కాని, ఇందులో విషయాలు నీకేమని చెప్పాలో తెలియడంలేదు. ఇదిగో ఉత్తరం, నువ్వే చదువుకో.

రా (ఉత్తరంతీసి చదువుకుని, శాంతంగా) ఈ సుమిత్ర అసాధ్యురాల్లాగుంది.!

ప్ర: (కోపంగా) అసాధ్యురాలా? అంతకంటే దుర్మార్గురాలనడం భావ్యంగా వుంటుంది!

రా: అదేమన్నమాట! నేను చేతికి దొరికిన దాన్ని మర్యాదపేరుతో పోగొట్టుకున్నాను. దాన్నే సుమిత్ర తెలివి తేటలతో సాధించింది.

ప్ర: (కటువుగా) అది తెలివితేటలనకు ఆ అమ్మాయిని పెంకిఘటం అను బాగుంటుంది. ఇంతకీ వాళ్ళెక్కడ? నేనువెళ్ళి..

రా: (ఆపుతూ) ఎందుకురా అనవసరంగా గొడవ పెంచుకోడం? అసలు తప్పంతా నాదీ. నేను పనిపట్టుకుని, నా చిన్నప్పటేం జరిగిందనుకున్నారూ, అని ఆ నూక్కలు గొడవంతా చెప్పేను. ఆ అమ్మాయి అవసరాన్ని వాడుకుంది.

ప్ర: (ఆలోచనగా) ఇంతకీ అతనెంత దగటోచూడు. ప్రేమ ప్రేమని, పెద్ద కబుర్లు చెప్పేడు. ఎవరో ఆ అమ్మాయికి చిన్నప్పటేదో పుకారు పుట్టించడంతే వదిలిపోయాడు. ప్రేమంతా ఎగిరిపోయింది.!

రా: ఆయన రాసినదాంట్లో నాకేం తప్పు తోచడంలేదు. ఆ అమ్మాయి ప్రేమిస్తోందిట కూడాను.




ఉపదేశం

రెండు నెలలనుంచి కనబడని రాజు అకస్మాత్తుగా తటస్థపడే టప్పటికి వెంకట్రావుకి దోసెడు సంతోషం వేసింది. రాజు పాత కాలపు స్నేహితుడూ. సరదా మనిషీను.

"తప్పిపోయావని పేపర్లో వేయిద్దా మనుకుంటూంటే కనబడ్డావు. ఏమయి పోయావురా ఇన్నాళ్లూ?" అన్నాడు వెంకట్రావు నవ్వుతూ.

"ఏమయిపోతే, నీకేం లేరా, వధూవరులకి ఆశీర్వచనాలూ గట్రా అంటూ ఓ టెలిగ్రాం ముక్కయినా పంపలేనివాడివి!" అన్నాడు రాజు.

"పెళ్ళేమిటి?" అన్నాడు వెంకట్రావు, ఆశ్చర్యంగా. "కంగ్రాట్యులేషన్సు. కాని విషయమంతా చెప్పు."

"ఏముందీ, ఓ ఇంటిని పెళ్లాడితే కుందన బొమ్మలాంటి పిల్ల కట్నంగా దొరికింది. బూరెముక్క కొరకడానికి నువ్వు రాలేదని బోలెడు కోప మొచ్చింది. శుభలేఖ అందలేదని బొంకకు."

"నిజంగా అందలేదురా. మా హోటలు ఎడ్రసుకి పంపేవను కుంటాను. అక్కణ్ణుంచి మారేంలే ఈమధ్య ఇన్నాళ్ళకి అద్దె కొంపొకటి దొరికింది. ఇంటివారికి వెయ్యి కరుకులా కట్నం చదివించేను."

"అయితేనేంలేరా. వదిన ఇన్నాళ్లూ వండిపెడతానని ఊరించిన వంటకాలు తినిపించడం మొదలెడితే వెయ్యి రూపాయల్లోనూ

DL. [illegible]

ఏగాణియినా వృథా కాదనుకో. అన్నట్లు, ఎలావుందావిడ?"

వెంకట్రావు భార్య కమలని రాజు వరసకి వదినా అనే పిలిచేవాడు.

వెంకట్రావు హైదరాబాదు బదిలీ అయినప్పటినుంచీ ఇల్లు దొరకక కమలతో "హోటలు భోజనం ఒంటిగది కాపురం" చేస్తూండేవాడు. కమల వంటలో సిద్ధహస్తురాలు. అందుచేత ఆవిడకి హోటలు భోజనం అసలే నచ్చేదికాదు. "ఇల్లు దొరకనీయండి చెప్తాను. బెరడుకట్టిపోయిన జిహ్వలకి మళ్లీ జీవం పోస్తా నావంటలతో!" అనే దావిడ. కొత్త రకం వంటలేవేనా పత్రికల్లోవస్తే కత్తిరించి ఉంచుకొనేది. రాజు వాళ్ల గదికి వెళ్లినప్పుడల్లా వదినా, కత్తిరింపు కాగితాల్లో కట్టిన నీ ఆశాసౌధానికి గృహప్రవేశ మెప్పు డమ్మా?" అని అడిగేవాడు.

నేటి కారోజు వచ్చింది.

"దానికేం, దంచేస్తోంది." అన్నాడు వెంకట్రావు.

"వండిన సరుకు వండకుండా వారాలు గడిపేస్తోంది ఇంటి భోజనం వంటబట్టి ఎలా ఊరేనో చూడు... అన్నట్లు వీలుగా ఉంటే ఆదివారంనాడు నీ 'కట్నాన్ని' వెంటబెట్టుకుని భోజనానికి చక్కారా. పిచ్చాపాటీ మాట్లాడుకుందాం."

అల్లాగే అని ఎడ్రసు తీసుకుని వెళ్లిపోయాడు రాజు.

తరచు తన వంట విషయం మాట్లాడే రాజు భోజనానికి వస్తాడంటే, పైగా క్రొత్త పెళ్లాన్ని తీసుకుని వస్తాడంటే, కమల కెంతో ఉత్సాహంగా ఉంది. మామూలుకంటే ఎక్కువ శ్రద్ధతో పదార్థాలు తయారుచేసింది.

రాజూ, లీలా పదింటికల్లా వచ్చేరు. పరిచయాలూ, అభినందనలూ అయ్యేక రాజన్నాడు: "వదినా, నేటికాలానికి నోచుకున్నా మమ్మా నీ చేతి భోజనం. కాని ఓ పూట తింటే ఏం తెలుస్తుంది? కనక రాత్రికూడా ఇక్కడే పడ్డు. మధ్యాహ్నం మిగిలినవే వెచ్చచేసి మళ్లీ వడ్డిద్దామని ఆశ పెట్టుకోకు. మధ్యాహ్నానివేవీ మిగలవు, చెప్తున్నా!"

నలుగురూ కూర్చొని ఓ గంటసేపు కబుర్లు చెప్పుకున్నాక కమల భోజనాలు సిద్ధంచేసింది.

పప్పూ, వంకాయ కారంపెట్టిన కూరా, కొబ్బరికాయ పచ్చడీ, పులుసూ, బజ్జీలూ, జిలేబీ—అదీ కొత్త దంపతుల కోసం ఆవిడ అమర్చిన విందు భోజనం. ఒక్కొక్క పదార్థమే రుచి చూసి అమోఘంగా ఉందన్నారందరూ. కమల ఆనందానికి అంతులేదు.

ప్ర : (మెరిసే కళ్లతో) ఇప్పుడు నేనా పెళ్లాపుచేసి, ఆ అమ్మాయిమీద పుకార్లు లేవతీస్తే?

రా : ఏమిటి లాభం?

ప్ర : (నిదానంగా చూస్తూ) నీ మంచితనంచూస్తే నాకాశ్చర్యం, అనుమానం వేస్తున్నాయి! ఇందులో ఏదన్నా...

రా : (అన్నగారికేసి విచారంగా చూస్తూ) నేను గొప్పగా భావించే నా మంచితనం ఇంత ఘోరరూపం ధరిస్తోందన్నమాట! (ధైర్యంగా) నీకేం చెయ్యాలని తోస్తే అది చెయ్యొచ్చు అన్నయ్యా. అందువల్ల నాపాత గాథలన్నీ బయట పడతాయని నాకు భయం లేదు. ఎందుచేతంటే, ఏంలేవు కనక!

ప్ర : (పశ్చాత్తాపంతో) నేనల్లా అనకుండా వుండాలిసింది. నీమీద నాకు చెడ్డ అభిప్రాయం లేదు. కాని, ఒసారి అటువంటి మాట అని నీలోవచ్చే రియాక్షన్ చూద్దామనిపించింది. నిజంగా, నిన్ను బాధపెట్టినందుకు ఎంతో విచారిస్తున్నాను. నన్ను క్షమిస్తావా?

రా: అల్లా అనకన్నయ్యా. నీ మనస్సులో నామీద అపనమ్మకం లేకపోతే నాకు సంతోషమే. ఇంతకీ ఆ పెళ్లాపు చెయ్యొద్దని ఎందుకన్నానంటే నన్ను విరోధిగా నమ్మినా, పెళ్ళిచేసుకు ఈ వూళ్ళో మొహం ఎత్తుకు తిరగలేనన్న, ఆ భయస్తుణ్ణి పెళ్ళాడి, నేను మొహం ఎత్తుకు తిరగలనా? అని.

ప్ర : (నవ్వుతూ) ఆ బావగార్ని చూసి నేను మొహంఎత్తుకు తిరగ్గలనా? నువ్వన్న దాంట్లో అర్థం వుంది. కాని, ఆ సుమిత్ర మీద నాకు చాలా కసిగా వుంది. మన కళ్ళ ముందర అతనికి పుస్తకంఇచ్చింది. వట్టిపుస్తకమా? ఊహు ఉత్తరంపెట్టె! వట్టి వుత్తరమా? ఊహుఁ. నీపెళ్ళి చెడగొట్టేవుత్తరం!!

రా : ఆ అమ్మాయి కెంత గొప్పగా వుంటుందో తెలుసా, ఈ ప్రేమపెళ్ళి విజయాన్ని గురించీ?

ప్ర : అదీ ఓ గొప్పే నేవిటి, ఇతరులపెళ్ళి చెడగొట్టి? వెంకట్రావు వెళ్ళేముందర, కావలసిన ఇన్ఫర్మేషన్ నేనిచ్చాను

రా : ఆ సమయానికా అమ్మాయిరావడం చూడు. ఇంతకీ, ఆ సుమిత్ర అదృష్టవంతురాలు. ఆ తర్వాత ఈ దారంటే వెళ్ళడం లేదు.

ప్ర : పీడ విరగడైంది. నువ్వేం దురదృష్టవంతురాలవనుకోకు చెల్లాయి. నీకు తగిన సంబంధం తెచ్చే పూచీ నాది.

రా : నా పెళ్ళికి నాకేంతొందర లేదు కాని, ఈమాటవిని, అమ్మ - నాన్న ఎంత విచారిస్తారో అని బాధగావుంది.

ప్ర: (అనునయంగా) అందుకు నువ్వేం విచారించకు. వాళ్ళకి నేను నచ్చ చెబుతాలే. అటువంటి మనోధైర్యం లేని మొగాడికిచ్చి నిన్ను పెళ్ళిచేసి, తర్వాత బాధలు పడకుండా బతికిపోయామని చెపాను. ఆమాట నిజం కూడాను. ఈ విషయమై నివ్వేరకమైన బెంగా పెట్టుకోకం?

రా: (ఆప్యాయంగా) నేను బెంగెట్టు

వుంటూ నేనోమోని నువ్వు ముందరే బాధపడకు. (కోపీగా) ఇంట్లో ఎవరూ బాధపడకుండా నువ్వు చూస్తావన్నావుకదూ. నాకింకేం బాధలేదు. (సిగ్గుగా, చిరునవ్వుతో) నీవంటి సహృదయుడైన అన్నగారికి చెల్లెలుగా పుట్టినందుకు ఎంతో సంతోషిస్తున్నాను.

ప్ర: (నవ్వుతూ) తమరి పనైందికదండీ ఇంకెందుకు పొగడ్తం? (బయటికి వెడతాడు.)

[తెర పడిపోతుంది.]

[రంగము: 6]

(8 గం. ల తర్వాత. అదే ఇంట్లో మేడ మీద గది చక్కగా అలంకరించిన శోభనపు గది. రాత్రి 10 గం. ల సమయం. గది తలుపు వానుకుని, బాగా అలంకరించబడిన రాజేశ్వరి నిలబడుంటుంది. 28 సం. ల యువకుడు కిటికీదగర నిలబడి బయటికి చూస్తూంటాడు. రెండు నిమిషాల తర్వాత గది లోపలికి వస్తాడు.)

యువ: (రాజేశ్వరితో) ఈ కుర్చీ లో కూర్చుందుకేమన్నా అభ్యంతరం వుంటుందా?

రా: ఉహుఁ. (వచ్చి కూర్చుంటుంది.)

యువ: (నవ్వుతూ) థేంక్స్ చెబుతావనుకున్నాను.

రా: (సందేహంగా, మెల్లిగా) చెబుదామనే అనుకున్నాను.

యువ: ఊఁ?

రా: మీరు...

యువ: (ఆపుతూ) నన్ను మీరనద్దు. నా పేరు సూర్యం పేరెట్టి పిలు.

రా: ప్రయత్నం చేస్తా.

సూ: నే నిన్ను తొందరపెట్టను. కాని, నీ ప్రయత్నంలో విజయం సాధించేట్టు మాత్రం చూడు. (చటుక్కుని జేబులోంచి ఒక కవరులాగి) అది సరేకాని, ఈ వుత్తరం చదివి...

రా: (దూకుడుగా కుర్చీలోంచి లేస్తుంది) క్షమించాలి.

సూ: (నిశ్చలంగా) కుదరదు. క్షమించాలి. బయట గోళ్ళెం పెట్టుంది (దయగా) నాతో మాట్లాడ్డం కష్టంగా వుందా? కూర్చో.

రా: (కూర్చుని) లేదు.

సూ: అయితే దాన్నిగురించి చెప్పేసే...(వానుస్తాడు.)

రా: (బరువుగా నిట్టూరుస్తూ, తనలో అనుకుంటూన్నట్టు) ఓ, తప్పదు లావుంది.

సూ: ఏం చెప్పడం ఇష్టం లేదా?

రా: అదికాదు. అటువంటి విషయాలు చెప్పడంలో నాకు తెలివిలేదు.

సూ: (తేలికగా) ఇందులో తెలివికేం పనుంది? నిజం, నిజంలా చెప్పేస్తేసరి!

రా: (విచారంగా నవ్వి) ఎవరు నమ్ముతారూ?

సూ: (మామూలుగా) నేను.

రా: (ఆశ్చర్యంగా) మీరా?

సూ: అవును.

రా: మీరందరిలాంటివారూ కారా?

సూ: (నవ్వుతూ) తెలపడం లేదూ?

రా: (అమాయకంగా) నేను నిజాన్ని అబద్ధం అనిపించేటట్టు చెప్పినా నమ్ముతారా?

సూ: ఊఁ. నువ్వు కథ మార్చేస్తే తప్ప.

రా: (ఆశ్చర్యంగా) ఏవిటీ, అది మీకెల్లా తెలుస్తుంది?

సూ: (నిశ్చలంగా) నేను ప్రకాశాన్ని కనక.

రా: (తెల మొహం వేసి) ఏం...ఏమిటీ? మీరు...నువ్వు ఆ ప్రకాశమేనా?

సూ: (చిరునవ్వుతో) అవును. రెండర్థాలతో మాట్లాడడం లేదు.

రా: (ఉత్సాహంతో) అయితే ఇప్పుడు చెప్పడం వంతు మీది...నీదీ.

సూ: (మొండిగా) కాదు.

రా: ఏం?

సూ: (నిర్లక్ష్యంగా) నేనేం చెప్పదల్చుకోలేదు. ఇంకో కుర్చీ లాక్కుని కూర్చుంటాడు.)

రా: (సరదా అయిన ఆతృతతో) మన పెళ్ళెలా జరిగిందో తెలుసుకోవాలనే ఆతృతతో నే చచ్చిపోతుంటే...(సూర్యం కేసి చూస్తుంది ఏం మాట్లాడడు.) ఇప్పుడెలాగ? (ఆలోచనగా) ఇదంతా ఎవరో పన్నాగం పన్ని చేసింది తప్పితే, 'కోయిన్సిడెన్సు' అంటే ఒప్పుగోను. ఎవరు పన్నేరీ పన్నాగం? ఎందుకు పన్నాలసొచ్చింది? దీనివల్ల ఎవరు లాభం పొందుతారు? (నవ్వుతాడు)

సూ: డిటెక్టివ్ కథలు చదువుతున్నావన్న మాట!

రా: అంటే మీరూ చదువుతున్నారన్న మాట!

సూ: అంటే ఇద్దరభిరుచులూ ఒకటేనన్న మాట!

(నవ్వుగా ఈలేస్తాడు)

రా: మళ్ళీ మొదటికే వచ్చేమన్న మాట!

సూ: నేను రాలేదు.

రా: అయితే చెబుతున్నారా?

సూ: ఊఁ ఒక షరతుమీద.

రా: ఏవిటది? చెప్పవు సూర్యం?

సూ: (ఆశ్చర్యంగా) ఏవిఁటి, మైన్డు రీడింగు కూడా వచ్చునా?

రా: రాదు భయపడకు.

సూ: సరే, విను. ఇందులో పన్నాగం పన్నింది నేను. లాభం పొందింది నేను.

రా: ఏవిటి లాభం?

సూ: ఈసీను ఉత్తినే నిన్ను ఛడిపించి, ఏడిపించి, నేను హాయి ననుభవిద్దామనుకున్నాను. తీరా సమయం వచ్చే సరికి, అంత ఏడిపించడానికి మనసొప్పలేదు.

రా: (నవ్వుతూ, వెటకారంగా) థాంక్సు

సూ: (నిజంగా భావిస్తూన్నట్టు) డోన్టుమెన్షన్. అప్పుడే ఈ మొగుళ్ళకుండే పిచ్చి నాకు పట్టేసింది.

రా: (కళ్ళు పెద్దవిచేసి) ఏవిఁటది?

సూ: పెళ్ళాం బాధపడితే చూడలేక పోవడం!

రా: (ప్రసన్నంగా, కాని, తెలిపినట్టు) అడిగింది చెప్పకుండా ఇంత బాధపెడుతున్నావు కానీ.

సూ: దానికేం లేదు. నాచదువిక్కడై పోయాక, మేమంతా కలకత్తా వెళ్ళిపోయాం. అక్కడ అందర్నీ చూసి వెడదామని మొన్న పిన్నిగారింటికొచ్చేను. అంటే మీ మావయ్యగారింటికి. అప్పటికి మీ అన్నయ్య అక్కడున్నాడు, నీకు పెళ్ళిసంబంధం చూడ్డానికి వచ్చేడుట. నామూలాన్ని నీకు వచ్చిన చెడుగూ, వెంకట్రావు గొడవా చెప్పేడు. నిన్ను నేను పెళ్ళి చేసుగోకూడదా అన్నాడు. తప్పకుండా, ప్రయత్నాలు జరిపించమన్నాను. అయితే, నేను ప్రకాశాన్నని తెలియనివ్వద్దన్నాను.

రా: అయితే ఆ వుత్తరం?

సూ: (నవ్వుతూ) అందులో వెంకట్రావు మీ అన్నయ్యకి రాసినవుత్తరం వుంది.

రా: పచ్చిమోసం! ఇంత కోతలతో నే నన్నే డిపించాలనే బుద్ధి ఎలాపుటిందో!

సూ: నువ్వు నాకు కొత్తదానివి కాదు. నా వూహాలోకంలో విహరించే ఆరాధ్య దేవతవు. నీకెప్పుడో పెళ్ళైపోయుంటుందనుకున్నాను. నాగురించి, ఎన్ని బాధలు పడ్డావో! (చేతులుచాపుతూ) నన్ను మన్నిస్తావా, నారాజా?

రా: (చేతు లందిస్తూ) ఓ, సూర్యం!

[తెరపడిపోతుంది.] ★

సంఘజీవి

...మధురాంతకం రాజారాం.....

మంచి కబురు గానివ్వండి, చెడు కబురు గానివ్వండి, పెదవి దాటిన తర్వాత అది పెన్ననే లంఘించగల దంటారు. పెన్ననే దాట గలిగి నప్పుడు కమలాకరం ద్వారా పద్మా



వతికి తెలిసి, పద్మావతి ద్వారా ఎదురింటి సుందరమ్మక్కకు, ప్రక్క యింటి పార్వతమ్మ పిన్నికి తెలిసిన కబురు వాయువేగంతో చిలవలు పలవలుగా వీధి వీధంతా అల్లుకపోవడంలో ఆశ్చర్యమేముంది?

వీనుల విందుగా ఒక పాటను వినిపించి, ఆ పాటకు అనుబంధంగా తలనొప్పిమందు కొనుక్కోమని హితవు జెప్పే సిలోను రేడియో ప్రసారం లాంటి ప్రచారం ఎదురింటి సుందరమ్మక్కది! "విన్నావా రంగమ్మత్తా! మరీ...పద్మావతికట, పది పదిహేనురోజుల్లో ఒక వంటలక్క అత్యవసరమట! ఎందుకూ అనండి! అదేం ప్రశ్నండీ, వచ్చే అతిథులకు కాఫీలు, ఫలహారాలు ఆఫీసు గదిలోకి సరఫరా చేయిస్తూ, వాళ్ళకు లభ్యం కావలసిన ఆదరణ మర్యాదలో ఎలాటి లోపమూ జరక్కుండా చూచుకోవలసిన బాధ్యత తన భుజాలపైన వుండగా, ఆవిడ వంటగదిలో గంజి వార్చుతూ కూచుంటే ఎలా జరుగుతుందండీ, మీ పిచ్చిగానీ! ఆవచ్చే అతిథి తాశీల్దారుగావచ్చు. లేదా ఏ పంచాయితీ బోర్డు ప్రెసిడెంటో కావచ్చు. అదీ కాదంటావా ఎం. యల్. ఏ గారి కావమరిదికి తోడల్లుడి ప్రేలు విడిచిన మేనల్లుడైనా గావచ్చు" అంటూ ఆమె ప్రతివాక్యం చివరా ఏ సింధుభైరవో, ఏ అఠాణానో, లేదా ఏ హిందూస్థానీ కాఫీయో ఆలాపించి, చిట్టచివర "విషయ మేమిటంటే రంగమ్మత్తగారూ! ఆవిడ భర్తగారికి ప్రమోషను రాబోతున్నదట! 'అట' ఏమిటండీ అపశకునంలాగా! వచ్చేసినట్టే లెక్కట!" అంటూ అసలు సంగతికి రంగులు పూసి, మెరుగులుదిద్ది గాలిలోకి వదిలేసింది!

నలుగురైదుగురు బిడ్డలతో వేగుతూ, తాలూకాఫీసులో పని చేస్తున్న భర్తకూ, మరిదికీ వేళకు సరిగా వంటలూ, వడ్డనలూ నిర్వర్తింపవలసి వున్న సుందరమ్మకంటే ప్రక్క యింటి పార్వతమ్మ పిన్ని బాగా తీరుబడివున్న మనిషి! కొడుకులూ, కోడళ్ళూ కాపురం చక్కబెట్టుకుంటూ వుండగా, యిక సంసారంలో మనకేంపని అన్నట్టు నాళంవారి వీధిలో ఈ కొననుంచీ ఆ కొనదాకా దిగినకడప ఎక్కకుండా ప్రతి యింటికీ వెళ్ళిరావడం ఆమె అనుదిన కార్యక్రమం. పోస్టుమేన్ పొరుగూళ్ళ నుంచి వచ్చిన వుత్తరాల్ని ఎవరివి వాళ్ళకు అప్పజెప్పితాడు, పార్వతమ్మ స్థానికవార్తల్ని యింటింటికీ చేరవేస్తుంది. కాదంటే ఒక చిన్న తేడా లేకపోలేదు. అతడు కొలువుచేసేది రూకలకు! ఈమె యిల్లిల్లూ తిరిగేది ప్రొద్దుపోకడకు!

"ఏనా అదృష్టమంటే అలా వుండాలి."

పార్వతమ్మచేత అదృష్టంగా భావింపబడుతున్నదేది? ఆ అదృష్టం యివ్వాడెవర్ని వరించింది? అన్న ప్రశ్నలకు జవాబుకోసం ఎదుటివాళ్ళు తనవైపు కుతూహలంతో చూస్తుంటే, వాళ్లల్లో ఉత్కంఠ రగులుకోడానికి నాలుగైదు క్షణాలు తెరపియిచ్చి మళ్ళీ ప్రారంభించేది పార్వతమ్మ.

"ఉద్యోగంలో చేరి అయిదారేళ్ళయినా కాలేదు. అప్పుడే ప్రమోషనా! అందులోనూ ఆ డిపార్టుమెంటులో. వినడానికే అబ్బురంగావుంది. గుమస్తాగా వున్నంతకాలం అతడు సైకిలుతోనే సరిపెట్టుకున్నాడనుకో! కానీ యికమీదట ఆఫీసరు హోదాకు, సైకిలుకు ఎక్కడి కెక్కడి చెప్పు! అందుకని కమలాకరం సైకిలమ్మేసి మోటార్ సైకిలు కొనుక్కోబోతున్నాడట! ఇక రేడియో కొన మేమూ తప్పనిసరి! అంతేనా ఇంట్లో టెలిఫోను లేకపోతే క్షణం సాగుతుందా పిన్నిగారూ అం పద్మావతి! అవును మరి! ఎలా సాగుతుంది? భర్త ఆఫీసులోకూచు 'అలోమదీరా' అంటే, యిం యింట్లోనుంచీ ఈవిడ...".

"అలో మదీరా ఏమిటండీ పిన్నిగారూ, మక్కామదీనా లాగా 'హలో మైడియర్' అనాలి."

"అదేమిటోనమ్మా, ఆ చోద్యాలు నాకేం తెలుస్తాయి?" అంటూ అమాయకత్వం ప్రకటించి ప్రమోషనురాగానే కమలాకరం యింట్లో తీసుకరానున్న మార్పుల్ని గురించి తను పద్మావతిని వుబుకించి తెలుసుకున్న విషయాలన్నింటినీ ఏకరువు పెట్టసాగేది పార్వతమ్మ.

విస్తృతరంగంలో, విరివిగా కొనసాగుతున్న ఈ ప్రచారంవల్ల కలిగిన సద్యఃఫలితాలు యిటు పద్మావతికీ, అటు కమలాకరానికీ అమందానందాన్నే కలిగించాయి. వీధిలో ఎదురైనప్పటికీ పెదవికదిపి పలకరించడమే బ్రహ్మాండమైన రిటయిర్డు సబ్ కలెక్టరు రాజాద్రిరావునాయుడుగారు కమలాకరం ఆఫీసుకు వెళ్తుండగా కిటికీలోనుంచీ చూచి "ఏమిటోయ్ కమలాకరం ఈ మధ్య కనిపించడమే మానేశావే! తీరికైనప్పుడు యిలా రాగూడదూ! ఏదైనా మాట్లాడుతూ కూచోవచ్చు. ప్రొద్దుపోయి చావడం లేదయ్యా నాకూ!" అన్నారు. అదే వీధిలో కాపురముంటున్న డిప్యూటీ తాశిల్దారు చిదానందం, సైకిలుపైన వెళ్తున్నవాడు కమలాకరం యింటిముందర ఆగి, ఏమండోయ్ కమలాకరంగారూ! సైవారం క్లబ్బు కార్యవర్గాన్ని కొత్తగా ఎన్నుకోబోతున్నారన్న సంగతి మీకు తెలుసుగదూ! నామట్టుకు నేను రెండేళ్ళు సెక్రెటరీగా పనిచేశాను. నాతల బొప్పికట్టింది. మీ కభ్యంతరం లేకపోతే నేను సెక్రెటరీగా మీపేరు ప్రతిపాదింప దలచుకుంటున్నాను. ఏమంటారు? - అన్నాడు. ఎన్నడూ లేనిది, ఎదురింటి శ్రీమన్నారాయణ పండుగా పబ్బమూగానీ మామూలు రోజున కమలాకరాన్ని భార్యాసహితంగా తీసుకెళ్లి విస్తరి వరహాచేసే విందు భోజనం పెట్టాడు!

కమలాకరానికి ఆశ్చర్యం కలిగింది! ఐతే

★ సంఘజీవి ★

తన హోదా రిటయర్డు సబ్ కలెక్టరుగారితో బాతాఖానీ వేయడానికి తగినంతవరకూ పెరిగిందన్నమాట! రిక్రియేషన్ క్లబ్బుకు కార్యదర్శిత్వం నెరప గలిగినంతవరకూ పెరిగిందన్నమాట! లోలోపల అసూయవున్నా, ఎదుటివాడు తనకు తప్పని సరిగానయినా గౌరవించక తీరనంతవరకూ పెరిగిందన్నమాట!

'ఘనోన్నస్మి, ధనోన్నస్మి' అనుకోబోయాడు కమలాకరం!

'ఆ ప్రమోషను కాస్తా వచ్చేంతవరకూ ఆగకూడదటయ్యా' అంది అంతరాత్మ.

'పోనీ, అలాగేలే! ఇప్పుడేం తొందర' అనుకున్నాడు కమలాకరం.

గాలిలో తేలిపోతూ కమలాకరంయింట్లో ప్రవేశించేసరికి, పద్మావతి ద్వారబంధాలకు ఎలాటి తెరలు వ్రేలాడదీయాలన్న తీవ్రతలో లీనమైవుంది. ఆమె ఆలోచనకు అంతరాయం కలిగించడ మెందుకని కమలాకరం నిశ్శబ్దంగా కుర్చీలో కూర్చున్నాడు.

అర్ధనిమీలిత నేత్రాలతో, గోడకానుకుని ఆలోచిస్తూ నిల్చున్న పద్మావతి పెదవులపైన శుక్లపంచమినాటి లేతచంద్రుల్లా ఓ హాసరేఖ మెరిసిపోతూ వుండడం కమలాకరానికి కనిపించింది. కారణ మేమిటా అని అతడూ ఆలోచిస్తూనే వున్నాడు. ఇంతలో పద్మావతి వున్నటుండి పక్కున నవ్వేసింది!

"ఏమిటి పద్మా?" అన్నాడు కమలాకరం.

పద్మావతి ఉలికిపడి "మీ రెప్పుడొచ్చారు?" అంది.

"నేనిప్పుడే వచ్చానుగానీ, నువ్వెందుకు నవ్వావో చెప్పవూ" అన్నాడు కమలాకరం.

"అదిగాదండీ! లోకపు తీరును తలచుకుంటే ఎవరికైనా నవ్వేవస్తుంది."

"ఆ లోకపుతీరు లేలాటిదో నన్నూ తెలుసుకోనివ్వు మరి!"

"ప్రక్కింటి సరోజమ్మ వుందిగదండీ! ఆవిడ పుట్టింటినుంచివస్తూ ఓ డిజైన్లపుస్తకం పట్టుకొచ్చింది. 'ఈ పుస్తకాన్ని తీసుకెళ్ళాను సరోజా! ఒకటి రెండు డిజైన్లు కాపీ చేసుకుని మళ్ళీ ఇచ్చేస్తాను' అన్నాను. 'రేపు తీసుకెళ్దువులే, మాపు తీసుకెళ్దువులే' అంటూ నాలుగైదురోజులు జరిపేసింది. ఆ తరువాత నే నడగడం మానుకున్నాను. ఈ రోజువుదయం ఆవిడ వచ్చి 'మరే మనుకోకు వదినా! ప్రక్క వీధిలో ఎవరో ఈ పుస్తకాన్ని తీసుకెళ్ళి ఇప్పుడే తెచ్చియిచ్చారు. అవసరమున్నంతవరకూ దీన్ని నీ దగ్గరే వుంచుకో' అని చెప్పి వెళ్ళింది."

"ఇందులో నవ్వడానికేముంది పద్మా?"

"లేకేం వుంది! నేను ప్రతిరోజూ ఆ సరోజమ్మ కూతుర్ని అడిగి తెలుసుకుంటూనే వున్నాను. అపిల్ల 'పుస్తకం అలమారాలో వుందత్తయ్యా! నేనిప్పుడు గూడా చూచాను' అంటుంది. ఆ అయిదేళ్ళ పిల్లకింకా అబద్ధాలు అలవాటుకాలేదు కదండీ మరి!" అంటూ మళ్ళీ నవ్వేసింది పద్మావతి.

"ఐతే నువ్వెక మీదట ఏ వస్తువు కోసంగానీ యిరుగింటి వాళ్ళనీ, పొరుగింటి వాళ్ళనీ, ప్రాధేయపడవలసిన అవసరం లేదేమో పద్మా! కాకితో కబురంపినా వాళ్ళే స్వయంగా తెచ్చియివ్వగలరనుకుంటాను" అన్నాడు ఇంచుక విస్మయంతో కమలాకరం.

"కానీ ప్రపంచకంలో అందరూ సరోజమ్మలాంటి భోళా మనుషులేవున్నారటండీ! అబ్బ, నోటితో మాటాడుతూ నొసలితో వెక్కిరించే వాళ్ళెంత మంది! కొళాయి దగ్గరనుంచీ నేను నీళ్ళు తెచ్చుకుంటున్నప్పుడు చూడాలి వీళ్ళ ముఖాలు! కత్తివేటుకు నెత్తురు చుక్క కనిపించదనుకోండి! అవలా పాలిపోవడం ఎందుకంటారు?"

"అసూయ పద్మా అసూయ!" అన్నాడు కమలాకరం! "ఐతే 'అసూయ' అనేది ఎదుటి వాళ్ళని హింసించే ఆయుధంగా ఎన్నడూ వుపకరించలేదు. అది ఎవరికి వాళ్ళనే చెదతినే వ్యాధి. అందుకు నువ్వు మరేం బెంగపెట్టుకోకు పద్మా! కుళ్ళేవాళ్ళ ముందరే కులకాలన్నారు..."

2

జీవితం మానవుడాశించినంత సాఫీగానే గనుక జరిగిపోతే ఆ తరువాత లోకంలో కథలకు అభావమే నేమో అనిపిస్తుంది.

ఇదంతవరకూ నిజమోగానీ కమలాకరం ఆశించినట్టుగా అతనికి పదిరోజుల్లో ప్రమోషనే గనుక లభ్యమై వుండినట్టయితే, యిప్పుడిక్కడ కథంటూ ఒకటి సంభవించడానికి ఆస్కారమే లేదు.

కమలాకరానికి ప్రమోషను రాలేదు!

ఆఫీసులో ఏర్పడిన ఖాళీకి కమలాకరాన్ని ప్రమోట్ చేయడానికి బదులు, మరోచోటునుంచీ ఒక ఉద్యోగిని ఆస్థానానికి బదిలీ చేశారు.

ఆఫీసరుగారు కమలాకరాన్ని తనగదిలోకి పిలిపించి "మనలాంటి ఉద్యోగులు ఆశాభంగానికి తట్టుకోవలసి వుంటుంది కమలాకరం! కానీ నువ్వెందుకు పెద్దగా విచారం పెట్టుకోవలసిన అవసరం లేదు. కాళ్ళకు చుట్టుకున్న పాము కరవక మానదు! నీ పేరు లిస్టులోవుంది. ఎప్పుడో ఒకప్పుడు నీకు తప్పకుండా ప్రమోషను వస్తుంది" అన్నారు.

సూర్యాస్తమయం తర్వాత చెన్నుదొరగిన పద్మాకరంలా ఆ వార్త విన్న కమలాకరం ముఖం చిన్నబోయింది.

"ఏముఖం పెట్టుకుని నేను పద్మావతిని చూడను" అని లోలోపలే బిట్టు వాపోయాడు కమలాకరం.

కానీ ముఖం తప్పించుకుని తిరగడానికి మరొకరూ, మరొకరూ గాదు! స్వయానా అర్ధాంగి! సాయంత్రం ఎనిమిది గంటలకైనా యింటికి వెళ్ళక తప్పలేదు కమలాకరానికి!

"ఈయన యుద్ధంలో ఓడిపోయి వచ్చిన సేనానిలా వున్నారేమా?' అనుకుంది పద్మావతి.

కొండ కొమ్ముమీద నిలబెట్టిన పద్మావతిని హఠాత్తుగా లోయలోకి తోసివేయలేక పోయాడు కమలాకరం. చేతినిపట్టుకుని, నిండుచెరువులోకి తీసుకెళ్ళినట్లు ఆమెను నిరాశలోకి మెల్లమెల్లగా నడిపించుకుని వెళ్ళాడు. అందుచేత అసలు విషయాన్ని వివరించి చెప్పడానికి అరగంటసేపు పట్టింది.

ఈ అరగంటసేపట్లో పద్మావతి ముఖాన కృష్ణపక్షం కళలుమార్చుకుంది. చిట్టచివర అక్కడ నిండు అమావాస్య నెల నాటుక పోయింది.

వేదనలతో, వేడినిట్టూర్పులతో భార్యాభర్తల కా రాత్రి గడచిపోయింది.

తెల్లవారుజామున కాసేపు నిద్రపోయి లేచిన తర్వాత వాళ్ళకా వేదన కాస్తా వుపశమించినట్టే కనిపించింది.

కానీ పుండుపైన కారం చల్లడానికి సంఘమంటూ ఒకటి తమచుట్టూవున్నదన్న సంగతి వాళ్ళకప్పటికి అంత స్పష్టంగా తెలియదు. ఒకవేళ తెలిసినా 'బాధలో బాధ! దాని లెక్కేమిటి?' అనే వాళ్ళు తలపోశారు.

"కానీ పుండువల్ల కలిగే బాధకంటే, దానిపైన కారం చల్లడంవల్ల కలిగే బాధే దుర్భరమన్న సంగతి ఆకళించుకోడానికి వాళ్ళకెంతో కాలం పట్టలేదు!

ప్రమోషను రాబోతున్నదన్న విషయానికి మల్లేనే, అది రాలేదన్న విషయాన్ని

గూడా ముమ్మందుగా పసిగట్టి, పనిగట్టుకుని ఆ వార్తను ప్రచారం చేసి పెట్టిన ఘనత మళ్ళీ ఎదురింటి సుందరమ్మకు, ప్రక్కయింటి పార్వతమ్మకే దక్కింది.

పదకొండుగంటలకు కమలాకరం భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళిపోయినతర్వాత, పద్మావతి చాపమీద పడుకుని ఏదో చదువుకోడానికి వుద్యమిస్తుండగా "ఏమిటమ్మోవ్ పద్మావతీ! ఏదైనా డిటెక్టివు నవలలున్నాయా" అంటూ లోపలికి వచ్చింది సుహాసిని సుహాసిని చిదానందంగారి భార్య

పద్మావతి తెల్లబోయి "అబ్బే, నేను డిటెక్టివు నవలలు చదవనుగదండీ!" అంది.

"పోనీ గానీ మీకు వంటలక్కతో అవసరముందన్నారట! సుందరమ్మ చెప్పింది. నా ఎరుకలో ఒకావిడ ఎక్కడైనా పనిచూపించమని వేధించుకతింటోంది. మీకు కావలసివస్తే రేపటినుంచే ఏర్పాటుచేస్తాను."

"అబ్బే, మాకు వంటలక్క ఎందుకండీ!" మోకాళ్ళమీద తలానించుకుని చాపపైన గీతలుగీస్తూ అంది పద్మావతి.

"ఏమోలే! ఒకమాటడిగి చెబుతామనన్నాను. ఐతే డిటెకువు నవలలు లేవన్నావు గదూ! వెళ్ళొనుమరి. ఎలాగూ రేడియో వుంది గదా! వింటూ కూచుంటాను."

వెళ్ళిపోతున్న సుహాసినిని చూస్తూ అలాగే బొమ్మలా కూర్చుండిపోయింది పద్మావతి ఈమె తనను వెదుక్కుంటూ వచ్చింది నిజంగా డిటెక్టివు నవలలకోసమేనా! కాదు. తను అలాటి నవలలు చదవదని ఈమెకు రూఢిగా తెలుసు. ఈమె వచ్చింది—ఒకటి, నీది వంటలక్కను పెట్టుకునే ముఖమేనా అని దెప్పిపొడవడానికి—రెండు, తమకు రేడియో వుందన్న విషయం తనకు జ్ఞాపకం చేయడానికి!

ఆరోజు రాత్రి పదిగంటలప్పుడు ఎవరో తలుపు తట్టుతూవుండడం విని, కమలాకరం గబగబా వెళ్ళి తలుపు తీశాడు.

మెట్లమీదనిల్చున్న యువకుడు "నేను అత్యవసరంగా గుంటూరులో మా బంధువులతో మాట్లాడాలిసార్! మీ యింట్లో ఫోను వుందిగదండీ!" అన్నాడు.

"మేము ఫోను పెట్టించుకోలేదండీ" అన్నాడు కమలాకరం.

"అలాగా! మన్నించండిసార్! ఎవరో రాంగ్ యిన్ఫర్మేషన్ యిచ్చారు" అంటూ అతడు తలవంచుకుని చరచరా వెళ్ళిపోయాడు.

అతడిలా అడిగినందుకే కాదు గానీ, ఈ దృశ్యాన్ని ఎదురింటి శ్రీమన్నారాయణ కిటికీలోనుంచీ చూస్తున్నందుకు నిలువునా కృంగిపోయాడు కమలాకరం.

అంతటితో ఏమయింది? నాలుగు నాళ్లు గడిచిపోయిన తర్వాత ఓ రోజు సాయంత్రం ఆరు గంటలకు ఓ కంపెనీ ఏజంటు మోటర్ సైకిలుపైన హుటాహుటిగా వచ్చి కమలాకరంతో భేటి అయ్యాడు ఏమిటి, ఎందుకు అని ప్రశ్నిస్తూ వుండగానే అతడు కమలాకరాన్ని వీధిలోకి లాక్కొచ్చి "చూచారా సార్! ఇది సైకిలు! ఎంత గంభీరంగా వుందో చూచారూ! కొనుగోలుదార్ల సౌకర్యార్థం ఉగాదిపండుగదాకా వెలలో 10% తగ్గించాము. పెట్రోలు ఖర్చు చాలా తక్కువ. మీరు సైకిల్లో వెళ్తున్నట్టు వుండదు. రెక్కలు గట్టుకుని గాలిలో పరతెంచి నట్టుంటుంది. అందుకే మన తెలుగు దేశానికి సంబంధించినంతవరకూ దీనికి 'పంచకల్యాణి' అని పేరు మార్చాలనుకుంటున్నాము" అంటూ ఉపన్యాసం ప్రారంభించాడు.

సదరు ఉపన్యాసాన్ని వినడానికీ, సైకిల్ను చూడానికీ దోషిలా నిల్చున్న కమలాకరాన్ని చూపుల తూపులతో గుచ్చడానికీ అక్కడొకగుంపు ప్రోగైంది.

పల్లికు ప్రాసిక్యూటరుకు మల్లే గడగడా వాగేస్తున్న ఆ ఏజంటు కడ్డుతగిలి, ఓ పెద్దమనిషి నేరస్తుని తరపున వకాలత్తు పుచ్చుకున్న న్యాయవాదికి మల్లే "ఈయన మోటర్ సైకిలు కొనదలచుకున్న మాట నిజమేనండీ! కానీ పరిస్థితులు అనుకూలించలేదు అందువల్ల ప్రస్తుతం దిన్ని బేరమాడే ప్రసక్తే లేదు. మీరు సెలవు తీసుకోవచ్చు" అని నచ్చచెప్పాడు 'ఓస్, యింతేనా!' అన్నట్టు ఆ ఏజంటు కమలాకరాన్ని ఒకటి రెండుసార్లు ఎగాదిగా చూచి, చెవులు జాడించుకుని సైకిలు పైకెక్కి వెనుదిరిగి చూడకుండా వళ్ళిపోయాడు.

ఆ రాత్రి పడుకోడానికి ముందుగా వాలుకుర్చీలో మేనువాల్చి పకపకా నవ్వుకేసి చూస్తూ, 'అబ్బబ్బ, ఈ లోకులకంటే యినుప ముక్కలకొకులే నయం!" అన్నాడు కమలాకరం.

"మెల్లగా అంటున్నారా ఆ మాట! వీధిలో తల చూపించలేక పోతున్నానంటే నమ్మండి! బాబ్బాబూ! మీకు పుణ్యముంటుంది. రెండు మాసాలు సెలవు పెట్టేయండి! మనం వూరికి వెళ్ళిపోదాం" అంది పద్మావతి.

సమయానికంత మంచి సలహా యిచ్చినందుకు భార్యను కృతజ్ఞతాపావితమయిన చూపులతో అభిషేకించి, మౌనంగానే అభినందించుకున్నాడు కమలాకరం!

3

కాలచక్ర పరిభ్రమణంలో రెండు నెలలంతా ఎంత? చూస్తూ చూస్తూ వుండగానే ఆరేసు వారాలు యిట్టే దొర్లిపోయాయి. కమలాకరం మళ్ళీ ఉద్యోగ బాధ్యతల్ని స్వీకరించడానికి ఇంక రెండుమూడు రోజులకంటే వ్యవధి లేదు.

"అదేమిటే పద్మా! నీ వాలకం చూస్తుంటే నువ్విప్పుడు నాతో బయల్దేరే వుద్దేశంతో వున్నట్టు లేవే!" అన్నాడు కమలాకరం

పద్మావతి కాసేపు గుణిసి "ఆ నా యింట్లో కాపురం చేయలేనండీ!" అంది.

"అయ్యయ్యో, అదేం మాట పద్మా! ఇంట్లో ఆ.తిమామల అరడి, ఆడబిడ్డల పో వున్నట్లు మాట్లాడుతా వేమిటి! ఇంకా వీధిలో కాపురంచెయ లేనని చెప్పు, ఒప్పుకుంటాను."

"అదేనండీ అదే! నే నిలా చెప్పబో అలా చెప్పేశాను."

"ఇంతకూ ఇప్పుడేం చేయాలో మాత్రం చెప్పవు!"

"ఇంకేం చేయగలమండీ! యిల్లు మార్చేయాలి."

"రైటో! సలహా చెబితే నువ్వే చెప్పా పద్మా! నేనూ ఆలోచిస్తున్నాను..."

"తరువాత తీరిగా పొగడవచ్చుగానీ, మీరు క్రొత్తగా చూడబోతున్న యిల్లు దాకింవా వీధికి ఒక మైలు దరిదాపులో వుండగూడదు.


"అలాగే, అలాగే" కృతనిశ్చయంతో అన్నాడు కమలాకరం.

నగరారణ్యాల్లో అద్దెకొంపకోసం వేటాడే విద్యలో ఓనామాలైనా రానివ్యక్తి కమలాకరం. కానీ ఆవిద్యలో ఘటికుడైన ఓమిత్రుడితో డ్పాటువల కమలాకరానికి పట్టణానికి విసిరి వేయబడినట్టున్న ఓమూరు మూలపేటలో ప్రాకారకుడ్యమూ, చిన్న పూలతోట, వంటగది, బాత్ రూమూ గాక మూడుగదులూ ఓహాలు వరండాలతో చిన్న బంగళావున్న యిల్లొకటి కుదిరింది.

కార్డు ముక్క చేరగానే, ఫోర్డుకంపెనీ వారి కారులా పరతెంచివచ్చిన పద్మావతి ఆయింటిని చూచి మురిసిపోయింది.

"ఎంతబాగుందండీ! చాలాబాగుంది. చే బావికూడా యింట్లోనే! కొళాయి గిలాం అంటూ వీధిలో బడిగాపులు పడవలసిన అవసరమే లేదు నేను పదిగంటలకల్లా వం ముగించేస్తాను. మీరు భోజనంచేసి ఆఫీసుకి వెళ్ళండి. నేను తలుపు గడియవేసుకు

(46-వ పేజీ చూడుడు)



[ఉద్యోగపర్వము నుండి]

సీ. నీవు వృద్ధజనోపసేవివి ధర్మసంవేదివి తెలియంగ వినుము సిద్ధ
మంత్రబలంబున మార్తాండువరమునఁ గన్నియతఱి గొంతి గన్నవాఁడ
వగుటఁ బాండునృపాలు నగ్రసుతుండవు ధర్మమార్గం బిది ధర్మతనయుఁ
డాదిగాఁ గల తమ్ములందఱు నాచేత నెఱిఁగి నీయడుగుల కెఱఁగి సకల

ఆ. పుత్త్రమిత్త్రబంధుభూరిసేనాసమ, న్వితము గాఁగఁ గొలిచి నిన్ను రాజ్య
భారవహమునకుఁ బట్టంబు గట్ట నుజ్జ్వలుఁడ వగుదు రమ్ము వారికడకు.

వ. ఏను నిన్ను సామ్రాజ్యంబునకు నభిషిక్తుం జేయుదు నీవు దొఱత వెడలునప్పటి మహోత్సవంబునకు యువరాజై యుధిష్ఠిరుండు నీరథంబున నుండి నీకు ధవళ చామరంబులు వైచు వాయుపుత్త్రుండు సితచ్ఛత్త్రంబు వట్టు సవ్యసాచి సారథ్యంబు సేయు మఱియుఁ బాంచాలయాదవపాండ్యమాత్స్యులు లోనుగాఁ గల రాజలోకంబుతోడఁ గవలు నభిమన్యు ప్రభృతికుమారులు బెరయ నేమెల్లం బలసి పరివేష్టించి వత్తు మిట్టి మహేంద్రవిభవంబున మహీయుండ వగుచు మహీచక్రం బేలు మని చెప్పి మఱియును.

క. పాంచాలరాజపుత్త్రియు, నంచితముగ నిన్నుఁ బొందు నార్వ్యరవరుసన్
సంచితపుణ్యుఁడ వీ వొక, యించుకయును వేఱు సేయ కే తె మ్మిలమిన్.

వ. ఇట్లైనఁ గుంతికి సమస్తబంధుమిత్త్రులకుఁ బ్రియం బగు ననిన విని రహస్యంబుగా రాధేయుండు మాధవున కిట్లనియె.

కర్ణుఁడు శ్రీకృష్ణునకుఁ దగిన యుత్తరంబు లిచ్చుట

చ. వెడవెడ యేనుఁ దొల్లి యిది వింటి ననుం గని కుంతి యెంతయుం
జెడ నది వైచి పోయెఁ గృపఁ జేకొని సూతుఁడు దెచ్చి తాను మున్
గొడుకుఁల గాన కున్కిఁ బ్రియకుం దగ నిచ్చినఁ జేఁపెఁ జన్నుల
ప్పడఁతియు నప్పు డాదిగ శుభస్థితిఁ బెంచెఁ బ్రయత్నశీలయై.

క. మూత్రపురీషాదులు దమ, గాత్రములం దింక వారు గారవ మెసఁగం
బుత్త్రుం డని సంవర్ధిత, గాత్త్రునిఁ గాఁ జేసి రింతకాలముఁ గూర్మిన్.

క. నేఁ డింక నెఱిఁగి యొరువుల, వాఁడఁ గదా యనుచు నేను వారిఁ దొఱఁగినం
బోఁడిమి సెడదే మదిఁ గడు, వాఁడి గలదె నాకు నకట వారిజనాభా.

వ. వృద్ధోపసేవనంబును ధర్మసంవేదనంబునుం గలవాఁడ వని నన్ను నీవ చెప్పితివి రాధయు నధిరథుండును నాకు జాతకర్మాది సమస్తసంస్కారంబులు నిజకులోచితంబుగా నాచరించి రట్టితల్లిదండ్రులకుఁ బుత్త్రకృత్యంబులు నిర్వర్తింపక వారల బాసి యేను వచ్చుట ధర్మంబగునే యని పలికి వెండియు

క. సోదరులుఁ బ్రియులు ననుజులు, నాదెసఁ బెక్కండ్రు వారి నందఱ విడువం
గాదని యూహింపక దా, మోదర నన్నిట్లు పిలుచు టుచితమె చెపుమా.

వ. అదియునుం గాక.

ఉ. సూతసుతుండ వీఁ డనక సూనుల తమ్ములకంటె నాకు సం
ప్రీతి యొనర్చి తేజమును బెంపును నాఁటికి నాఁటి కగ్గలం

బై తనరార నన్నుఁ దనయంతటిమానిసిఁ జేసి యుండ నే
నే తగఁ బ్రోఁది యా కురుకులేశ్వరుఁ బాయుదు ముట్ట వచ్చినన్.

క. నను నయ్యర్జునునకు నెదు, రని పెద్దయు నమ్మియుండు నక్కట దుర్యో
ధనుఁ డా నమ్మిక వమ్ముగఁ, జను నే పాండవులఁ గలయఁజన నా కనఘా.

ఆ. ఏను నర్జునుండు నెక్క టెక్కటి దల, పడక యున్న నగరె పుడమిజనము
లందు నాడువచ్చు టతనికి నపకీర్తి యనిన నాకు వేఱె యడుగనేల.

క. హిత ముపదేశించితి నీ, వతినిర్మలబుద్ధి వగుట నైనను నిది నా
మతి సొరదు రహస్యము ర, క్షితముగఁ బాటింపుమయ్య చిత్తములోనన్.

వ. అది యేమిటి కంటేని.

తే. ధర్మతనయుండు దాను నాతమ్ముఁడగుట, యెఱిఁగె నేనియు సామ్రాజ్య మేలఁబూను
నట్టి ధార్మికుఁ డాధిపత్యంబుఁ జేయ, వలవదే శాశ్వతంబుగ వసుధయెల్ల.

క అనుజులు ఋత్విజులు గ నీ, పని యిటు సేయు మని నీ వుపద్రష్టవుగా
విను కురుకుమారపశువిశ, సనమున రణయజ్ఞ మతఁడు సమ్మతిఁ జేయున్.

వ. దానం బుణ్యభూమి యగు కురుక్షేత్రంబున మముబోంట్లెల్లను సద్గతి వడయుదురుగాక యనిన విని వసుదేవనంద
నుండు సూతనందనున కిట్లనియె.

మ. దయ నాయాడినమాట గైకొనవు నంతాపంబు దెచ్చుం జుమీ
స్మయ మెట్లుం దుది నీకు నర్జునునితో మాత్సర్య మైనం బరా
జయ మొండెన్ మృతి యొండెఁ గాక గెలువన్ శక్యంబె పెక్కండ్ర కిం
తియకాలం బగునట్టి నీమనము శాంతింబొందఁగా నేర్చునే.

క. గాండీవముఁ గపదొనలు న, ఖండితదివ్యాస్త్రములు నొగలపై వేనుం
జండ భుజబలమునై యుద్దండత నరుఁ డడర నెదురఁ దరమే నీకున్.

వ, ఎల్లభంగులం బాండవుల గెల్తు రది యట్లుండె నీవు పొమ్మిప్పుడ పోయి సుయోధనునకును గురుభీష్మలకును
మీకుం దోడువచ్చిన రాజుల కందఱకుం జెప్పు మిమ్మాసంబు సౌమ్యం బై శీతోష్ణంబులు లేక పుష్పఫలోపేతంబును
సమగ్ర ధాన్యంబును సులభయవసేంధనంబును నగుచు నొప్పి యున్న యది యేడేనిమిది దివసంబులకు నమావాస్య
వచ్చు నది పుణ్యదినంబు నాఁడు ఖండనంబు గావలయు ననినఁ గానీనుండు గమలనాభున కిట్లనియె.

క. కలవు నిమిత్తస్వప్నం, బులు కౌరవపాండవులకుఁ బోటగు దానన్
గెలుపు యుధిష్ఠిరునకును, గల దెఱుఁగుదు నీవు సెప్పఁగా నేమిటికిన్.

వ. అట్లు గాన కదా యే నందు రా నని పలికి మఱియును.

క. దీనికి మూలము శకునియు, నేనును దుశ్శాసనుండు నింతియ కుంతీ
సూనుల వారలు గలసిన, రానేరఁగ వచ్చు నాకు రాజీవాక్షా.

వ ఈ సమర సముద్రంబు దఱియ నీఁది నిన్నుం గనియెదఁ గాదేని యూర్ధ్వలోకంబునం గాంచెద నీ వింక నేమియుఁ
బలుకకుము పనివినియెద నని కౌఁగిలించుకొనిన నట్ల కాక పొమ్మని విష్ణుండు వీడుకొలుప రాధేయుండు రథావతర
ణంబు సేసి కనకరత్నమయం బగు తనయరదం బెక్కి కరిపురంబున కరిగె నచ్యుతుండును సాత్యకిం దనరథం
బెక్కించుకొని దారుకుం జూచి పద పద పో నిమ్ము పో నిమ్మని పలికి లలితాటోపకలితుం డగుచుఁ జనియె నట్ల
యెడ విదురుండు విషాదంబుతోఁ బాండురాజమహిషిపాలికిం జని యి ట్లనియె.

ఉ. అక్కట కౌరవాన్వయమహార్ణవ మింకెడునట్లు పుట్టె నిం
దొక్కరుఁ డైనఁ గేశవుహితోక్తికి మేకొనఁ డయ్యె నర్జునుం
డెక్కటి దాన చాలుఁ దము ఖండిఱుఁ దీవ్రశరాగ్ని గాల్పఁ బెం
పెక్కిన పాండునందనుల యేడ్తెఱఁ దొల్లియుఁ దా రెఱుంగరే.

తే. అన్ని వడియును బంధుక్షయంబు సేయ, నొల్ల కెల్లవిధంబుల నుపశమంబ
కోరి రప్పాండవేయులు వారి కిట్టి, దొసఁగు వచ్చెను తులవలతోడఁ బుట్టె.

వ. అని వెండియు నివ్విధంబుమాటలఁ బాండవులకుఁ గయ్యంపుటలజడిమైనవగపు దోఁప నాడుచుం గొండొక ప్రొద్దు నిలిచి నిజనివాసంబునకుం బోయినయనంతరంబ కుంతి యిట్లని వితర్కించె.

మ. తమవారిన్ సిరికై వధించు టిది సద్ధర్మంబె యక్లేశకృ
త్యమె తాఁ గయ్యము ద్రోణభీష్మకృపకర్ణాటోపముల్ మాన్పుట
ల్పములం దీఱునె యందు నర్జునియుల్లం బెవ్వడుం గ్రోధదీ
ప్తము భీమాదులమీఁదఁ దక్కొరుల కుత్సాహంబు లే దాజికిన్.

వ. అని యిత్తెఱంగునఁ బెక్కులు చింతించి తలంచుకొని కర్ణునకుం బుట్టువు దెలిపి సహోదరస్నేహం బానహించెద నట్లయిన నాహవంబువలనికడంక యుడుగకుండునె యని విచారించి యతనిపాలికిం బోవ నిశ్చయించి యుచిత ప్రకారంబున వెడలి యతం డనుష్ఠానార్థంబు భాగీరథికిం జనుట విని తత్ప్రదేశంబున కరిగి యతనికి జపకాలం బయి యునికిం జూచి వెనుకవలనఁ గూర్చుండఁ గొండొక సేపునకు జపంబు దీఱ గలయం గనుంగొని యమ్మహాదేవిం గాంచి కానీనుండు సంభ్రమ వినయంబులతోడం జేరి సూతగోత్రంబును రాధేయనామంబునుం జెప్పి యభివాదనంబు సేసి నీవు విజయంచేసిన కార్యం బేమి నాకుం జేయం గలవని యెయ్యది యాన తి మ్మనినఁ గుంతి యేకాంతంబుగా ని ట్లనియె

కుంతీదేవి గర్ణునకు నతండు దనపుత్త్రుం డగుట దెలుపుట

సీ. వినుము సూతాన్వయంబున నీవు పుట్టుట గాం కేను మా కుంతిభోజు నింటఁ
గన్నియనాఁడు భాస్కరుని రావించితి వరమంత్రబలమున వచ్చి యతఁడు
సంప్రీతి నొసఁగంగ జన్మించినాఁడవు నాకుఁ గావునఁ బాండునందనుండ
వగుదు ధర్మస్థితి నట్టినీ వితరులఁ గొలువ నేటికిఁ గురుకులవరేణ్య

తే. ధర్మతనయాదు లైన నీతమ్ములకును, ధార్తరాష్ట్రులకును నీవ తగువిభుండ
వేలు మీలోక మెల్ల నీ కేల రాధ, కొడు కితం డను తక్కువ కొడుకుఁగుఱ్ఱ.

క. అని పలికినయవసరమున, నినబింబములోననుండి యిది నిజ మిబ్భం
గిన నెగడ వన్న మే లగు, నను వాక్యము వెడలెఁ గర్ణుఁ డాకర్ణింపన్.

తే. దాని వినియును నపుడు రాధాసుతుండు, దిరుగఁబడనిమనంబుతో ధీరవృత్తిఁ
దల్లి కి ట్లను నీమాట తథ్య మగున, యైన నొక్కటి సెప్పెద నవధరింపు.

క. క్షత్త్రియసంస్కారమునకుఁ, బాత్త్రముగా నీవు నన్నుఁ బాటింప నిహా
ముత్రఫలములకు నీ కేఁ, బుత్త్రుఁడ నని వచ్చు టెంకఁ బానఁగునె చెపుమా.

వ. సూర్యానుగ్రహంబునంజేసి వింద్యంబుగాక తక్కె నేనియు నాజన్మంబు పరమరహస్యంబునైయున్న యది దీనిఁ బ్రకాశంబు సేయుట మనకెంత మే లట్లుంగాక.

ఆ. విజయువిక్రమంబు విఖ్యాత మై యుండ, నేను గుంతికొడుక భానుజుండ
ననుచు నతనిఁ జేర నరిగిన నతనికి, వెఱచి పోయె ననరె వేయు నేల.

క. కడిఁదిపగఱ నేఁ దెప్పగఁ, గడవంగా నీఁదఁ దలఁచు కౌరవనాథుం
జెడుఁ గాక యంచు నిత్తఱి, విడువఁదగునె యతనివలన వెలసినవాఁడన్.

క. కౌరవులచేతఁ గుడిచిన, వారికి నిది సమయ మెట్టివారును సంగ్రా
మారంభంబునఁ బాయుదు, రే రాజులు మనలఁ దిట్టరే య ట్లయినన్.

వ. ఏ నవశ్యంబును దుర్యోధనునకై నీ కొడుకులతోడం బెనంగుదు

ఉ. నీపలు కెంత [illegible]నను నిర్ణయ మిట్టిద కాని యొండు లే
దీపనిమీఁదిభారమున ని విట వచ్చితిగాన పాండవుల్
నేపడి రేనిఁ జంప నఱసేయక చెప్పెద సవ్యసాచిపైఁ
గోపము పెద్ద వాఁడు సమకూరిన బి ట్టతఁ జంపుదుం జుమీ.

ఆ. సవ్యసాచిచేతఁ జచ్చుటయును గీర్తి, కరమ యతఁడు లోనుగాఁగ నేవు
రేను లోనుగాఁగ నేవురు గాని నీ, కొడుకు లార్వు రనుట విడువు మింక.

చ. అనుటయు నప్డు గొంతి హృదయంబున శోకము నివ్వటిల్ల ని
ట్లను నిది దైవసంఘటన మక్కట యెట్లును దప్ప నేర్చు నే
యనుపమసత్యవిస్ఫురణ నాడినమాట మఱొకు మన్న నీ
యనుజుల నల్వురం గడపు మర్జునుఁ జేఁతకు నమ్మతించితిన్.

ఆ. అనుచుఁ గౌఁగిలింప నర్కజుం డట్ల కా, కని ప్రియంబు మెఱయ వినతుఁ డైన
నరిగె సదనమునకు నద్దేవి యతఁడును, జనియె నిజనివాసమునకుఁ బ్రీతి.

వ. అక్కడ వాసుదేవుం డుచితప్రయాణంబుల నుపప్లావ్యంబునకుం జని ధర్మతనయు చేతం బూజితుం డయి భీమసేనాదులు విరాటద్రుపదముఖ్యు లగు తగువారలుఁ దన్నుం గాంచిన వారి నెల్ల నభినందించి కొలువుననుండి యుధిష్ఠిరుతో ని ట్లనియె.

తే. ధార్తరాష్ట్రు లున్మత్తులు దగినపలుకు, లేల విని సంధి సేయుట కిచ్చగింతు
రెదిరిఁ దమ్మును నెఱుఁగిర యేని వార, లంత లంతలు సేయుదురయ్య నాఁడు.

వ. అవి యెల్లవారును వినఁ దన పోయివచ్చినకార్యంబుతెఱం గెఱింగించి వక్రమంబు వుచ్చువాఁ డయి పుండరీకాక్షుండు నిజమందిరమున కరిగె నాఁటిరాత్రి ధర్మనందనుం డనుజసహితంబుగా నుచితప్రదేశంబున నుండి గోవిందుఁ రావించి నీవు సుయోధనుతోఁ బలికిన చందం బెట్టు లతండు విని యెవ్విధంబున నుత్తరం బిచ్చె నని యడిగిన నచ్యుతుం డిట్లనియె.

శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకుఁ గౌరవసభం బుట్టిన విశేషంబులు దెలుపుట

క. కయ్యము గాని తెఱంగున, నెయ్యం బగునట్లు గాఁగ నెఱి బలికితి నే
నెయ్యది సుఖంబు పథ్యం, బెయ్యది యెఱుఁగంగఁ దథ్య మెయ్యది దానిన్.

తే. బహువిధంబులఁ బలుకు నాపలుకు లెల్లఁ, జీఁద కన్నిడి తన పెడచెవులఁ బెట్టి
యూఱతొఱలు మఱుమాట లిచ్చి యపహసించె దుర్యోధనుఁడు వేయుఁ జెప్పనేల.

క. అనిన విని ధర్మజుం డి, ట్లను నప్పుడు దండ్రి యుచిత మాడఁడె భీష్ముం
డును గురుఁడు విదురుఁడుం దక్కిన పెద్దలుఁ బలుక రే తగినచందమునన్.

క. నావుడు హరి యిట్లను సద్భావమున విచిత్రవీర్యతనయుఁడు దగ నా
నావిధములఁ జెప్పిన నం, భావన వినఁ డతఁడు వలుకుఁ బ్రతికూలంబుల్.

సీ. శంతనుపుణ్యవంశం బంకురించినచందంబు నంబికానందనుండు
జాత్యంధు డై యుండ సామ్రాజ్య మంతయుఁ బాలించి పాండునృపాలుఁ డతనిఁ
గొలిచి యుండుటయును గురుకులంబున కెల్లఁ దేజంబుగా మీరు దిగ్విజయముఁ
జేసి కావించినసిరి వారు వంచనఁ గొనుటయు సత్య మకుంఠితముగ

తే. నీవు సమయంబు నడపిన నెఱియుఁ దండ్రి, పాలు మీకు నీఁదగుటయుఁ బాడిలేమి
నడరఁ జెడుదురు కౌరవు లనియుఁ బెద్ద, లెల్లఁ జెప్పిరి మొగమోట యింత లేక.

క. అలయక యందఱుఁ జెప్పం, గలయంతయుఁ జెప్పి రతఁడు గటకటఁబడి య
క్కొలువు వెడలిపోయెం ద, మ్ములుఁ గర్ణుఁడు రాజలోకముం దో నరుగన్.

వ. ఇట్లు గొడుకు ముష్కరుం డై యరిగిన ధృతరాష్ట్రుండు గాంధారి రావించి,

క. తగ విదురుఁ బంచి యాతని, మగుడఁగఁ బిలిపించె నాయమయుఁ దనయునకున్
వగయును గూర్మియు వెరవును, మిగిలిన వచనముల సంధి మెయికొనఁ జెప్పెన్.

అపశ్రు

యం. జానకీరాణి



త్రస టిక్కట్టు కొనడం, రైలు ఎక్కడం అంతా అబద్ధంగా అనిపించింది మధుమూర్తికి. ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో వచ్చి కూర్చున్నాడు. రైలు కుదుపుకి లయగా శరీరం ఊగుతోంది. మధుమూర్తి తలంతా దిమ్ముగా వుంది. ఏదీ తోచడం లేదు. ఒక మహావేశంలో, ఏదో తనని తరుముకువస్తున్నట్లు వచ్చి యీ రైల్లో కూర్చున్నాడు. తను ఎక్కడికి వెడుతున్నాడు, ఎందుకు వెడుతున్నాడు? నిన్న కాదూ తను యామినిని చూసింది? అంతా ఒక కలలా, ఏనాడో జరిగిపోయినట్లుగా అనిపిస్తోంది ఎందుకు తనకి? నిన్న సాయంత్రం కాదూ ఆమెను 'ఖమాసు' రాగం కీర్తన ప్రారంభించింది?-ఏమిటో తెలియనిబాధ, యిదమిత్థమని తేల్చిచెప్పలేనిది-తను ఏదో ఆపదలో చిక్కుకున్నట్లు-సముద్ర కెరటాలు తనని వెంటనంటి పరువులెత్తి వస్తుంటే తను తీరానికి పారిపోతున్నట్లు-ఎక్కడుంది తీరం?

యామినిని గురించిన ఆలోచనలు అరికట్టడానికి వీల్లేనివి. రాత్రిళ్ళు కొబ్బరాకుల మీదుగా ప్రాకివచ్చే వెన్నెలలు, సాయంసమయంలో జలతారు తీగెల్లాగా మెరిసే వెన్నెలలు, తెల్లవారుఝామున జాలిగా కనుపించె చంద్రికలు-అన్నీ తలపుకు వస్తాయి-ఏదీ తలపున నిలువదు-యామినిని తలచుకుంటే.

*   *   *

నాలుగుసంవత్సరాల క్రితం సుందరికి సంగీతం నేర్పడానికి నెల్లూరుదగ్గరకువెళ్లాడు మధుమూర్తి. సీతారామయ్యగారు జమీందారు. తన కూతురుకి మధుమూర్తివంటి విద్వాంసుచే సంగీతాన్ని చెప్పాలని ఆయన అభిలాష. ఆయన మాటను, ఆశ్రయాన్ని కాదనలేకపోయాడు మధుమూర్తి. ఆడపిల్లకి పాఠం చెప్పడం, అందులోనూ వారింట్లో వుండి చెప్పడం, సమంజసమేనా కాదా అని ఆలోచించాడు మధుమూర్తి. అతనికి ఇదివరలో శిష్యులు లేకపోలేదు. అతనికి అమిత వాత్సల్యం శిష్యులంటే, అందులోనూ తీగెలాంటి కంఠాలు విచ్చి బాలికలు పాడుతుంటే అతని హృదయం వాత్సల్యంతో ఉప్పొంగిపోతుంది. తన కంఠంలో, తన శిష్యుల కంఠాల్లో పలుకని మధురస్వరాలు, తీయందనాలుబాలికలకంఠాల్లోపలుకుతాయి పదహారు సంవత్సరాల సుందరి, తంబూ

రతో శ్రుతికలిపి జం
ఆనంద మనిపించేది
లకు తగిన బాలిక ం
కున్నాడు అతను.
దీర్ఘాలు పాడుతుంటే
తుంటే - అతని హృ
గంభీరత్వం నిండే
రాగం పాడితే అత

సన్నాయి వాయిం
'సారామత్రి' పాడితే
గోపురాలు గోచరిం
మ్రోగేవి అతని చెవి

సుందరి సంగీతం
త్సరాల్లో మధుమ
చుకుంది. తెల్లవారి
'ఆకారసాధన' చేస్
వచ్చేది మధు మూ
అతని పిలుపు వినడం
క్రొవ్వొత్తి వెలుగ
కూర్చునేది. అతను
వాడు. ఆమె 'మలయ
వర్షం పాడుతుంటే
బంగారు కిరణాలు,
చెట్లు - అన్నీ ఆమె
నట్లు అనిపించేది.

మధుమూర్తికి తో
వంటి ఇల్లు యిచ్చా
మంతా ఆ పరిసరా
వెళ్ళివచ్చినతరువాత
గంటసేపు - మళ్లీ రా
ప్రకారం మరి కొం
జరిగేది.

ఒక్కొక్క రాత్రి
మధుమూర్తికి ఏమి
తోచేది కాదు. ఈ
సుందరి - దివ్యసుంద
రి-తనకి ఎంత పేరు ప్ర
తిష్ఠలు తీసుకువస్తు
దో?తను నేర్పినవిద్య
తనగొంతులోని ఝుం

లు ఈమె మూలా
ఖ్యాతి సార్థించుకుం
టాయి. తండ్రి ప్ర
యోజకుడైన తన శ
త్రుణ్ణి చూసి ఉప్పొం

పాడుతున్నా
త్రికి. నా ఆశ
విశ్వయించు
న తలయె త్తక,
వర్షం పాడు
డుగా, ఏదో
'కళ్యాణి'
తోరణాలు,
చేవి. ఆమె
దేవాలయ
గణ గంటలు

రెండుసంవ
వనువు ఏర్పటి
లేచ్చి, ఆమె
మెలపువ
ందరీ' అన్న
అతనిగదిలో
సీమీద వచ్చి
ంతెత్తి పాడే
' రాగంలో
ముభానుడు,
గా తలలూచే
ధురితో నిండి

చిన్న కుటీరం
సౌంధర్య
ది. కాలేజీకి
ం కాలం ఒక
మూర్తి ఆజ్ఞ
ంగీత సాధన

గుతాడు. గురువు తన విద్య విఖ్యాతి పొందడం చూసి ఉప్పొంగుతాడు. అదే వాపత్యం గురువుకీ, పితయనికి. మధుమూర్తి ఇల్లా అనుకునేవాడు. ఈ చిన్న వయస్సులో వున్న నాలో యీ భావం కలిగిస్తోంది యీమె, ఏ పూర్వజన్మ బాంధవ్యమో అని.

* * *

సుందరి అప్పుడే పాటవాపి తంబూర మీద ముఖమల్ గలేబు తొడిగింది. "పుస్తకాలు తెచ్చుకుంటాను" అని ఆమె వెళ్ళబోతుంటే ఆపాడు మధుమూర్తి.

"చూడు సుందరీ, నాకు ఆ భావగీతం వినిపించావు కాదు" అన్నాడు. ఆమె సిగ్గుపడింది. అతనికి భావగీతాలు ఎక్కువగా నచ్చవని తెలుసు. కానీ తనని మెప్పించడానికి అల్లా అడుగుతాడు. "రాత్రి పాడుతాను" అన్నది. అంటూనే కూర్చుంది తివాసీమీద.

"మీ కాలేజీ విశేషాలు చెప్పవూ నాకు?" అన్నాడు మధుమూర్తి. సుందరితో ఖబుర్లాడి కొన్నిరోజులయింది. "ఏమున్నాయి మాస్టరూ, మా కాలేజీ వార్షికోత్సవం వచ్చేవారం. నేను 'రాగమాలిక'లో ప్రార్థనశ్లోకం పాడనా మాస్టరుగారూ?" అన్నది ఆమె ఆశగా.

"అలాగే. మీ కాలేజీలో అంతా ఏమనుకుంటున్నారు వార్షికోత్సవాన్ని గురించి? నిన్ను పాడమని అడిగారా?"

"అడిగారు. పైగా అన్నారు..." నాలిక్కరచుకుంది.

"ఏమన్నారు?"

సుందరి అయిష్టంగా చూసింది. "ఏమీ లేదు." ఆమె ముఖం ఎర్రబడింది. మళ్ళీ అన్నది "ఏమీ లేదు" అని.



మధుమూర్తి నవ్వాడు. "పోనీలే. వెళ్ళు పుస్తకాలు తీసుకురా" అన్నాడు.

తలవంచుకుని కూర్చుంది సుందరి, కదల్లేదు.

"పాఠంవద్దా సుందరీ?" అన్నాడతను. ఆమె ఉలిక్కిపడి లేచింది. తత్తరపాటుతో వెళ్ళింది.

ఎందుకు ఆమెకళ్ళు చలిస్తున్నాయి?, నేనేమన్నాను? అనుకున్నాడు మధుమూర్తి. ఆమెవచ్చిందిపుస్తకాలతో. తలఎత్తకుండానే కూర్చుని పాఠం చదివింది. 'స్వరకల్పన' గురించి ప్రత్యేక విషయాలు చెబు

తున్నాడు అతను — కానీ ఎందుకో ఆమె చేతులు వణుకుతున్నాయి?

"ఏమైంది సుందరీ? ఎందుకల్లా వున్నావు?" అన్నాడు పుస్తకం మూసి.

"ఏం లేదు."

"కాదు. చెప్పాలి... చెప్పమ్మా. చెప్పు తల్లీ."

మధుమూర్తి మాటలకి తావులేదు. సుందరి అప్పటికే చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తోంది. మధుమూర్తికి అర్థం కాలేదు.

"ఏమైంది సుందరీ? కాలేజీలో ఎవరేమన్నారు? నాన్నగారు ఏమైనా అన్నారా? నేను అడిగినదానిలో పొరబాటుందా? చెప్పు తల్లీ".

ఆమె కళ్లు తుడుచుకోకుండానే "వద్దు. వద్దు." అంటోంది.

"ఏమిటి వద్దు?"

"మీరు అల్లాగ అనొద్దు. నన్ను తల్లీ అనవద్దు..."

మధుమూర్తి ఆశ్చర్యపోయాడు. "ఏం?" అన్నాడు. "మీకు తెలియదు. మీకు అర్థం కాదు. వద్దు. కాలేజీలో అంతా..." అస్పష్టంగా అంటూ, మళ్ళీ ఏడిచింది సుందరి.

మధుమూర్తికి ఏమిటో అయోమయంగా వుంది. ఆమెను తను వాత్సల్యంతో సంబోధించకూడదూ? ఏమిటి కాలేజీలో అనుకునేది? ఈ బాలిక బాధపడడానికి కారణం ఏమిటి? తనమీద భక్తిప్రపత్తులు లేవూ? ఆమె తండ్రి పట్లవున్న గౌరవం, ప్రేమ తనమీద లేవూ, తన దగ్గరకూడా చిలిపిగా, చిన్నారిచేష్టలతో ప్రవర్తించకూడదూ సుందరి?—

సుందరి ఆపుకోలేని ఏడుపుతో బైటికి వెళ్ళింది. ఆ రాత్రి పాఠం లేదు. సీతారామయ్యగారు వచ్చి కుశలప్రశ్నలు వేశారు. మద్రాసులో సుందరి కచ్చేరీ పెట్టించడం సంగతి వచ్చింది మాటల్లో.

"అమ్మాయి సంగతి అంతా మీ యిష్ట ప్రకారం జరుగుతుంది. మీకు వప్పగించాను." అన్నారు.

మధుమూర్తి నవ్వాడు. "మీరు అంత నమ్మకముంచినందుకు ఋణ్యుణ్ణి. సుందరిమీద మీ కెంత వాత్సల్యమో నాకూ..."

సీతారామయ్యగారు వారించారు. "ఊరుకోండి. చాలా తేడావుంది." అన్నారు. ఏమిటో ఆ తేడా అనుకున్నాడు మధుమూర్తి. నిజమే, ఆయన కన్నతండ్రి—తనకి మధ్యనవచ్చి, వాత్సల్యాన్ని కురిపిస్తున్న అపరిచిత వ్యక్తి.

ఆ రాత్రి సుందరి ఏడుపు అతని చెవుల్లో గింగురు మంటూనే వుంది. పాపం, పిల్ల ఎందుకు అల్లా బాధపడింది అనుకున్నాడు. గోవత్సాన్ని తలచుకున్న గోవులా బాధపడ్డాడతను. దైవప్రార్థన చేసుకుని, ప్రశాంతంగా నిద్రపోయాడు.

* * *

తెల్లారి సుందరి రాలేదు. అయ్యగారు వస్తానన్నారు అని నౌఖరు ఖబురు తెచ్చాడు. సుందరి పడుకునే వుంది అని చెప్పాడు.

ఆ సాయంకాలం — "మాస్టరు గారూ, మీ అమ్మగారు ప్రస్తుతంలో యిక్కడికి రారా?" అన్నారు సీతారామయ్యగారు—అదీ యిదీ మాట్లాడి.

"మా అమ్మగారా? ఎందుకండీ?" అన్నాడు మధుమూర్తి. సీతారామయ్యగారు కొంచెం సేపు మౌనంగా ఆగారు.

"చూడండి మాస్టరుగారూ, సుందరిని గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

మధుమూర్తి నవ్వాడు "సుందరికేమండీ? బంగారు తల్లి, చక్కని కంఠస్వరం, విద్యయందు సముచిత గౌరవం, శ్రద్ధవున్నాయి. మీరు అదృష్టవంతులు."

"సుందరికి వివాహం చేయాలని నేను, వాళ్ళమ్మ కుతూహల పడుతున్నాము. పద్దెనిమిదేళ్ళు వెళ్లాయి కాదూ?"

"సంబంధాలు చూశారా?" అన్నాడు మధుమూర్తి. సీతారామయ్యగారు మాట్లాడలేదు. అర్థస్ఫూర్తితో నవ్వారు.

"మాస్టరు గారూ, మీకు విప్పి చెప్పనక్కర్లేదనుకుంటాను. సుందరి మీకు నచ్చింది. ఆమె మనస్సులోని ఆరాధ్యదైవం మీరు. మీ అమ్మగారి అనుమతి తీసుకుని—"

మధుమూర్తి నిర్ఘాంత పోయాడు. ఏం మాటలివి? గురుశిష్యుల బాంధవ్యం తెలుసా వీళ్ళకు?

అతను లేచి, నిలబడి కిటకీదగ్గరకువెళ్లాడు. "సీతారామయ్యగారు, నేను కొంచెం కష్టం కలిగించవచ్చు మీకు. నా భావాలు వేరు, గురుశిష్యులను గురించిన నా అభిప్రాయాలు వేరు. నేను ఏర్పఱచుకున్న బాంధవ్యం వేరు. నన్ను క్షమించండి." తనని సుందరిని బంధించిన ఆ జలతారు తీగెలు మరింత సన్ననై, తెగిపోతున్నట్లనిపిస్తోంది—తను యిక్కడున్నా కొన్ని వేల మైళ్ళ దూరంలో — వీరందరికీ అపరిచితుడుగా వున్నట్లనిపిస్తోంది మధుమూర్తికి.

సీతారామయ్యగారు కొంచెం ఆలోచించారు. "మధుమూర్తీ మీరు అపోహ పడుతున్నారు. మీరుసుందరియెడల ఏదో భావం కలిగివున్నానని అనుకుంటున్నారు. ఇప్పుడు వేరొక దృష్టితో చూడడం ప్రారంభించండి. ఆమె చిన్నపిల్ల కాదు, చూడండీ, మీకూ పెద్ద వయస్సు లేదు..." ఇంక మధుమూర్తి వినలేకపోయాడు.

"సీతారామయ్యగారూ, నన్ను క్షమించండి—ఇదంతా తాత్కాలిక విషయం కాదు—నా ఆశయాలు వేరు. గురుశిష్యుల బాంధవ్యాల్ని గురించి నా భావం వేరు. ఆ పవిత్రభావం నెలకొంటేగానీ విద్య అలవింపు కాదు. నేను నిర్మలుడనై, నిశ్చలిత మనస్కుడనై చెబితేగానీ విద్యరాదు. ఆ భక్తిభావం, పవిత్రభావం విద్యకు మూలం—మీరు పెద్దలు. నన్ను మన్నించండి."

చాలాసేపు ఆయన మౌనంగా కూర్చున్నారు. ఆయన వెళ్ళబోతుంటే మధుమూర్తి అన్నాడు. "సుందరి బుద్ధిమంతురాలు. నేను యింక ఎక్కువగా నేర్పవలసినది ఏమీ లేదు.

నాపట్ల యింతకాలం మీరు చూపిన ఆదరణకు కృతజ్ఞుణ్ణి. నేను సెలవుతీసుకుంటాను. అవసరమైనప్పుడు నాకు వ్రాయండి. నేను సిద్ధంగా వుంటాను."

సీతారామయ్యగారు మౌనంగా తలూపి వెళ్లిపోయారు.

మధుమూర్తి గంభీరంగా వున్నాడు. తన సామాను సర్దుకున్నాడు. "నేను రేపుదయం రైల్లో వెడుతున్నాను. నన్ను మన్నించండి. సుందరికి నా ఆశీర్వచనాలు." అని చిన్న చీటీ వ్రాసి రాత్రి తొమ్మిదిగంటలవేళ సీతారామయ్యగారికి పంపాడు. దైవప్రార్థన చేసుకుని ఆ రాత్రి నిద్రించాడు

ఏదో స్పర్శకి—ఉలిక్కిపడి లేచాడు మధుమూర్తి. వెన్నెల పడుతోంది తనమీద. లేచికూర్చున్నాడతను. తన కాళ్ళదగ్గర—సుందరి! లేచి దీపం వేశాడు. గొంతు జీరవోయినట్టుంది అతనికి ఏమిటీబంధనాలు అనుకున్నాడు.

"ఏమిటిసుందరీ? ఏమైనా చెప్పాలని వచ్చావా?" అన్నాడతను. రాత్రి ఒంటిగంట కొట్టోంది. కొంచెం అపశ్రుతిగావుంది యీ రాక.

సుందరి మళ్ళీ ఏడుస్తోంది

"ఎందుకేడుస్తావు? ఏమిటి నీ అభిమతం? చెప్పు." అన్నాడు మధుమూర్తి కుర్చీలో కూర్చొని ఆమె యింకా ఏడుస్తోంది సన్నగా.

"చూడమ్మా. నా ఆశీర్వచనాలు నీకు సర్వదా వుంటాయి. ఎందుకేడుస్తావు పిచ్చితల్లి. నీకు యింకా ఎన్ని అనుభవాలు, యీ పిచ్చిమాస్టరుని మర్చిపోయేవి కలుగుతాయి."

ఆమె ముఖంమీదనుండి చేతులు తీసి అతనివేపు చూసింది. ఆమె రెప్పలు బరువుగా వున్నాయి చెక్కిళ్లు మలినమై, ఎర్రబారివున్నాయి. "మీరు వెళ్ళవద్దు." అన్నది మెల్లిగా.

"వెళ్ళక ఏంచేయమంటావు?- నేను వెళ్ళిపోవడం ఎవరిమీదా కోపంతో కాదు. నా ఆశయం వేరు. నీకు అర్థంకాదు. చూడు సుందరీ; నీకు నేర్పిన సంగీతం చాలదూ?"

కళ్లు తుడుచుకుంది సుందరి. "నాకు సంగీతంవద్దు. మీరు ఉండండి - వెళ్లవద్దు మీరు—"

మధుమూర్తి యింకా యింకా దూరమౌతున్నాడు యీ పరిసరాలకి. "చూడు తల్లీ..."

"వద్దు. ఆ పిలుపువద్దు. మీ వాత్సల్యం వద్దు..." మళ్లీ ఏడుస్తోంది సుందరి.

"ఔను సుందరీ!-నీవు భ్రమలోవున్నావు మీ నాన్నగారికి నీమీద ఎట్లాంటి వాత్సల్యమో నాకూ అట్లాంటి వాత్సల్యమే వుంది. నీవు తంబూరని లాలించినట్లుగా నిన్ను లాలించా లనిపిసుంది. నీ తల నిమిరి, తల్లీ అని నోరార పిలవాలనిపిసుంది. నీకు అర్థం కాదూ ఆ భావం? గురుశిష్యుల మధ్య వేరొక భావం నే నూహించలేను. నీ కళ్లలో నాకు జాలి, నామీద భక్తిమాత్రమే గోచరిస్తాయి, గోచరించాయి. మలినం చేయకూడదమ్మా యీ బాంధవ్యాల్ని" మధుమూర్తి లేచి నిల్చున్నాడు.

"చూడు తల్లీ - వెళ్ళి పడుకో. చిన్నతనం! భ్రమలో వుంటున్నావు యింకా. నీకు చాలా సౌకర్యాలున్నాయి జీవితంలో. నేను యీ 30 సంవత్సరాలలో నా మనస్సులో ఎన్నడూ పొందని ఆర్ద్రతని నీ మూలంగా పొందాను. వెళుతల్లీ."

సుందరి వెళ్లలేదు. నిస్సహాయురాలిలాగా మధుమూర్తి గదిలోనే కూర్చుంది మౌనంగా గంటలు గడిచాయి తెల్లవారుఝామున, పాలిపోయిన ముఖంతో, నిద్రలేనికళ్లతో తూలేస్థితిలో లేచి, అతని పాదాలకు నమస్కరించింది. తన చల్లని వేళ్లతో ఆ పాదాలని స్పృశించి లోపలికి వెళ్ళింది సుందరి

* *

ఒక అధ్యాయాన్ని అల్లా మూసివేసి, అనుభవాలను పొందికగా మడిచి హృదయంలో దాచుకుని బరువుగా బయలుదేరాడు మధుమూర్తి. రైల్లో కూర్చుంటే, ఒక ఆశయ సిద్ధికోసం పయనిస్తున్న బాటసారివలె అగుపించాడు తనకి తను తను చేయలేని పనులని చేయించాలని చూసుంది యీ లోకం. తన వయస్సు, విద్య, రూపం, ధనం - ఇవి చూసి తనకి పుత్రికాసమానమైన శిష్యురాలిని తెచ్చి వివాహం చేస్తానంటారే? ఈ బాంధవ్యానికి ఉండవలసిన గౌరవం, పవిత్రత లేవూ? తను చేయలేడు ఆ పని. తన శిష్యులను తను ఆ విధంగా చూడలేడు. ఒక ఆశయం, ఒక సంగీత సరస్వతిని విడిచివచ్చాడు!

* * *

సుందరిని విడిచివచ్చిన ఆరేడు మాసాల వరకు ఎవరికీ పాఠాలు చెప్పలేదు మధుమూర్తి. విశాఖపట్నంలోని స్వగృహంలో నే వున్నాడు-అరుదుగా కచ్చేరీలు చేస్తూ. అతని మనస్సు నిర్మలంగా లేదు యీ కాలమంతా. ఎందుకు తనలో కలిగే భావాలు లోకంలో ప్రతిబింబించవూ? తాననుకున్నవి కాక వేరొక భావాలు ఉన్నట్లైతే ప్రతిధ్వనించవు, విద్యకే నైర్మల్యం వుండదు.

ఒకనాడు అతనిని చూడడానికి ఒకబాలిక వచ్చింది. ఆమె పేరు యామిని. కాలేజీలో ఆమె కంఠం విన్నాడు మధుమూర్తి. ఆమె అన్న భాస్కరరావు మధుమూర్తికి చిరపరిచితుడు ఆమెకి సంగీతం నేర్చుకోవాలని అభిలాష. భాస్కరరావు ఎన్నిమార్లో అడిగాడు మధుమూర్తిని. కానీ అతను ఒప్పుకోలేదు. భాస్కరరావు యితని చరిత్రంతా ఎరిగున్నవాడు. మధుమూర్తిని, అతని ఆశయాలను, గౌరవిసాడు. 'నీకు తెలియదు మధూ, యామిని ఎల్లాంటి పిల్లో! నేను మనస్ఫూర్తిగా కోరుతున్నాను. ఆమె కంఠానికి తగిన పాండిత్యం నీదగ్గర వుంది' అనేవాడు.

"మా అన్నయ్య పంపించాడు. నేను మీ యింటికి వచ్చి పాఠం చెప్పుకుంటాను" అన్నది ఆమె మధుమూర్తి ఆమెవంక చూశాడు.

"నాకు ఆరోగ్యం బాగుండటం లేదమ్మా. నే నామాట భాస్కరరావుతో చెప్పాను" అన్నాడు.

"అలా కాదు మాస్టారూ, నేను మీ

(47-వ పేజీ చూడండి)

నక్షత్ర ఫలితాలు

(4-6-58 మొదలు 10-6-58 వరకు)

గ్రహ స్థితి

కు	శు కే	ర బు	
	తే 6 దీని పూర్వ బుధుడు అస్తమించును. తే 8 దీని మృగశిరా ప్రవేశము. ధనుర్మకర, కుంభ మీనములలో చంద్రుడు.		
	శ	రా	గు

* అశ్వని [చూ, చే, చో, లా] *

ఈ వారము మీరు ఎవరి సహాయము పొంది కార్యములు చేసుకుందామను కున్నారో ఆ వ్యక్తివల్లనే మీకు ఆటంకములు కలుగుతాయి. ధనాభావము ఎక్కువగా వుంటుంది. ఆధ్యాత్మిక చింత కలవారు అగుటవల్ల ఈశ్వరకృపచే అన్ని కష్టములు తీరుతాయనే నమ్మకముకలదు కనుక మీకు క్రమేణా కార్యానుకూలము కలుగుతుంది. ఇంట్లోవారి ఆరోగ్యము ఆందోళన కలుగ చేస్తుంది. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వ్యాపారస్తులకు నిరాశ. విద్యార్థులకు జయము తక్కువ. 4, 5, 6, 7 సాధు సాంగత్యము, ఆత్మశాంతి, 8 న ఆటంకములు, ఒత్తిడి. 9 కార్యానుకూలము, నష్ట ద్రవ్య లాభము. 10 ఆరోగ్యచింత.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. కోర్టువ్యవహారములు అనుకూలిస్తవి ఎక్కువ శ్రమపడినమీదట యత్నకార్యాలు ఫలిస్తాయి. పరోపకారమునకు యత్నపడి పనుల ఒత్తిడిచే చేయలేక నిందలు పొందుతారు. ఇచ్చిపుచ్చుకొనేపట్ల వివాదములు. ఉద్యోగస్తులకు అధికారుల అనాదరణ. 8 న నిందలు, ఆటంకములు. 9 తోటివారి సహకారముచే సద్దుబాటుగా వుంటుంది. వర్తకులకు వారమంతా నిరాశగావున్నా వారాంతమున లాభముకలుగుతుంది. 10 భార్య ఆరోగ్యము చెడుటచే చింత.

* కృత్తిక [ఆ, ఈ, ఊ, ఏ] *

మీ ఆలోచనలు కార్యరూపములోకి వచ్చిందికి ఎన్ని అవాంతరాలు కలిగినా నిరుత్సాహపడకుండాపట్టుదలతో ప్రయత్నించిన తుదకు కార్యసిద్ధిని పొందుతారు. ఖర్చులకు అవసరమున్న సొమ్ము సమయమునకు లభించక పోవుటచేతను ఋణము చేయవలసి వస్తుంది. అయిననూ వారాంతమునకు తీర్చ గలుగుతారు. ఆత్మీయులకు సహాయము చేయుటకు మాట యిచ్చి చేయలేక నిందల పాలవుతారు. అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. 4 5 6 7 తేదీలలో తీరుబడిలేని కార్యక్రమము ఋణము చేయుట. 8 న నిందలు. ప్రమాద సూచన. 9 ధనలాభం, కార్యసిద్ధి, 10 ఆరోగ్య చింత. ఇంజనీరింగు శాఖ ఉద్యోగులకు

బి. నరసింగరావు

భూస్వాములకు, లోహపు సామాను, రంగుల వ్యాపారస్తులకు కష్టముతో కూడిన లాభ యోగము.

* రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈ వారము మీకు యోగకాలము. మీ బుద్ధిబలమునకు తోడు అధికారుల సహాయం, బంధుసహాయము కలుగుటచేత వచ్చే ఆటంకములను గడిచి ఫలము పొందుతారు. ధనాదాయము వృద్ధి అవుతుంది. వైద్య, జ్యోతిష శాస్త్ర ప్రసంగాలు చేస్తారు. కవులు నూతన రచనలు చేస్తారు. ఈశాన్య దిక్కునుండి మీ దగ్గర బంధువుల కుశలవార్త చేరి సంతోషము కలిగిస్తుంది. విద్యార్థులకు పరీక్షలలో జయం. 4 5 6 7 తేదీలలో ధనాదాయము, బంధు సహాయము, కార్యానుకూలత మొదలగు శుభ యోగములు. 8 న అధిక ఖర్చులు. 9 న పండిత ప్రసంగము, కుశలవార్త. కవులకు, వైద్యులకు, శిల్పులకు, నటీనటులకు యోగ కాలము.

* మృగశిర [వే, వో, కా, కీ] *

ఈ వారము మీకు భాగ్యయోగము ఎక్కువ. ఉన్న ఇబ్బందులు తీరుతవి. అనుకున్న సొమ్ము చేతికి వస్తుంది. దావాలలో గెలుపు పొందుతారు. పురుష సంతానము సుఖ సంతోషాలకై చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి. పండితులతో శాస్త్ర ప్రసంగము చేయుటచే మీవిజ్ఞానము వృద్ధి పొందుతుంది. 4, 5, 6, 7 తేదులలో భాగ్య వృద్ధి, కార్యానుకూలత. 8 న బంధువులరాకపోకలచే ఖర్చులు. 9 ధనలాభము, పండిత గోష్ఠి. ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయవాదులకు యోగకాలము. విద్యార్థులకు పరీక్షలలో జయము.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

ఈ వారము మీకు యోగదాయకము అయిననూ మానసికాందోళన వుంటుంది. ధన యోగము కలుగుతుంది. కవితాగోష్ఠి, సంగీత సభలవంటి వినోదాలలో బంధుమిత్రులతో కలిసి పాల్గొంటారు. ఇదివరకు అనారోగ్యముతో వున్న దూరస్థులైన ఆప్తులు కోలుకున్నట్లు వార తెలిసి సంతోషము పొందుతారు. కవులకు, గాయకులకూ, నటీనటులకూ వారమంతా యోగకాలము. నూలు, బట్టలు, వెండినగలు, బియ్యము వ్యాపారస్థులకు లాభము. 4, 5, 6, 7 తేదీలలో ధనయోగము కార్యసిద్ధి, శుభకార్యములలో పాల్గొనుట, విందు, వినోదము, 9 కుశల వార్త. 8, 10 మానసికాందోళన, నీటిపై ప్రయాణము.

* పునర్వసు [కే, కో, హా, హీ] *

గతవారము అసంపూర్తిగా వుండిపోయిన పనులు ఈవారము లాభకరముగా ముగుస్తాయి ధనయోగము వృద్ధిఅవుతుంది. శుభకార్యములలో పాల్గొంటారు. సాంఘికసేవ చేసి కీర్తి పొందుతారు. విద్యార్థులకు పరీక్షలలో జయము. నూతనగృహ నిర్మాణమునకు ఆలోచనలు చేసారు. విలువగల వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు ఎక్కువ లాభము కలుగుతుంది. ఉద్యోగస్తుల అధికారహోదాలు పెరుగుతవి. 4, 5, 6, 7 తేదీలలో సంఘసేవ, ధన లాభము, యత్నకార్యసిద్ధి, స్త్రీలతోనూ, ఆప్తులతోనూ, విందు, వినోదము 8, 10 అధికఖర్చులు. 9 న భార్యకు అలంకార ప్రాప్తి.

* పుష్యమి [హూ, హే, హో, డా] *

ఈవారము యత్నకార్యములకు ఆటంకములు కలుగుతాయి. కార్యభారమువల్ల తీరుబడి వుండదు. ఆర్థికస్థితి సరిగా వుండనందున గృహావసరములకూ ఇబ్బంది కలుగుతుంది. వేళ తప్పిన భోజనమువల్ల, కడుమంట, తలపోటువంటి అనారోగ్య చిహ్నములు కనబడగానే అవుషధసేవ చేయుట మేలు. వర్తకులకు శ్రమ ఎక్కువ. ఉద్యో

కష్టులకు ఒత్తిడివున్నా అధికారులమన్నన పొందుతారు. రాజకీయవాదులకు మేలుగా వుంటుంది. వారమంతా అలజడిగావున్నా, కార్యలాభము, ధనయోగము కూడా వుంటాయి.

* ఆశ్లేష [డి, డూ, డే, డో] *

ఈ వారము మీకు మిశ్రమ యోగము. మొదట్లో నిరాశగా వుంటుంది. కాని క్రమేణా స్నేహితుల సహాయమువల్ల కార్యలాభము పొందుతారు. ధనలోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్తులకు మంచిరోజులు కావు. వర్తకులకూ మాంద్యం. విద్యార్థులకు జయము తక్కువ. ప్రభుత్వముచే రహస్య భేదనమున నియమితులవుతారు. మనోవ్యధ, గృహకలతలు, నిరాశవంటి అవయోగములున్ననూ, ప్రయాణము, మిత్రసహాయము కార్యసిద్ధి, అన్యదేశస్తులతో పరిచయము, విచిత్ర వస్తు సంపాదన మొదలకు మంచి యోగములుకూడా వుంటాయి. 10 న ఆప్తుల ఆరోగ్యచింత.

* మఖ [మా, మీ, మూ, మే] *

ఈ వారము తలపెటిన పనులకు ఆటంకములు కలుగుతవి. ధనాభావమునకు తోడు బంధువుల రాకపోకలవల అధికఖర్చులచే మనోవ్యధగా వుంటుంది. మతసంబంధమైన ఉపన్యాసములు వినుట, వ్యాసములు చదువుటవల్లను సాధుసాంగత్యమువల్లను ఆధ్యాత్మిక చింతచే మనోవికాసము కలుగుతుంది. ఉద్యోగస్తులు కొంత శ్రమపడిన తరువాత మేలుపొందుతారు వర్తకులకు అకస్మాత్తుగా ధనలాభముకలుగుతుంది. వారమంతా గృహకలతలు, అధికఖర్చులు, ఆటంకములువున్నా ధనలాభము, సాధుసాంగత్యము, ఆత్మవికాశమువంటి శుభయోగములు కూడా కలుగుతాయి. 10 న ఆప్తుల ఆరోగ్యము సరిగా వుండనందున వ్యధ.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
మో, టా, టి, టూ

ఈ వారము పరోపకారమునకు పూనుకొని పొగడ్త, మాటపడి విచారిస్తారు. కార్యభారము ఎక్కువ. ధనలోపముచేత క్రిందుమీదౌతారు. దావాలలో గెలుపుకలుగుతుంది ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారములలో వివాదపడతారు. భార్య ఆరోగ్యము ఆందోళన కలుగజేస్తుంది. ఈ వారము వివాదములు, ఆటంకములువంటి అవయోగములు వున్నా ధనలాభము, కార్యానుకూలమువంటి మంచి యోగములుకూడా కలుగుతాయి. వివాదము. 10 ఆరోగ్య చింత.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పీ]

ఈ వారము రాబడికి మించిన ఖర్చులు కలుగుటచే అప్పుచేయవలసి వస్తుంది. ప్రారంభించిన కార్యములకు ఆటంకములు కలిగినా అధైర్యపడక ప్రయత్నించి తుదకు సఫలులౌతారు. శరీరముపై కురుపులు లేస్తాయి. అగ్నివల్లగాని, యంత్రములవల్లగాని ప్రమాదము జరుగవచ్చును. ఉద్యోగస్తులకు అధికారుల పోటుమాటచే మనోవ్యధ. సోదర సహాయము కలుగుటవల్ల ఇదివరకు చేసిన అప్పు తీరుస్తారు భూస్వాములకు, గనుల యజమానులకు వారమంతా శ్రమతో కూడిన లాభయోగము పోలీసుశాఖ వారికి మేలు కాలము. 8 ప్రమాదము. 9 ధన యోగము. 10 ఆరోగ్యచింత.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము మీకు ధనలాభము, వ్యవహారములలో జయము, శుభకార్యములలో పాల్గొనుట, బంధుదర్శనము, విద్యాప్రాప్తి, నూతనకార్యప్రయత్న లాభము, మంచి ఉత్తరములు వచ్చుట, జ్ఞానమార్గ ప్రసంగము, యుక్తిగా ప్రసంగించుట, గణిత, జ్యోతిషశాస్త్ర చర్చలు, సుఖభోజనము వంటి శుభయోగములు కలుగుతాయి. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, ఇత్తడి, కంచు మొదలగు సరుకు వ్యాపారస్తులకు లాభయోగము. విద్యార్థులకు జయము. వారమంతా కవులకు, శిల్పులకు, నటీనటులకు మేలుకాలము.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము దేవబ్రాహ్మణభక్తి, పుణ్యక్షేత్ర సంచారము, ధనలాభము, పుణ్యకార్యములు చేయుట, పుత్రప్రాప్తి సూచనలు, గృహమందు శుభకార్యములు జరుగుట, బిరుదులు పొందుట, ఆకస్మిక ప్రభుత్వ సన్మానము, సుఖజీవనము, వైద్య జ్యోతిష శాస్త్ర ప్రసంగములు, ఘనకార్య ప్రయత్నమువంటి రాజయోగములు కలుగుతవి. విద్యార్థులకు పరీక్షలలో జయము. ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయవాదులకు వారమంతా యోగకాలము.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈ వారము మీకు వినోదములలో పాల్గొనుట, దధిక్షీర మధుర పదార్థ యుక్త సుఖభోజనము వెండిపాత్రలతో చేయుట, తలచిన కార్యములలో జయము, నీటిమీద ప్రయాణము, తెల్లని వస్తువులు కొనుటవంటి యోగములు కలుగుతాయి. ప్రత్తి, దూది, నూలు, తెల్లని వస్త్రములు, వెండి, బియ్యము ద్రవపదార్థ వస్తువుల క్రయవిక్రయ ములలో వర్తకులకు లాభము. కవులకు, గాయకులకు, నటీనటులకు మేలుకాలము. 8 నిలకడలేని స్థితి. 9 ధనయోగము. 10 ఆందోళన విద్యార్థులకు పరీక్షలలో జయము.

విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారము ధనధాన్యవృద్ధి, పశుసంపద, కృషి మూలముగా లాభము, వివాహాది శుభకార్యములలో పాల్గొనుట, ఇష్టవస్తు లాభము, పరోపకారమువల్ల కీర్తి, ప్రభుత్వ కార్య నిర్వహణవల్ల గౌరవమువంటి రాజయోగములు కలుగుతవి. విద్యార్థులకు పరీక్షలలో జయము. వర్తకులకు ఖరీదుగల వస్తువుల క్రయ విక్రయములలో లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము. 8 వివాదము, కుటుంబ కలహము కలుగును. 9 యత్నకార్యసిద్ధి 10 ఆందోళన.

ధరలు :

నూలు, వస్త్రములు : కొంచెము పెరుగును.

నూనె దినుసులు: కొంచెము చురుకగును.

బెల్లము, పంచదార, చింతపండు: సులభమగును.

ఆహారధాన్యములు : కొంచము పెరుగును.

పప్పుదినుసులు : స్వల్పముగా పెరుగును.

వెండి, బంగారము: మందముగా వుండును.

సస్యానుకూలముగా గాలితో కూడిన వర్షములు అంతటా కురియును.

* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారి వారి పేర్ల ననుసరించి పేరు మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, హనుమాను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలుడనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకొనునది.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము మీకు కార్యభారము ఎక్కువ. రాబడి తక్కువ. గృహావసరములు తీరనందున స్పర్ధలు. ఆరోగ్యము సరిగాలేని సూచనలు కనబడగానే గ్రహరాజైన రవికి శాంతిచేయుట మేలు. ఉద్యోగస్తులకు కొత్త సమస్యలు. వర్తకులకు ఆందోళన, విద్యార్థులకు పరీక్షలలో జయము తక్కువ. 4, 5, 6, 7 ఆటంకములు, కార్యభంగము, శ్రమకలిగిననూ పితృవర్గమునుండి సహాయము, కార్యలాభము కూడా వుంటాయి. 8 ఆరోగ్య భంగము. 9 లాభ యోగము. 10 న రాజకీయ వాదులకు ఆందోళన.

★ నక్షత్రఫలితాలు ★

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము అనుకున్న సౌమ్య సకాలములో చేతికిరాదు. కార్యాచరణకు పాలుపోని అనిశ్చిత స్థితిలో వుంటారు. చేదామనుకున్న పనులకు మొదట్లో ఆటంకములు కలిగినా వారాంతమునకు మిత్ర సహాయమువల్ల కార్యానుకూలత పొందుతారు. వర్తకులకు నిరాశగావున్నా వారాంతమునకు లాభము. 4, 5, 6, 7 తేదీలలో ప్రయాణము. విదేశీయులతో పరిచయము, విచిత్రవస్తు సంపాదన కలుగుతవి. 8 న ఆపుల ఆరోగ్యము గురించి చింత. 9 మిత్ర దర్శనము, కార్య లాభము.

*** మూల [యే, యో, బా, బి] ***

ఈ వారము మీకు మిశ్రమ యోగము. ధనలోపము వుంటుంది. అనుకున్నట్లుగా పనులు జరగవు. కోరిన సహాయము లభించదు. అవసరములు తీరక ఆందోళన కలుగుతుంది. దైవముపై భారము వేసి కార్య సాధనకు ప్రయత్నించి ఫలమును పొందుతారు. వర్తకులకు చాలాకాలమునుండి రాకుండా నిలిచిపోయిన బాకీలు వసూలవుతవి. 4, 5, 6, 7 పుణ్య పురుషుల సాంగత్యము, ఆత్మవిశ్వాసము, శాంతి ధనయోగము. 8 ఇంట్లో వారి అనారోగ్యముచే ఆందోళన. 9 నష్ట ద్రవ్య లాభము.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢ]

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. ఇచ్చి పుచ్చుకొనేపట్ల వివాదాలువచ్చి మనోవ్యధ కలుగుతుంది. కోరు వ్యవహారములు అనుకూలముగా తీర్పు వున్నా, మరికొన్ని కొత్తవి తలెత్తుతవి. భార్య ఆరోగ్యము చెడే సూచనలున్నవి. కొర్రలు, రాగులు వంటి అపరదినుసులు, మినుములు, నువ్వులు, ఉప్పు, నూనె సంబంధమగు వస్తువుల వర్తకులకు లాభము. అన్య జాతి వారివల్ల గౌరవము కలుగుతుంది. 4, 5, 6, 7 తేదీలలో శ్రమతో కూడిన కార్యానుకూలత. 8 వివాదములు 9 పైవారిచే గౌరవము 10 ఆరోగ్య చింత

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము ఎంత ప్రయత్నించినా కార్యసాధనలో అనేక ఆటంకాలు కలుగుతవి. సాహసము, పట్టుదల గల వారగుటచేతను నిరాశపొందకుండా కలిగిన చిక్కులను విప్పుకొని మేలు పొందుతారు. సోదర సహాయమువల్ల ఒడిదుడుకులు సద్దుకుంటాయి. జాగ్రత్తగా వుండుటవల్ల అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదము తప్పవచ్చును. 4, 5, 6, 7 తేదీలలో కార్య భంగము, మనోవ్యధ వంటి బాధలున్నా, సోదర సహాయము, కార్యానుకూలత కలుగుతాయి. 8 ప్రమాదము 9 ధనయోగము 10 మనోవ్యధ.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈవారము మీకు యోగదాయకము. మీయుక్తిచేత కార్యసాధలో విజయముపొందుతారు. అధికారుల సహాయము కలుగుతుంది. క్రొత్తవారితో పరిచయ లాభము. ధనయోగము. ఈశాన్య దిక్కునుంచి బంధువులకుశిల వార్త తెలుస్తుంది. విద్యార్థులకు పరీక్షలలో జయము. జ్యోతిష శాస్త్రజ్ఞులకు, గణిత శాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, నటీనటులకు యోగకాలము. 4, 5, 6, 7 ధనలాభము కార్యసిద్ధి, మిత్రలాభము, క్షేమవార్త. 8 న ఆందోళన, 9 న కవులు నూతన రచనలు ప్రారంభిస్తారు.

*** ధనిష్ఠ [గా, గీ, గూ, గే] ***

ఈ వారము మీకు యోగప్రదము. గతవారము అవకుండా నిలిచి పోయిన కార్యములు ఈ వారము సుముఖమవుతాయి. అధికారముతో పాటు ధనాదాయముకూడా పెరుగుతుంది. బిరుదులుపొందుట, సన్మానము జరుగుటవంటి రాజయోగములు కలవు. పండితగోష్ఠి, నూతన గ్రంథములు చదువుటచే విజ్ఞాభివృద్ధి కలుగుతుంది. 4, 5, 6, 7 ధనలాభము. కార్యానుకూలత. సంతానమునకు క్షేమాభివృద్ధి. 8 నిలకడలేని స్థితి. 9 వర్తకులకులాభము. 10 అధిక ఖర్చులు. పండితులకు, ఉపాధ్యాయులకు, న్యాయవాదులకు వారమంతా యోగము.

*** శతభిషం [గో, సా, సీ, సూ] ***

ఈ వారము అన్ని రంగములలోనూ మీరు చేసే ప్రయత్నాలు అనుకూలముగా కొనసాగుతవి. ఆదాయము ఎక్కువవుతుంది. ఇంట్లో వారి ఆరోగ్యము బాగుపడుతుంది. కవితాగోష్ఠి, గానసభలు మున్నగు వినోదములతో బంధు మిత్రులతో కలసి పాల్గొంటారు. నీటిపైని ప్రయాణము చేయవలసియుంటుంది. విద్యార్థులకు మేలు కాలము. దధి, క్షీర, మధుర పదార్థయుక్త సుఖ భోజనము చేస్తారు. బియ్యము, నూలు, బట్టలు, వెండి వ్యాపారస్తులకు లాభము. 4, 5, 6, 7 లలో ధనలాభము. కార్యసిద్ధి. కవులకు గాయకులకు, నటీనటులకు యోగకాలము. 8 ఆందోళన, ఖర్చులు ఎక్కువ. 9 విందు వినోదము. 10 నిలకడలేని స్థితి.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

ఈవారము యత్న కార్యములుఫలిస్తాయి. ఆదాయము అనుకున్నదానికన్నా ఎక్కువగా పెరుగుతుంది. దూరప్రయాణము చేయవలసి వుంటుంది. సాంఘిక కార్యములలో కీర్తిగాంటారు. శుభకార్యాలోచనలు, బంధుమిత్రులతో విందు, వినోదము జరుగుతవి. విద్యార్థులకు పరీక్షలలోజయము. వర్తకులకు విలువగల వస్తువుల క్రయ విక్రయములలో లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము 4, 5, 6, 7 లలో ప్రయాణము, ధనలాభము, కార్యసిద్ధి, శుభకార్యాలోచన, విందు, వినోదము. 8 అధిక ఖర్చులు. 9 అలంకారప్రాప్తి, సన్మానము.

*** ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా] ***

ఈ వారము కార్యభారము ఎక్కువ, రాజవార్తా ప్రసంగములు, వింత మాటలు వినుట, పరాక్రమమువల్ల ఘనత, ధనలాభము ప్రయాణం వుండును. అకాలభోజనమువల్ల వేడిచేసి కడుపునొప్పి, నేత్రపీడ, బలహీనత వంటి సూచనలు కనబడగానే అవుషధ చికిత్స చేయించుకొనుట మేలు. ఉద్యోగస్తులకు బదిలీయగుటగాని ఒత్తిడికి తట్టుకోలేక శెలవుపెట్టుటగాని జరుగును. విద్యార్థులకు పరీక్షలలో జయము తక్కువ. 4, 5, 6, 7 ప్రయాణము, ఘనత, ధనలాభము, కార్యానుకూలత. 8 అనారోగ్యము. 9 అనుకూలము. 10 ప్రతికూలత

*** రేవతి [దే, దో, చా, చీ] ***

ఈ వారము ప్రతిపనికి అనవసరముగా ఆలస్యము కలుగుతుంది. ఏపని చేసేందుకు సమాధానము కుదరక చికాకుపడతారు. ఆశాభంగము ఎక్కువ. వర్తకులకు లాభము తక్కువ. రహస్య భేదనోద్యోగములో చాతుర్యమువల్ల జయము పొందుతారు. ఉద్యోగస్థులకు శిక్షకొరకు వనపర్వతప్రాంతములకు బదిలీ అవుతుంది. వారాంతమున విదేశీయుల సహాయమువల్ల కార్యసిద్ధి కలుగుతుంది. 8 చంచలమనస్సు 9 కార్యలాభము. 10 ఆత్మీయుల అనారోగ్యముచే వ్యధ. ★



వనితాలోకం

కోపం

ఎస్. రుక్మిణి

కోపం, కొంపదీస్తుందన్న సంగతి అందరికీ తెలిసినదే, అలా అని కోపంలేని వాళ్ళెవరన్నా వున్నారా? అంటే ఎవ్వరూ వుండరనుకుంటాను. ఎంతటి శాంత స్వభావులకైనా ఒకప్పుడు కాకున్నా - ఒకప్పుడైనా కోపంవచ్చి తీరుతుంది. కోపం రావడం సహజమే అయినా కొందరు, అయినదానికి కానిదానికి అకారణంగా కోపం తెచ్చుకుని మండిపడి పోతుంటారు ఇలాంటి వాళ్ళ ద్గరికి వెళ్ళి పల్కరించాలన్నా భయమేసుంది. ఇలా ప్రతిదానికి, కోపం తెచ్చుకుని చిఱ్ఱు బుస్సుమంటుండే వాళ్ళని చూస్తే ఎంత ఓర్పుగలవాళ్ళకన్నా అసహ్యం వేసి తీరుతుంది.

కోపం కొందరికి ఎక్కువగా వుంటుంది. కొందరికి ఎప్పుడో తప్ప సాధారణంగా కోపం రానేరాదు. ఒక్కొక్కరికి కోపం ఎంత త్వరగా వస్తుందో, అంత త్వరగా తగ్గిపోతుంది. ఒకరకం మనుష్యులువున్నారు— వీళ్ళకి కొన్ని సంవత్సరాలైనా కోపం పోదు. వీళ్ళని చూస్తే ఒక సామెత చెబుతారు. 'మా వాడికి ఏడాదికి రెండుసార్లే కోపం వస్తుంది. వచ్చినప్పుడు ఆర్నెల్లుంటుందో' అని.

ఇలా కోపం ఎక్కువగా వున్నవాళ్ళల్లో మా బాబాయి ఒకడు. అసలు బాబాయికి ఎప్పుడూ ముక్కుమీదేవుంటుంది కోపం. బాబాయి కోపం చూచి ఓరోజు బామ్మ బాబాయికి, అపర దూర్వాసుడని పేరు పెట్టింది. బాబాయికీపేరు పెట్టిన సంగతి తెలీదనుకోండి. తెలిస్తే ఇంకేమన్నా వుందా? బాబాయినిచూస్తే మాకందరికీ భయం. బాబాయి యింట్లో వున్నాడంటే వాకిట్లోకికూడ అడుగుపెట్టం.

ఓరోజు పక్కింటి పార్వతమ్మొదిన ఓవిషయంగురించి మాట్లాడాలని వాకిట్లో వున్న పిట్టగోడదగరకు రమ్మనమని పిలవనంపించింది. బాబాయి లేదుకదా ఎందుకో అడిగి వద్దామని వెళ్ళాను. పార్వతమ్మొదినతో మాట్లాడుతుండగానే ఎక్కడున్నాడో మరి బాబాయి సమయానికి వూడిపడ్డాడు. బాబాయినిచూడగానే భయమేసింది. తర్వాత వచ్చి మాట్లాడుతానని వదినతో చెప్పేసి, యింట్లోకివచ్చేశాను. బాబాయికి వచ్చిన కోపం యింతా, అంతా కాదు. బాబాయి కోపంచూసి, హడలిపోయాను. 'వీధిలోకి వెళ్ళి పెత్తనాలు సాగించేవరకు వచ్చిందన్న మాట వ్యవహారం, అంటూ మండిపడిపోయాడు బాబాయి.

బాబాయితో పార్వతమ్మొదిన పిల్చిన సంగతి చెప్పదామన్నా వీలుకాదు. ఎంచేతంటే బాబాయి కోపంగా వున్నప్పుడు, మనం మాట్లాడితే మరీ కోపం ఎక్కువయిపోతుంది. అందుచే బాబాయికి కోపంవచ్చినప్పుడు మేమెవ్వరము మాట్లాడము.

ఒక్క మా బాబాయే కాదు. చాలామంది ఇలాంటివారే. వీళ్ళకు యెదురుచెప్పినా, కారణాలు వివరించబోయినా, కోపం తగ్గడం బదులు–మరి కాస్త ఎక్కువే అవుతుంది.

'ఇలా వీధిలోకి వెళ్ళకూడదు. మాట్లాడకూడదు, అని ప్రతిపనికి వంకకనిపెట్టి,కస్సుబుస్సని మండిపడే వాళ్ళనిచూస్తే యివతలవాళ్ళ మనస్సుకి కష్టంతోచి, వీళ్ళకికూడ వాళ్ళమీద కోపంవచ్చి తీరుతుంది.

అదే, వాళ్ళు చేసినపనిలో తప్పెంతవరకు వుందో నిదానంగా పరికించిచూస్తే తెలుస్తుంది. ఒకవేళ తప్పే గనుకవుంటే నెమ్మదిగా మందలిస్తే అవతలి వాళు తమ తప్పేమిటో గ్రహించడానికి వీలౌతుంది. అవతలి వాళ్ళ మనస్సుకి కోప్పడ్డారనే కష్టమూ తోచదు.

ఈ కోపం గలవాళ్ళల్లోనే యింకోరకం వున్నారు. వీళ్ళు బయట ఎవరిమీది కోపాన్నో యింట్లోవారిమీద చూపించేస్తుంటారు. వీళ్ళదంతా అత్తిమీదికోపం దుత్తిమీదన్న, సామెత లాగుంటుంది. ఆఫీసులో ఏ ఆఫీసరుతోటో పేచి పెట్టుకుని, ఆయనమీది కోపాన్నంతా యింట్లో పెళ్ళాం పిల్లలమీద, చూపించేస్తుంటారు కొంతమంది.

ఒక్క మొగవాళ్ళల్లోనే కాదు సుమండీ. ఆడవాళ్ళల్లోను, యిలాంటివాళ్ళు చాలామంది వున్నారు. ఏ పక్కింటి వాళ్ళమీది కోపాన్నో పిల్లలమీద చూపించేస్తుంటారు వీళ్ళు.

మా అక్కయ్య కాపురంవుంటున్న యింట్లో, ఆయిల్లుగల ఆమె ఓరోజు యిల్లు కడిగి పిండిముగ్గు పెట్టింది. అక్కయ్య కూతురు, ఉష మూడేళ్ళది. తెలీక ఓముగ్గును తొక్కేసింది ఇక ఆయిల్లుగలామె పాడుకొంపయిపోయింది. పిల్లలను చూచుకు నేదిక్కూడ లేదియింట్లో. ఇల్లుకడిగిముగ్గుపెట్టుకొనే ఆశకూడ లేదు. పాడుపిల్లలు, పాడు మనుష్యలు, అంటూ ఆరంభించేటప్పటికి (కోపం వచ్చినప్పుడు, ఆయిల్లుగలామెను చూస్తే, కాళికాదేవే అనవచ్చు) అక్కయ్యకూ ఎక్కడలేని కోపం వచ్చేసింది. తెలీకపసిపిల్ల చేసినపనికి, వాళ్ళన్ని మాటలన్నారన్న కోపంతో, "మనగది వుండగా వాళ్ళగదికి ఎందుకు వెళ్ళావని ఉష వీపు వాయ కొట్టేసింది. అక్కయ్యలాటివాళ్ళు చాలామందివున్నారు.

బయటివాళ్ళమీది కోపాన్ని యింట్లో వాళ్ళమీద చూపిస్తే, అందుకు నష్టపోయేది కష్టపడేదికూడ మనమే, కానీ బయటివాళ్ళు కాదు.

కొంతమంది, సమయా సమయాలుచూడకుండా కోపం, ప్రదర్శిస్తుంటారు. వీళ్ళు

(55 వ పేజీ చూడుడు)



ప్రతి స్త్రీకీ భర్తృ వియోగానంతర జీవితం అతి దుర్భరంగా తోస్తుంది. తన భర్త కోసం, ఆ భర్తవల్ల పొందిన సంతానం కోసం స్త్రీ అనేక త్యాగాలు చేస్తుంది. సనాతనులు సామాజిక కట్టుబాట్ల కోసం భరింపశక్యంగాని పనులు అనేకం చేస్తున్నారు. పెనిమిటి పోగానే చేతుల నున్న గాజులు తీసి వేయించటం, అలంకార వస్తువులేమీ ధరించకుండా చేయటం మొదలైనవే ఈ పనులు. ఇష్టం లేనివారిచేతకూడా బలవంతాన ఇవి చేయిస్తున్నారు. భర్తృ విహీన అయిన స్త్రీని ఆ దుఃఖం చాలదేమో నన్నట్లుగా పరమ అందవిహీనురాలుగా కూడా తయారుచేస్తున్నారు. దీనిలో ప్రధానోద్దేశం అట్టి స్త్రీలు పురుషులను ఆకర్షించకుండా చేయడమే అయివుంటుంది. అందవికారంగా తయారుచేసినంతమాత్రాన ఆమెలో మానసిక మైన మార్పు వస్తుందని భావించటము కేవలం అజ్ఞానమే అనిపించుకుంటుంది. సనాతనులు పాటించే ఈ విపరీతచర్యలవల్ల—మానసిక పరివర్తనం రానిదే—ఆశించిన ఫలితాలు ఏర్పడవు. అంతమాత్రాన కట్టుబాటు ఏర్పడదు.

ఇక ఈ దురాచారాలు ఏవిధంగా జరుగుతున్నవో చూద్దాము. కేశఖండన మన్నది ఎక్కువగా పూర్వాచారపరాయణులైన బ్రాహ్మణకుటుంబాలలోనే జరుగుతున్నది. కేశసంపద స్త్రీకి సహజసిద్ధమైనది; భగవత్ప్రసాదితమైనది. దాన్ని బలవంతాన తీసివేయడం కేవలం అమానుషము. స్త్రీ జీవితంలో మధ్య వచ్చి మధ్యనే పోయిన భర్తకోసమని ఈ కేశ సంపదను తీసి వేయడం అన్యాయము. ఇప్పుడిప్పుడే ఈ దురాచారం రూపుమాసిపోతున్నది. ప్రతిస్త్రీకి అలంకార ప్రాయములైన బొట్టును నిషేధించడం, గాజులు పగుల కొట్టించడం అసభ్యతతో కూడిన పనులు.

మంగళ సూత్రాల విషయం మంగళ సూత్రాలన్నవి భార్యాభర్తలమధ్య ఏర్పడిన ప్రేమకు పవిత్ర చిహ్నం. అట్టి ప్రేమ చిహ్నాన్ని భర్త మరణానంతరం భార్య మెడనుంచి తీసి వేయడం తగని పని. మంగళ సూత్రాలను అదేవిధంగా ఆమె మెడలో వుండ నిచ్చినట్లయితే, ఆమె భర్తవున్నట్లే భావించి భర్తృ వియోగ దుఃఖ భారాన్ని కొంత వరకైనా మరచి పోవడానికి వీలుంటుంది. స్త్రీకి జీవితాంతం వరకూ ఒక్కడే భర్త అనే పవిత్ర నియమాన్ని చెప్పకున్నట్లయితే ఆమె మెడలో వున్న మాంగల్యాన్ని తీసి వేయటానికి గాని మరొకడానికి గాని సంఘానికి హక్కు లేదు. భర్తపోయిన స్త్రీని ఏ చెరువు ఒడ్డుకో, నది రేవుకో తీసుకొనివెళ్ళి గాజూ, పూసా పగలకొట్టించడం, మంగళ సూత్రాలు తీసి వేయడం, కేశఖండన సాగించడం మొదలైన ఘోర కార్యాలు చేస్తారు. ఈ పనులు తలుచుకుంటేనే ప్రతి స్త్రీకి గుండె ఝల్లు మంటుంది.

ఇవన్నీ చాలవేమో నన్నట్లు ముఖం చూడాలనే తంతు ఒకటి జరుపుతారు. ప్రతి ముత్తయిదువా వచ్చి ఆవితంతు స్త్రీ తలమీద వేసిన ముసుగు తొలగించిచూసిమరింత దుఃఖభారంతో క్రుంగిపోయేటు చేస్తారు.

రామమోహనరాయల కృషి ఫలితంగా దేశంలో సహగమన దురాచారం అంతరించింది; కేశఖండనాది ఈ దురాచారాలు కూడా ఎంత త్వరగా అంతరిస్తే, భారత వనితాలోకానికి అంత మంచిది ★

శ్రీమతి కొత్తపల్లి రాజ్యలక్ష్మి

ఆత్మరక్షణ; ఆభరణ విసర్జన

సనాతనాచారాలు మంచివే!

మనదేశంలో భర్త గతించిన వెనుక—స్త్రీని కేశఖండనము మొదలైన ఘోర కృత్యములతో అంద విహీనంగా చేస్తున్నారు: ఈ విధానము మిక్కిలి ఘోరంగానే కనిపిస్తుంది. తల్లి దండ్రులు, బంధువులు, ఆప్తులు మున్నగువారి సమక్షములోనే ఈ భయంకర విధానము అమలు జరుగుతున్నది. ఈ వికార విధానాన్ని అమలు జరిపించడానికి - బంధువులు మొదలగువారికి స్త్రీలయెడల ఏమైనా - ద్వేషమా అంటే అట్టి ద్వేషం కలగడానికి - హేతువేమీ కనుపించదు. అవమానకరమని భావిస్తే అట్టి ఘోర విధానానికి బలిచేస్తారా?

గాజులు, బొట్టు - వెంట్రుకలు తీసివేయించడం — అవమానకరమైనదా కాదా— దానివిషయము అటుంచి వీటిని ఎందుకు తీసివేయాలి, ఇవి భర్తతోపాటు వివాహముతో— సంక్రమించినవి కావుగదా! వివాహం జరిగినప్పుడు భర్త కారణంగా స్త్రీకి మట్టెలు, తాళిబొట్టు (ఇవి వివాహ సూచకములగు ప్రత్యేకలక్షణాలు) - ప్రాప్తించుచున్నవి.

నందిగామ సూర్యనారాయణ

మట్టెలు, నల్లపూసలు మంగళసూత్రము మొదలైన వస్తువులు భర్తనిమిత్తముగా వచ్చినవి కాబట్టి భర్తపోయినప్పుడు, ఈ వస్తువులను తీసివేయడం న్యాయమే కాబట్టి అవి పోయినందుకు చింతింప పనిలేదేమో.

మరి, బొట్టు, జుట్టు అమధ్యరాలేదే! పెండ్లికి పూర్వంనుంచీ ఏర్పాటై వున్నవే కదా! అటువంటిస్థితిలో మధ్యలో వచ్చి మధ్యలోపోవు. భర్తను పురస్కరించికొని, పుట్టింది మొదలు ప్రాణమొక యెత్తుగా అతి శ్రద్ధతో అనేక దోహద ప్రక్రియలొనర్చి, 7 రోజు కొకతీరుగా తీర్చి దిద్దుకొని చక్కగా పెంచుకొనిన "శిరోజములను, నిర్దాక్షిణ్యముగా తీసివేయాలనడంలో న్యాయమేమైన ఉన్నదా?

భార్యతో ఇహలోకసౌఖ్యాలను అనుభవించే అదృష్టంలేక భర్త తన త్రోవను తాను పరమపదసోపానమును అలంకరించినపుడు భార్య గాజులు, జుట్టు ఎందుకు తీసివేయాలి? ఇది కేవలం స్త్రీలపాలిటి పెనుభూతముగ తోస్తున్న "అనాగరిక వ్యవస్థ," ఈ వ్యవస్థను ఎందుకు రద్దుచేయరాదు? దీనిని తొలగించితే వచ్చే నష్టమేమి? మొదలైన ప్రశ్నలు అనేకం బయలుదేరుతవి.

భర్త గతించినప్పుడు బొట్టు, జుట్టు, పసుపు కుంకుమ తొలగించడమనే పద్ధతి మన సమాజములో చిరకాలంనుంచీ అమలు జరుగుతున్నది.

స్త్రీలు: అలంకరణ

పురుషులకంటే స్త్రీలు అలంకరణకు విశేషప్రాముఖ్యం ఇస్తారన్నది నిర్వివాదము. పసితనంలో అలంకరించడానికీ వయస్సు వచ్చిన తరువాత అలంకరించడానికీ ఉద్దేశాలలో చాలా భేదమున్నది. తమ పిల్లలు అందముగా వుంటే చక్కని వరుడు లభిస్తాడనే అభిప్రాయంతో పెండ్లి అయే పర్యంతము "కుమార్తెల" అందచందముల విషయము మన తల్లిదండ్రులు శ్రద్ధవహిస్తుంటారు.

పెండ్లి అయిన పిమ్మట ప్రతి స్త్రీ తాను చక్కగా అలంకరించికొని సాక్షాత్తు రతీదేవివలె భర్తదృష్టిలో అందంగా వుండాలనే అభిలషిస్తుంది. దీని ఉద్దేశ్యం తన ప్రియవల్లభుడికి సంతోషాతిశయమును కలిగింపవలెనన్నదే కదా? ఏ భర్త సంతోష ఆనందాల కోసం వివిధ భూషణాలు ధరించిందో, అట్టి ప్రియతముడగు భర్తే గతించినప్పుడు "ఈ అలంకరణలవలన ప్రయోజనమేమున్నది? అలంకరించుకొని ఎవరిని సంతోషపెట్టవలసి వున్నది?" ఈ దృష్టితో చూస్తే భర్తగతించిన వెనుక అలంకరణ చిహ్నాలు స్త్రీకి అనవసరమనిపించక మానదు.

అంతేగాని "పాత ఒక రోత-కొత్త ఒక వింత"అన్నట్లు, ఎప్పటికప్పుడు-పాత మగనికి



టేబుల్ క్లాత్, రేడియో కవర్లపైకి డిజైన్:

—కరవది విజయలక్ష్మి, ఇంకొల్లు.]

తిలోదకము లిచ్చి, కొత్తవానికొఱకు దరఖాస్తు పెట్టుకొనెడి-వనితామణుల విషయము కాదు-అట్టివారికి-ఇటి సాంఘిక బంధములు-వ్యవస్థలు వర్తింపవు-వారిందుకు అతీతులు.

వుంటేనష్టమేమిటి!

భర్తృ వియోగము సంభవించిన పిమ్మట కూడా-స్త్రీలు-అలంకారములు ధరించుకొని అందంగా వుండకూడదా? అలావుంటే కలిగే నష్టమేమిటి?-ప్రపంచమున స్త్రీలకంటే రమ్యమగు వస్తువులు లేవని అఖిలార్థవేదియగు "భర్తృహరి" పేర్కొన్నాడు.

స్త్రీలు "రమ్యమైన వారలేగాక - రత్నములవంటివారుకూడ"-అందువలన "రత్నాల మీద కోరిక కలిగినట్లు," రమణీయమైన వస్తువులమీద కూడ కోరికకలుగుట సహజము. పరులకు అందకుండ రత్నాలను జాగ్రత్త చేసుకొనినటుల స్త్రీరత్నాలనుకూడా-రక్షించుకొనవలసి వున్నది.

మన దేశంలో పురుషులవలె స్త్రీలు ఆత్మసంరక్షణచేసికోలేరు. ఎవరైనా చేసికొనేవారున్నా అది ఎక్కడనో అరుదు.

పెండ్లి అనంతరం స్త్రీలు భర్త రక్షణక్రిందికి వస్తారు. భర్తృవియోగం సంభవిస్తే పుత్రులు రెండవ పక్షమున సోదరులు రక్షణ బాధ్యత వహించడం న్యాయం. వారెంత రక్షించినను భర్తవుండగా వున్న అగుండె నిబ్బరం, ఆత్మవిశ్వాసం భర్తపోయిన తర్వాత ఉండదనునది ముమ్మాటికి సత్యం.

ఎవరిసంసారాన్ని వారు దిద్దుకొనేవరకే ప్రజలు నానాఅవస్థలుపడి ఉక్కిరిబిక్కిరై పోతున్నారు.

పతిహీనలైనసోదరస్త్రీల బాధ్యతలుకూడా స్వీకరించి సక్రమంగా నిర్వహింపవలెనంటే అందరికీ సాధ్యపడదు. అపద్ధర్మంగా గత్యంతరము లేనందున సోదరులు మొదలైనవారు విగత భర్తృకల పోషణాది బాధ్యతలను స్వీకరిస్తారేగానీ, తమ భార్యాపుత్రాదుల సంరక్షణవలె—వీరి రక్షణ ముఖ్య కర్తవ్యం కాజాలదు. అందుచేత భర్త లేనప్పుడు, పోషణాది బాధ్యతలు ఎక్కడనో తప్ప ఎక్కువగా స్త్రీలే నెత్తినవేసికొనక తప్పదు. స్త్రీలు అబలలని అంగీకరించి నప్పుడు పరుల పాపిష్టిదృష్టి వారిమీద ప్రస

సనాతనాచారాలు

తీసుకుందనడంలో సందేహమున్నదా? భర్త సమక్షంలో—"స్త్రీ" వైపు దృష్టిని ప్రసరించాలంటే, అంత సులభంకాదు అదే గనుక—భర్తదగ్గర లేనప్పుడైతే—పర పురుషులు కొందరు పని గట్టుకొని "ఒకసారి" ఆ స్త్రీని వీక్షించిగాని అక్కడనుంచి ముందుకు వెళ్ళరు! భర్త ఉన్నపుడే—స్త్రీల స్థితి ఇలావుంటే భర్త పరిత్యక్త స్త్రీ అంటే లక్ష్యపెడతారా?

పంచేంద్రియాలలో నేత్రేంద్రియము (కన్ను) మిక్కిలి శక్తిగలది. దానిని నిగ్రహించడం బహుకష్టం. చంద్ర-చకోరాలకూ, మేఘ-మయూరములకూ ఎట్టి సన్నిహిత సంబంధమున్నదో-రమ్యవస్తువుకూ దృష్టికీ అట్టి సన్నిహిత సంబంధమే వుంది.

అన్ని విధములైన రక్షణ లున్నప్పుడే దుస్సంఘటనలు అనేకం జరుగుతున్నవి. "మానహానికి-ప్రాణహానికి గురియైనఅభాగ్య-వనితల" విషయాలు పత్రికలలో చూస్తూనే వున్నాము.

అందువలన స్త్రీలు, సహజంగానే సుందరలు; చీరలు, పూలు వివిధ ఆభరణాలు శిరోజములు-సౌందర్యమును పెంపొందజేయు సాధనములు.

అలంకార సామగ్రిని ఎంతవరకు తొలగించడానికి అవకాశమువుంటే అంతవరకూ తొలగించుకోవడం మంచిది ఆ దృష్టితోనే మన సమాజములో (తాత్కాలికముగా చూచుటకు-కొంత కష్టముగా నున్నను.) ఈ భూషణాదులు తొలగించడమనే విధానాన్ని ప్రవేశపెట్టివుంటారు.

"తలలు బోడులైన తలపులు బోడులా, అని వేమన యోగి అన్నాడు గదా అని అంటారా? తలలు మాత్రమే బోడులు చేసికొని-కోరికలు చంపుకోనక కపటనాటకమాడే వంచకులను—దృష్టిలో వుంచుకొని—"తలలు బోడులు మాత్రమే చాలదు; తలపులుగూడ—వశం పరచేసి కొనవలసినదని—హెచ్చరించినాడు వేమన, అంతే గాని వెంట్రుకలు తొలగించుకోవడం కూడదని చెప్పలేదు.

ఈవిధ ప్రభూషితలగా నొనర్చే విధానం మహమ్మదీయులలో గూడనున్నది. మట్టెలు, పూలు, తెల్లచీరెలు, గాజులు—వారి పరిభాషలో (ఛడా అని అంటారు) కాటుక, బంగారు సొమ్ములు తొలగించవలెనని వారి ఖురాన్ షరీఫు ఆచారకాండ చెప్పుతున్నది. క్రైస్తవులలోగూడ తమకిక కొత్త భర్త అక్కరలేదనే తలంచేస్త్రీలు పూలుధరింపరు; వివిధ ఆభరణము లుంచుకొనరు మట్టె గాజులు తీసివేస్తారు. ఈ వ్యవస్థవలనకొంత అవమానము జరుగుతున్నట్లు తోచినా అంతకంటే అధిక ప్రయోజనము-కలుగునని భావించే దీన్ని అనుసరించుకున్నారు. ఏ వ్యవస్థ అయినా సమాజానికి శ్రేయస్సుకలిగిస్తుందని అన్ని విధముల తోచినప్పుడు ఆ శ్రేయస్సు ఆశించినవారే దానిని ఆశ్రయిస్తారు. వ్యవస్థలో దోషం ఏదైనా ప్రవేశిస్తే దానిని తొలగించడం ముఖ్యకర్తవ్యము. వ్యవస్థలో గోచరించే దోషాలను దృష్టిలోనుంచికొని ఆ వ్యవస్థను, ఆవ్యవస్థ నెలకొనివున్న సమాజాన్ని ఆక్షేపించడంకూడదు. ఈ వ్యవస్థతో నిమిత్తంలేనివారు అనవసరంగా ఆక్షేపణకు-పూనుకొనవద్దని నా విజ్ఞప్తి. ★

మా ఇంట్లో పిల్లులు

సుభాష్ జె. రీటీగారు పిల్లులపై వ్రాసిన వ్యాసం చదివిన తరవాత నేనుకూడా మేము పెంచే పిల్లులగూర్చి వ్రాయాలనుకున్నాను. పిల్లి ఎంత తెలివైందో మా పిల్లుల గూర్చి చదువుతే బోధపడుతుంది.

మా ఇంట్లో రెండు పిల్లులు వుండేవి. రెండూ అన్నా, చెల్లెళ్ళు. అన్నపేరు పాండు. చెల్లిపేరు రంభ. మా ఇంటికి ఎవరైనాసరేవచ్చి మా పిల్లులని చూచి ఎంతో ముచ్చటపడేవారు. దానికి కారణం లేకపోలేదు. రెండు తెల్లగా, జాలుగా చూచే వారికి ముచ్చటగా వుండేవి.

పాండు అని ఎందుకు పేరుపెట్టేమంటే పుదయమంతా పందిరి మంచంమీద పడుకొనేది. రాత్రికాగానే తిండికొరకు కామోసు వెళ్ళిపోయేది. మధ్యాహ్నం భోజనవేళ కాగానే "పాండు బాబూ రారా, భోజనానికి" అని పిలిచేసరికి మంచదిగివచ్చి మా ఆయనపక్కన కూర్చుండేది. పాలు అన్నం తప్ప మరేమి తినేదికాదు. తిండికాగానే మళ్ళీ మంచ ఎక్కి పడుకొనేది.

రంభకు పదిసార్లు అయినా పిలుస్తేగాని భోజనానికి వచ్చేదికాదు. పేరుకుతగినట్లుగా ఎప్పుడు చూచినా తన శరీరంనాకుకుంటూ ఇంట్లో అటు ఇటూ విలాసంగా తిరుగుతునే వుండేది రెండూ చాలా మంచివి. పిల్లలు వాటితోక పట్టుకులాగి ఆడుకున్న ఏంచేసేవికావు.

ఒకసారి నేను పనుండి ఒకళ్ళింటికి వెళ్ళవలసివచ్చింది. ఇంటి కాపలాగా మా పని మనిషి లచ్చిని వుంచి వెళ్లేను. తిరిగి వచ్చేటప్పటికి లచ్చి చుట్టూ మాపిల్లి పాండు అరుస్తూ తిరుగుతుంది. నాకు బలే ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ కుంభకర్ణుడిలానిద్రపోయే పాండు లచ్చిచుట్టూ అరుస్తూ తిరగడమెందుకుచెప్మా అని దాన్ని అడిగేను. ఎందుకే అది నీచుట్టూ తిరుగుతుందిఅని. అది నాకు ఏంతెలీదండీ అమ్మగారు అని అంది. నేను పాండు నే అడిగేను. "ఏం పాండూ దీని చుట్టూ తిరుగుతున్నావు" అని. నాకు పిల్లులతో మాట్లాడటం అలవాటు. నే చెప్పేది తెలిసిందికాబోలు. అది లచ్చి కోకపట్టుకు లాగుతుంది నోటితో. నాకు అనుమానం వేసింది. "నిజం చెప్పు లచ్చీ. లేకపోతే పాండు నీకుడు పీకేస్తాడు" అని భయంపెట్టే సరికి మరేంలేదండీ అమ్మగారు బుద్ధి గడ్డి తింది. ఈసబ్బు తీసేను. అంతేనండీ క్షమించండీ అంటూ మొలలోవున్న సబ్బు తీసి ఇచ్చింది అంతే. మళ్లా తిరిగి మంచం ఎక్కిపోయింది పాండు. దాని తెలివిచూచి నాకు చాలా ఆనందం కలిగింది. ఆసంగతి మాఆయనతో చెప్పేను. ఆయనకూడా చాలా సరదాపడ్డారు ఇంతకీ చెప్పవచ్చింది ఏమిటంటే పిల్లుల్ని చూడరాదు అని చీదరించుకునేవారు చాలామంది వున్నారు. కాని పిల్లి ఎంత మంచిజంతువో పెంచేవారికి కాని బోధపడదు.

ఆర్. లక్ష్మీబాయి.
(నింపూరా, ఖర్గపూర్)



సినీతార జమున
—[టెక్ ఫోటో: గిరిధర్.]

వనితా వాణి



బూజుభావాలు

సోదరి ఎం. ఎ. కమలాదేవిగారు వ్రాసిన 'బంధుమర్యాద' అనే వ్యాసం చెప్పలేనంత బాగుంది. ఆ వ్యాసాన్ని నేను నాలుగయిదుసార్లు చదివాను. ఎన్నిసారు చదివినా విసుగనిపించదు నేటి కుటుంబాల్లో మామూలుగా జరిగే సంఘటనలను, రచయిత్రిగారు చాల హృద్యంగానూ సహజంగాను చిత్రించారు. బంధుమర్యాద యింకా మనవాళ్లలో చాలమందికి తెలీదు. మొన్నొకసారి నేను, మా స్నేహితురాలొకామెతో కలసి వాళ్ళ బంధువుల యింటికి వెళ్ళాను. వాళ్ళు బ్రాహ్మణులట. మొదట నేను రానన్నాను. మా ఫ్రెండు బలవంతంమీద వాళ్ళింటికి వెళ్ళక తప్పింది కాదు. ఆ యింటావిడ వేషమూ అదీ మాస్తే శాస్త్ర ఆచారంగల మనిషిలాగుంది. తీరా వెళ్ళాక నన్ను వాళ్ళకి పరిచయం చేశారు. సంభాషణ ఆరంభంలోనే ఆ విడ 'మీరే కులస్థులు?' అని నన్ను అడిగారు.... 'బ్రాహ్మణేతరులము' (వర్ణము పేరుకూడా చెప్పాను) అని జవాబిచ్చాను...మేము అక్కడ వున్నంతసేపు ఆ విడగారు నాతో ముభావంగా వున్నారు. ఆ యింట్లో మా ఫ్రెండుకి జరిగిన సత్కారానికీ, నాకు జరిగిన మర్యాదకీ చాల వ్యత్యాసం కనుపించి, నాకు తల తీసినంత పనయింది. మా స్నేహితురాలుకూడా నాకు జరిగినదానికి చాల బాధపడి నన్ను మరేమి అనుకోవద్దని చాల యిదిగా చెప్పారు. బంధుమర్యాద అనేది కేవలం బంధువులకి మాత్రమే సంబంధించినదిగా వుండరాదు. అతిథి సత్కారం కూడ యిందులోకి వస్తుంది. అవతలి వాళ్ల కుల మతాలనడిగి సత్కరించడం కేవలం మూర్ఖమే అవుతుంది......

కమలాదేవిగారు యికముందు ముందు యిటువంటి వ్యాసాల్ని వ్రాసి మన వాళ్ళలో కరుడుగట్టిన పాత సిద్ధాంతాల్ని తొలగిస్తారని ఆశిస్తున్నాను...వారికి నా అభినందనలు.

—దాక్షాయణి, (కదిరి, అనంతపురం జిల్లా]

* * *

ఆ జన్మాంతం...

నా భర్తగారు మరణించి ఒక సంవత్సరముపైగా కావస్తూంది. నాకు ముగ్గురు చిన్న పిల్లలు కలరు. ఈ మధ్యన, సినిమా చూస్తామని అల్లరి చేయగా విధిలేక తప్పనిసరి అయి కొద్దిరోజులు క్రిందట పిల్లలను తీసుకొని సాయంకాలం 6 గం|| ఆటకు వెళ్లితిని. తరువాత ఎన్ని విమర్శలకు గురి అయ్యానో ఆ పరమాత్మునికి తెలుసును. నేను మా ఇంట్లో కుర్చీలలో కూర్చొని పుస్తకములు చదువుకుంటానని, ప్రతిరోజు సినిమాలకు వెళ్ళుచున్నానని ఇలాంటి విషయములు యింకా ఎన్నో అన్నారు. అంటున్నారు. ఆమాటలు అనుటవలన వారికి కలిగినలాభము ఏమిటో తెలియదు. భర్త చిన్నవయస్సులో మరణించినందుకు ఆ జన్మాంతము ఇంట్లో ఏడుస్తూ యుండవలయునా? ఇటువంటి అపవాదులు వేసిన వారిని ఏమనవలెను? కమలగారు వ్రాసినటువంటి వ్యాసములు చూచిఅయినా యిటుపైన ఇటువంటి అపవాదులువేసి తోటిస్త్రీలను క్షోభపెట్టరని ఆశిస్తున్నాను. ఎంతో విపులముగావున్నది వున్నట్లు చిత్రిస్తూ వ్రాసినందుకు మజుందార్ కమలగార్కి నా హృదయపూర్వక నమస్కారములు (వనితావాణి)ద్వారా తెలియజేస్తూయున్నాను.

—ఒక "బాధిత" విశాఖపట్టణం]

* * *

సినీమాలో కూడా...

కె. శ్రీనివాసమ్మగారు "వాగుడు" అనే వ్యాసం బాగా వ్రాశారు. వీరు వ్రాసినట్లు అతిగా మాట్లాడేవారు ఒక్క రైలులో కాదు సినిమాలో కూడా కనబడుతూవుంటారు. మొన్నీమధ్య ఒక సినిమాకు పోయినాము. మా ప్రక్కన కూర్చున్నావిడ తన ప్రక్కగ కూర్చున్నామెతో ఒకేవిధంగా మాట్లాడటం మొదలుపెట్టింది. ఆ సినిమా ఆమె ముందొక సారి చూచిందట. అంజలీదేవి బాగా నటించిందని, పాటలు చాలా బాగుందని, కేలంగి బాగా నటించలేదని ఇంకా, ఇంకా ఇంటి విషయాలన్ని మాట్లాడటం మొదలు పెట్టింది. సినిమా మొదలుపెట్టి 5 నిమిషాలు అయ్యింది కాని ఈమె మాటలుకు మాత్రం

(49-వ పేజీచూడండి)


పెన్నూ, నల్లి......

21-5-58 వ తేది ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక 'వనితావాణి'లో కాజ వెంకటకమల (విజయవాడ)గారు 'పేనుకొరుకుడు' గురించి వైద్యం అడిగారు. అది చదివిన వెంటనే నాకో అనుభవం గుర్తొచ్చింది—

మేము ఆరుగురు ఆంధ్రులం బనారసులో ఎం. ఎస్ సి. జువాలజీ చదువుతున్నాం. నా స్నేహితునికి చెవివెనక రూపాయి బిళ్ళంతమేర జుట్టులేదు. 'పేను కొరికిం'దన్నాడు. అంతకుముందు మేము పేనుకోసం నలికోసం వేటాడుతున్నాం. మాకు అవి ప్రాక్టికల్స్‌కు అవసరం వచ్చాయి. కాని బనారసు హాస్టల్సులో ఎక్కడా కనుపించలేదు. ఎలా అయితేనేమి చివరకు, బహుకష్టంమీద ఓ డజను నల్లులు దొరికాయి. వెంటనే నా స్నేహితుడు ఓ అరడజను ఇవ్వమన్నాడు. ఎందుకు అన్నాను "పేనుకొరుకుడుకు నల్లేమందు" అన్నాడు. సరే ఇచ్చాను — ఫలితం ఎలావుంటుందో చూద్దాం అని బతికివున్న ఆ నల్ళ్ని మావాడు పేనుకొరికినచోట రుద్దేశాడు. ఓ పదిరోజులు పోయాక చూస్తే — పేనుకొరికిన గుర్తుగూడా లేకండా జుట్టు వచ్చినది! ఇలా ఇంకో అతనికి వైద్యం చేసిచూశాం.

పేను కొరుకుడుకు నల్లిమందు బాగా పనిచేసింది. కమలగారి స్నేహితురాలికిగూడా పని చేయొచ్చు. బతికున్న నల్లుల్ని పేను కొరికినచోట రుద్దితే పదిరోజుల్లో గుణం కనిపిస్తుంది!

—"కమల"—(నాగార్జునసాగర్ డామ్.)



32

లోకం చలికి ముసుగు వేసుకోవటం మొదలు పెట్టింది. ఇక్కడా అక్కడా కూలి చేసుకుంటూ ఒకపూటుంటే యింకోపూటకు లేనట్లు బ్రతుకుతున్న పుల్లయ్యకు పాత — మీటింగు స్నేహితుడు తారసిల్లి ఒకపూట వసేగానీ విలులేదని తీసుక వెళ్లాడు.

“నూడన్నా! ఈడికా ఒక్కకానీ లేదు ఒకరూపాయి విలవ ఆస్తిలేదు ఆపెద్దోడి లాగ ఓటకి ఖర్చు సెయ్యాలంటే యెలా గాతాది? మనలాంటోలకింద సేవ చేసన్నాడు. సమయం వచ్చింది. మనమంతా ఒకటై అబాబుకు నిలబెట్టాల!”

ఈ బోధనతో తన తిండికి లక్ష్యం చెయ్యకండా ఓట్లకోసంతిరిగాడు. రకరకాల మనుషుల్ని కలుసుకున్నాడు. వీరిలో సెల జీతాలు తెచ్చుకొనే వాళ్లున్నారు జీతం తెచ్చుకొని త్రాగేసి పెళ్లాం పిలలను కొట్టి తిండిలేక మాడ్చేవాళ్ళున్నారు. జీతం అంతా బ్రాకెట్లు ఆటలో పెట్టేవాళ్ళు కూడా వున్నారు. కరువుకల్పించినందుకూ, పేదోళ్లని పీల్చుతూ డబ్బు దోచుకుంటున్న వాళ్ళని యింకా పేల్చకండా వుంచినందుకు, వాళ్ళంతా ప్రభుత్వాన్ని దుయ్యబట్టసాగారు. ఎన్నోవందల దృష్టాంతాలు వాళ్ళకు యేమిచేసినా, న్యాయమేనని నిరూపించడానికి తెస్తున్నారు. ప్రభుత్వం పేదవాళ్లది కాదని పెటుబడిదార్లదని బంధుజన పక్షపాతంగల వాళ్ళంతా ప్రజల మంత్రులని నానా భాషల్లోనూ వీళ్లు యేక కంఠంతో అనగలుగుతున్నారు. పుల్లయ్య వీరితోపాటు చెయ్యెత్తి జై కొట్టున్నా మనసులో అదోలావుండేది. ఆమీటింగులో అదంతా వింటున్న కొద్ది “యిదంతా నిజమే గావాల లేకపోతే నాలాంటోడెందుకు బతక లేకపోతన్నాడు?” అని అనుకున్నాడు. మూడురోజులు మధ్యాహ్నం వెళ్ళాక తనంతట తనకే అమాటలు తిరిగి పోతున్నాయి నీలి విని “ఇందుకేనా యెళ్తున్నావంది?”

“నీకు తెలీదు నే—ఈతరంవాళ్లు లేసారు. సెదుగు మరి సాగదులే. అందరూ-మారాజు దగ్గరనుంచీ మాలోడు దాక ఒకటే—”

నీలి నవ్వి “అలాగని కేకలు యేస్తే వచ్చేస్తాదా?”

“రాక...ఈ బాబు గవుర్నమెంటోడై తేటా...దున్నేనోడిదె భూమి!— కూలోడికి రోజుకి మూడు రూపాయిలకి తక్కువ ఉండదు—అడుక్కునేవాడు ఆరురోజుల్లో మాయమైపోతాడు!”

“లేసినోడు యెప్పుడూ కబుర్లుసెప్పుడు?”

“అలాగ! ఉండుండు. పెద్దోల డబ్బు పేదోలకి పంచిపెటడా?”

“పెట్టే—అది ఖర్చు పెట్టేక, పేదోడు మలా పేదోడే—నూడు ఎందుకిలాగ కూలి నేకండా అందులో పడ్డావు? నీ యెదల్లా ఒకలాగ వున్నాయా? ఏయేలు లేకపోయినా కష్టమే. నలుగుర్ని మంచన్నాలుకని కోపి రెండు నాలుకలు సేసేక-జరగవలసినదాన్ని ఆపడానికి నివ్వెవడవు? నేనెవర్తిని? దాని కోసం నీలాగ ముక్కూ, సెవులూ వున్నోడ్ని యెందుకు సంపుతావు. పులిలాగ ఈయేళ యెదుటోడ్ని సంపితే రేపు నీ కడుపున పుట్టినోడ్ని సంపవా? నీరాగటా నాకేమీ నచ్చలేదు—”

నీలి మామ్మను తలుచుకుంది. ఆపదలోనూ ఆ ముదుసలి నూరిపోసినవే ఆమెకు జ్ఞాపకం వస్తుంది. పుల్లయ్య మాటాడలేదు. ఆరాత్రి చలివేస్తున్నా గడపల్లోనే పడుకున్నాడు. ఆ రాత్రిమీద కూడాను దూరంనుంచి ఓట్లుగురించి ప్రచారం వినిపిస్తోంది. ఎక్కడ చూసినా కోలాహలమే. మీటింగులే— ప్రజలు తండోపతండాలుగా వెళ్తున్నారు. ప్రజల్లో వుత్సాహం ద్విగుణీకృతంగా వుంది. ప్రతీ యింటిలోనూ యేరోజూ యేవో వాదనలే. పొరుగు జేబుకొట్టుకు పెళ్ళంకుకూడా వాదనే వచ్చింది.

ఇలా మారుమూలల్లో వుత్సాహం ఓట్లు వేసే తేదీ దగ్గరపడుతున్నకొలది హెచ్చవుతోంది. బూచోడు ఆరాత్రి చెట్టుక్రింద కూర్చొని కాస్సేపు కుక్కపిల్లగురించి పలవరించాడు. ఆమాటలు విన్న పుల్లయ్య మల్లు నిద్దరపోతున్నాడేమో మెల్లగా కాళ్ళవేపు వున్న కుక్కపిల్లనుయిచ్చి వేద్దామని లేచాడు. ఇంతలోబూచోడు యేదో గొణుక్కుంటున్నాడు. వాడినోటివెంటకూడా ఓట్లగొడవే!

“ఓట్లు—ఓట్లు—ఎంత తగలేస్తున్నారు.

ఇదంతా చూస్తుంటే డబ్బుతో సీటు కొనుక్కొని చేతులె త్తడమే డెమోక్రసీ అనిపిస్తోంది. డెమోక్రసీలో మంత్రివర్యుని దగ్గరనుంచీ బంట్రోతువరకూ సీట్ మెంట్లు యివ్వడానికే ప్రయత్నిస్తాడు. డెమోక్రసీ ప్రతిఫలం యెలక్షన్ గొడవల్లో పార్టీలుగా విడిపోయిన ప్రజలు అలావిడిపోయేవుండటం—ఇంతకీ ప్రభుత్వం అవు నన్నది ప్రతిపక్షం కాదనడమే డెమోక్రసీ నిజస్వరూపం!"

పుల్లయ్య లేచి దగ్గరగావెళ్ళి ఉపన్యాస ధోరణిలో నిల్చున్న బూచోడుతో "ఎవరితో చెపుతున్నావ" న్నాడు. బూచోడు పుల్లయ్య వేపు చూడకుండా "ఎవరితోనా? ఈ ఉన్న ఒకే చెట్టుతో—యీ రాళ్ళతో—ఇవి కూడా మరి నాలుగురో జులుపోతే—రాజకీయాల్లో పాల్గొంటాయ్! వాటికీ ప్రాణంవున్నదని చెప్పారుకదూ!

"ఆ మీటింగులో సెప్పకూడదా?"

"మీటింగు! హాఁ! పార్లమెంటు. ఇంగ్లండులో ప్రజాస్వామ్యం వున్నత స్థాయిలో వుందంటే పార్లమెంటు ప్రసంగాలవల్ల కాదు—" అని నవ్వాడు.

ఆనవ్వు కాస్సేపు పొడిగించి ఊర్కు న్నాడు. చలివేస్తోంది. అయినా బూచోడు నవ్వుతుంటుంటే పుల్లయ్యకు అక్కడ నుంచి కదలడానికి బుద్ధిపుట్టలేదు. ఎదురుగా వున్న వుప్పుటేరు కాలవనుంచి దుర్గంధం చాలా హెచ్చుగా వీస్తోంది. అలా అక్కడ వున్న కొద్దీ పుల్లయ్యలో లేనిపోని ఆశలు రేకెత్తుతున్నాయ్. బూచోడిని యీ చల్లని కాలాన మెల్లగా అడిగితే తప్పక బంగారం యెక్కడదాచాడో చెప్తాడు—"అది మెల్లగా త్రవ్వి నాను వదిరిపోయి పొలంకొనుక్కొని బరుకుతాను—యీడినీ తీసుకపోయి పెంచు తాను" అనుకున్నాడు. మళ్ళీ ఆక్షణంలోనే అలాంటి డబ్బు యెంతకాలం వుంటుందని పించింది. తినవూర్లో పెద్దరైతుకు డబ్బు యెలావచ్చింది? వాడయ్య రంగంవెళ్లాడు. ఇంటికోసం పునాదులు త్రవ్వుతుంటే పెట్టెలో బంగారం దొరికితేకదా పెద్దోడై పోయాడు. అలాగు తనెందుకు కాకూడదు? ఈ కష్టాలన్నీ పారిపోతాయి—మల్లుకి పెద్ద సదువు సదివించి పెద్దదొరనుసేనా?... ఇలా అనుకుంటగానే బూచోడు మళ్లీ మాటాడటం మొదలుపెట్టాడు...

"వాడు వూర్లో పెద్దమనిషి! ఆ పెద్దమనిషికి నాలుగుమూలల్లో నలుగురు వుంపుడు కత్తెలు! వాడు దేశసేవకుడు. చుట్టూవున్న అమాయక ప్రజ పాపం వాడిని మనిషిలాచూసి గౌరవిస్తారు. వాడి డబ్బు గౌరవాన్ని తెస్తోంది. దానధర్మాలు చేస్తున్నట్లు పెద్దదాతనని చెప్పించుకుంటుంటాడు. ఫలానావారి ధర్మమని అన్నిటిమీద స్టాంపు వేయించుకుంటాడు. వాడికి సంఘంలో గౌరవస్థానాన్ని యిచ్చే యీ అమాయక ప్రజల్ని చూస్తుంటే నాకు జాలివేస్తోంది. నీతికి ఒకవిషయంలో నిలబడనివాడు ఇంకే విషయంలోనూ దానికి నిల్చోలేడు. అలాంటి పెద్దమనిషికి తమ బాగోగులు చూడమనిచెప్పే ప్రజాసౌఖ్యం ఎలావస్తుంది? వాడికి తెలిసింది యెలా వేషంవేసి ప్రజల్ని మోసగించడమూ అనే ఈ చదువుకున్న మూర్ఖులకన్నా ఆ అమాయక ప్రజల్లో సంస్కారం వుంది. అలాగని వాడ్ని చంపమని చెప్పడంలేదు. రక్తదాహం గలవాడు మనిషి అనిపించుకోడు—పశువు—పశువుకు మానవసంఘంలో చోటులేదు. అయితే ఇలాంటివాళ్ళందరినీ యేం చెయ్యాలి? గుండెనుంచి వచ్చే మర్యాద ఈయటం మానండి నాయనలారా మానండి. ఒకచీమ నిజానికి పాటుపడితే దాన్ని సింహాసనంమీద యెక్కించండి. నిజమే మనుష్యుల్ని పెంచేది రక్షించేది! నిజమే శాశ్వతంగా నిలిచేది—నిజంతో నిర్మింపబడ్డ ప్రభుత్వం—దాన్ని 'ఏమైనా అనండి, అదే కలకాలంనిలుస్తుంది! నిజంకు కట్టుబడని నాయకులు గొప్ప నాయకులని ఆత్మవంచన చేసుకోనీయండి. వాళ్ళ జీవితంలో ఎప్పుడో ఒక్క నిముష మైనా పశ్చాత్తాపపడకపోతే వాళ్ళు నాయకులే కాదు—మనుషులే కారు—అటువంటి పశువులకి అలాంటి అంత్యమే వస్తుంది! ఎంచేతంటే సత్యమే దేముడు! దైవత్వం యేదో పాలులో లేకండా మానవమాత్రుడు యే ఘనకార్యం చెయ్యలేడు."

బూచోడు కాస్సేపు తనలో తనే నవ్వు కున్నాడు. చలికాస్తా వణికిస్తోంది—మంచు పడుతోంది. పుల్లయ్యకు నిముష నిముషానికి

★ దగాపడిన తమ్ముడు ★

అత్యంత హెచ్చవుతోంది. కొంతసేపటి వరకూ నిశ్శబ్దంగా వుంది...ఆ ప్రశాంతతలో మెల్లగా:

"బంగారం ఎక్కడ పాతావు?" పుల్లయ్య ప్రశ్నించాడు.

"ఎక్కడా?"

"పాతావుకదూ?"

"అవును..."

"ఎక్కడా?"

"కొబ్బరి చెట్టుకింద......"

"ఇంటి వెనకా?..."

"అవును......"

"కొబ్బరి చెట్టుకి యెటు వేపు?"

"ముందే"

"ఎన్ని తులాలు......నీదేనా?"

బూచోడు ఘుర్రుమన్నాడు "దానిదీ! నన్ను ఖూనీచేసింది దానిదీ! నీ కొండుకూ ఫోఫో" అని అరిచాడు. ఇంకే ప్రశ్న వేసినా జవాబు చెప్పలేదు. లేచి పోయాడు.

"ఏమిలోకం-ఏమిలోకం - అంతామాయ! ఆడదిమాయ - మొగోడు మోసం! అంతా దొంగలు!-నా కుక్కనీ నాకు లేకుండా చేసారు..."

పుల్లయ్యకు కనికరం వేసి గబగబ గడప లోనికి వెళ్ళి కుక్కపిల్లను తీసుకవచ్చాడు. "ఇదిగో నీ కుక్కపిల్ల! మళ్ళా యిక్కడికి వచ్చావంటే పోతాది...ఎల్లిపో..."

బూచోడు ఒక్క గంతు వేసాడు: వచ్చావురా నాయనా-నాబాబూ - నీతో చెప్పకోడానికి యెంత దాచుకున్నాను-" అంటూ ముద్దుపెట్టుకొని వెళిపోతుంటే అది చిన్న మొరుగు మొరిగింది.

"నీ మాట నాకు తెలీదా? ఏడవకు ఏడవకు బాబూ కలుసుకున్నాం కదూ!" అని దాన్ని యెత్తుకొని వెళ్ళిపోయాడు.

ఆ మరుపటిరోజు వుదయం పనికొస్తారా అని ఒకడు యింటివేపే వచ్చాడు. పుల్లయ్యకు యెంతో ఆశ్చర్యం వేసింది-ఇలా యింటికి వచ్చే పరిస్థితి వచ్చింది కదా లోకం యింతగా మారిపోయిందా అని సంతోషపడ్డాడు.

"ఏం పని?" అన్నాడు.

"రోజుకు రెండు రూపాయిలు. రాల్లెత్తిమనం రప్పలెత్తిమనం-వస్తావా? ఇదిగో రెండురూపాయలు!"

పుల్లయ్య అందుకొని సీలిచేతిలో పెట్టి వాడివెంట పడ్డాడు. మల్లు తండ్రిని అనుసరించాడు. ఒక అరమైలు దూరం నడిచాడు పెద్దమేడ. ఆ మేడ యెదరగా యెంతో మంది నిల్చున్నారు. అంతా తనలాంటివాళ్లే వాళ్ళలో వాళ్ళు యేదో గుసగుసలాడుకుంటున్నారు. ఓట్లగొడవే!

ఇంతలో పిలుపువచ్చింది. అంతా లోపలికి వెళ్ళారు. కుర్చీమీద యెదురుగా పెద్ద మీసాలతో ఒక మనిషి కూర్చున్నాడు వయస్సు యేభయ్యోపడి వుంటుంది. చేతికి నాలుగువుంగరా లున్నాయ్. ముఖం రీవితో చామనచాయగా వుంది. మామూలుగా పంచ, సిల్కుకమీజు వేసి వున్నాడు. చేతికి కప్పలాంటి వాచీ వుంది.

"వినండి బాగా వినండి." నిశ్శబ్దంగా చేతులు కట్టుకొని నిల్చున్న ఆయాభైమంది ఒక్కసారి వణికేట్లు ఆ మాటలు ధాటిగా వచ్చాయి:

"నేను చెప్పినమాటల్లో ఒకమాటా మర్చిపోకూడదు. చెప్పినపని చేసుకొచ్చిన వాళ్ళకి రేపు మూడు రూపాయలు!"

"సిత్తం...సిత్తం!"

అయ్యకే కుర్చీమీద నుంచి లేచి నిల్చుని ఉపన్యాస ధోరణిలో......

"సదువుకున్నోళ్ళ దగరకి మీరెళ్ళకండి- మనదేశంలోని సదుకున్నోలకంటే సాకలోడు నయం. ఆ సదువుకున్నాడన్నోడికి సగం గేనం. అంచేత మీరంతా యీ మహా పట్నంలోన పేదోడింటికే యెళ్ళండి. ఆడికపాలు మీకు తెలుసు, నాకు తెలుసు... యిన్నారా?"

"సిత్తం...సిత్తం!"

"నేను యిక్కడ యెలాగ మాటాడానో మీరూ అలాగే మాటాడాల! నాకు యింగ్లీషు రాదని తెలుగురాదా? నేను మీ దగర యెలాగ మాట్లాడుతున్నానో ఆ యెసెంబీలోనూ నాబాసలోనే మాట్లాడుతాను. ఇంగ్లీషుకనే వున్నాది లేకపోతే లేదా? నా సుట్టూవున్నవాళ్ళకి యింగ్లీషు రాదే! నాలాగే వాళ్ళూ పంచెకట్టి కమీజు వేసుకుంటున్నారు. అంచేత నాను వాళ్ళందరికంటే నయమే!"

"సితం...సిత్తం"

కాస్తా మీసం మెలివేసి ఇటూ అటూ పచారు చేస్తూ: "ఈగవుర్నమెంటోడి రాగటాయేమీబాగు లేదు. చూసారా! దొంగసారా బట్టీలు ఎలాగ లెగిచిపోతున్నాయో! ఎంతమంచి ఆఫీసరైనా యెండి చెప్పతో కొట్టే లొంగిపోతన్నాడు, వేలుచేసుకొన్న వాడిమీద పన్ను లేదు. నేను అసెంబ్లీకి వెళ్ళి యిదేవాదిస్తాను. గవుర్నమెంటోడినే బట్టీలు పెట్టి పులిసిన సద్దిఅన్నంలాంటి సారా నివ్వే యియ్యి. నా ప్రజా బాగుపడారు. ఆ డబ్బుపెట్టి యీ మురికిగుంటలు బాగుచెయ్యమంటాను. ఇది చెప్పడానికి ఇంగ్లీషురావాలా? మా అయ్యకి తాతకి యేం యింగ్లీషు వచ్చేది! గ్రామసావిడిలో పంచాయితీతీర్పు చెప్పినాడంటే లండను వెళ్ళినా తిరుగుండేదికాదు. ఇవన్నీ బాగా విన్నారా! చెప్పండి—గట్టిగాచెప్పండి—అరవండి గటిగా అరవండి! మీ ఓటు!"

ఎవరూ గొంతుక పెగిలించలేదు "అరవండిరా! బంగారయ్యకే" అని.

"మీ ఓటు!"

"బంగారయ్యకే!" అన్ని గొంతుకలు కలిపాయి. పుల్లయ్య విధిలేక అన్నట్లు అన్నాడు. కానీ ఈ బాబు చెప్పిన దాంటోనూ యేదోనిజం వుందనిపించింది. ఇంతకీ కూలి పుచ్చుకున్నాడు. తిరగడానికి బయలుదేరారు.

చలిహెచ్చుతున్నకొద్దీ ఓట్లుగొడవ హెచ్చవుతోంది. ఎక్కడా యీ గోలాహలమే ఈ సీటుకి మూడుపార్టీలవాళ్ళూ, ఒక స్వతంత్రుడు పోటీచేస్తున్నారు స్వతంత్రుడు బంగారయ్య. పెద్దలు గడించిన ఆస్తి తగలెయ్యకండా యేవో కంట్రాకులుచేసి పెంచుతున్నాడు. యుద్ధకాలంలో కంట్రాకులుచేసి బాగా ఆర్జించాడు. ఈ మధ్యనే పధ్నాలుగువేలిచ్చి కారు కొన్నాడు. ఈ యెలక్షన్లలో ఒక అరలకారమైనా ఖర్చుపెట్టి తనజాతిలో గౌరవం కీర్తి తెచ్చుకుందామనే వుబలాటంతో రాత్రిపగలూ నిద్రలేకండావుంది. "నేను మెంబరైతే కల్లూ సారా మంచిది మొదటిలాగ రప్పించనా? యేవూరురాబడి ఆ వూరులోనే ఖర్చులు పెడతాను. కరువూ కాటకాలు నాలుగునెల్లలో లేకండా చేస్తా"నని "ఆ చుట్టుపట్లవున్న పల్లెలో ప్రచారం సాగిస్తున్నాడు. ఎంతస్వేచ్ఛ అనుకున్నా యీ చుట్టుపట్ల పల్లెల్లో ఓట్లు సాదారణంగా ఆవూరు పెద్దలచేతిలో వుంటాయని వాని నమ్మకం. వాళ్లను పట్టుకొని మూతికట్టిస్తే చాలు. కావలసినప్రచారం వాళ్ళే చేసుకుంటారు. బంగారయ్య అపనేచేసాడు. ఆ అమాయక పల్లెజనంలో మూడువంతుల ఓటర్లు తనవేపే ఓటువేస్తారు - తప్పదని అనుకున్నాడు.

ఇలావుండగా బంగారయ్యమీద యెదుటి పార్టీవాళ్లు మంచి మంచి పుకార్లు వ్యాపింపజేసున్నారు. మధ్యతరగతి ప్రజలో వాడంటే హేళనగావుంది. పై అంతస్తులో వాడి కొందుకని పకపక నవ్వుతున్నారు. ఉన్నది యెలాగ ఖర్చు అవుతుందని అంతా అనుకుంటున్నారు. బంగారయ్యమీద పుట్టిన పుకారులో మచ్చుకి కొన్ని కారు కొన్నాడుకదూ—వెనకసీట్లో ఒక్కడే కూర్చున్నాడు డ్రైవరు నడుపుతుంటేగా ఓ దగ్గర బర్ అని శబ్దం వచ్చిందట! వెనుకసీట్లోనుంచి "అదేంటి! అదేంటి!" అన్నాడట. "గేరేసానుబాబూ" అంటే బంగారయ్య

వెంటనే "యిక్కడెందుకేసావ్? ఇంటి దగ్గరకేసీకెళ్ళ పోయావా?" అని డ్రైవర్ని మందలించాడట! ఒకసారి డ్రైవరు వడి రోడ్డుమీద కారు ఆపితే యెందు కాపినావంటే పెద్దరాయి అడ్డుందిబాబూ అన్నాడట! పోనుకొట్టు అదే తప్పుకుంటాడని బంగారయ్య అన్నాడట! పట్నంలో ఒక ముఠుకుపేటకు వెళ్లి వారందరితో యేం చెప్పాడట అంటే తను అసెంబ్లీ మెంబరైతే కొళాయిలనుంచి సారా తెప్పించనా అనీ అంతేకే అక్కడ తనకు మాటాడటం రాక పోతే పెద్ద ప్లీడర్ని డబ్బు ఖర్చుపెట్టి అక్కడ వాదించడానికి పెట్టనా అనీ అన్నాడట!

ఇలాంటి కటుకథలు యెదుట పార్టీల వాళ్లు ప్రచారం చేస్తున్నారు. బంగారయ్య తొణకలేదు; బెణకలేదు. "నాకు పేదోళ్ళ బలంవుంది; నేను రాకపోతే యెవడొస్తాడో చూస్తా!" నని ప్రగల్భాలు పలుకుతున్నాడు—డబ్బు విరజిమ్ముతున్నాడు. ఆ వేళ సాయంత్రం తిరిగివచ్చిన వాళ్లకి కడుపునిండా తిండి పెట్టించాడు.

"తినండ్రా! మీ కష్టాలు నాకు తెలుసు!"

వాళ్లు భోజనాలయ్యాక "మీరు వెళ్లడానికి వీల్లేదు. ఈ రాత్రి ఆ కాంగ్రెసోడు పెద్దదండుని వూరిలో తిరగడానికి పంపిస్తున్నాడు. మనము వెళ్లాల. వాళ్ల గొంతుకులన్నీ మన గొంతుకల్లో కలిసిపోవాల—బాగా పని చేసుకొచ్చారంటే మనిషికి రెండేసి రూపాయలు!"

ఈ మాటలు విని అంతా సరే అన్నారు. పుల్లయ్యకు కడుపునిండా తిండి యెన్నాళ్లకి దొరికింది! "ఈ బాబు కష్టాలు తెలిసిన బాబులాగ వున్నాడు. ఇలాంటి బాబు గవుర్నమెంటోడైతే కష్టాలు పోతాయేమో! అల్లా బాబు కింద నాలుగురోజులు కూలీలేకండా తిరిగినాను. యిక్కడు గంజైనా పోసాడు కాదు!" అనుకొన్నాడు.


ఈ రాత్రి పెద్దదండు పెట్రోమేక్సు లైటులుపెట్టి బాకాబజంత్రీలతో బయలుదేరారు. కేకలు మిన్నుముట్టి పోతున్నాయి. త్రోవలో ఇంకో పార్టీ జండాలతో యెదురైంది. ఆ మధ్య నాలుగురోజులూ ఆ పార్టీతో తిరిగాడు. వాళ్లంతా తనవేపే చూస్తున్నట్లనిపించింది, పుల్లయ్యకు! తన స్నేహితుడు, పొరుగుజేబుదొంగ వాళ్ళంతా అందులో వున్నారు. సిగు వేసింది మొదట. కానీ తరువాత నా కడుపుకన్నా నా అనుకున్నాడు. రేపు పొద్దున్న నాను అకలితో అలమిటిస్తే వీళ్ళొక పైసాయైనాయిస్తారా అని అనుకుని ధైర్యంగానే అడుగులు వేస్తున్నాడు. ఇంకో వేపునుంచి మరో కదండు—ముందుకొడికట్టినయెడ్లు! ఆ చుట్టుపట్ల కోలాహలం మిన్నుముట్తోంది. అన్ని గొంతుకలూ కలిసినా లౌడుస్పీకర్లు ఆ గొంతుల్ని మింగేస్తున్నాయ్. రానురాను ఒక గుంపుమీద ఇంకోగుంపు మాటలు విసురుకొంటున్నారు— రౌద్రం హెచ్చిపోతోంది! అందులో ఆ రౌద్రాన్ని తగ్గించడానికి ప్రయత్నం చేసేవ్యాదయులు వున్నారు. కాని నిముష నిముషానికీ స్థాయి హెచ్చిపోతోంది—మాటలు పోయి చేతలకి వచ్చాయి. రోడ్డువేయటానికి వున్న కంకర రాళ్ళ కుప్పలు మీదికి చేతులు వెళ్లాయి... పుల్లయ్యవేపు రాళ్లువచ్చి పడ్డాయి...పుల్లయ్యకూడా పౌరుషంకొద్దీరాళ్ళుపట్టుకున్నాడు. విసురుదామనుకుంటే యేదో చెయ్యి తనచేతిని పట్టుకున్నట్లనిపించింది. పెళ్ళంతలపు రావటంవలన కామోసురాళ్ళు క్రిందపడేసాడు.

ఇంతలో యెవరో పోలీసులు వస్తున్నారని కేకలో వేసాడు...కొందరు పారిపోయారు. ఒకపార్టీ ఒక వేపు వెళిపోయింది. ఇంకో పార్టీ యింకో వేపు...బంగారయ్య పార్టీముందుకు సాగిపోయింది. ...సాగిపోతున్న కేకలు దూషణలతో సహా మిన్నుముట్తున్నాయ్....


ఆ దగరలోనే బూచోడు కళ్ళు విప్పిఅంతా చూస్తున్నాడు. బూచోడు కుక్కపిలతో ఆ రోడు ప్రక్కన కూర్చుండిపోయాడు. కొద్దిక్షణాలు పకపకానవ్వుతున్నాడు. తరవాత బుజ్జగించి చెప్పే ధోరణిలో: "చూసావా నాయనా ఈ వెర్రి తమ్ముళ్లు యెలా కొట్లాడుకుంటున్నారో? దేనికి—ప్రజల్ని సుఖపెట్టే ప్రభుత్వం కోసం? ఒకరి నొకరు మర్యాద యిచ్చిపుచ్చుకోలేక పోతున్నారు. అన్యాయ చెదపురుగై మనుషుల్లో మానవత్వాన్ని పిప్పి చేస్తుంది—అలాంటి మనుషులున్న దేశం వేగం పతనం కాదా?"

ఆ ప్రశ్న వేసి లేచి నిల్చున్నాడు...

"బాబూ! నేనెందుకు పతనం అయిపోయానంటావ్? యెదుటివాళ్లి చెడుగులో
(49-వ పేజీ చూడండి)



—చిత్రకారుడు: ఏ. సూర్యారావు.



పాకలోని బుల్లితువ్వాయ్
  ఆకలేసి 'అంభా' యనుచు
ఆర్వగాని చంటిగున్న
అలకించి పరుగున జనె.

లేగదూడ మూగసంజ్ఞ
  లేమి అర్థమయ్యెనో మరి
లేతహృదయ మాగలేక
చేత నూడదీసె పలుపు.

ఒక్క గంతులోన తల్లి
  ప్రక్కజేరి లేగదూడ
పొదుగులోన ముట్టెదూర్చి
ముదమున పాల్ద్రాగుచుండ.

చిన్నవాని చిన్నమనసు
  చిందులు ద్రొక్కుచు గనెనా
బుల్లిదూడ తల్లియందు
వెల్లివిరియు మాతృప్రేమ.

బిడ్డయెడల తల్లిజూపు
  దొడ్డప్రేమ యన్ననేమొ
అర్థమయ్యె ననగ నంత
పాబ్ధి నోలలాడె మనసు.

★

కడుపునిండ పాల్ద్రాగి
  గంతు లిడుచునున్న దాని
వంకజూచుచుండి వాడు
చంక లెగురవేయుచుండ.

అంతలోన నాన్న వచ్చి
  గంతుచున్న దూడనుమరి
చెంతనున్న తనయుని గని
అంతులేని ఆగ్రహముతో.

"హోరిభడవ! దూడపాల
  నారగించుచుండ నీవు
ఏమి జేయుచుంటివ"నగ
నీ విధమ్ము పలికె వాడు:

"బుల్లితువ్వాయ్ ఆకలితో
  అల్లలాడిపోవుచుండ
ఉండక లేనేనె పలుపు
ఊడదీసినాను నాన్న!

"ఓరి వెధవ! నిన్నెవ్వడు
  ఊడదీయమన్నా" డని
లెంపకాయ వేసె లేత
చెంప కందిపోవ తండ్రి.

దెబ్బతిన్న చంటిగున్న
  తబ్బిబ్బయి తాళలేక
వెక్కివెక్కి యేడ్చుచు నిటు
మూల్గి మూల్గి చెప్పినాడు:
"ఆకలైన వారి కెపుడు
  హార మొసగు టెంతయైన
పుణ్యమనుచు చెప్పినారు
పూజ్యులు మా మాష్టారు."
వాని పల్కు లాలకించ
  గాని తండ్రిమనసు కరగి
పిల్లవాని చెంప నిమిరె
బుల్లితువ్వాయ్ గంతు లలరె!

★

కొత్తపల్లి సూర్యనారాయణమూర్తి



పూర్వం ఒకప్పుడు తంజావూరు రాజ్యాన్ని రఘునాథరాయలు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయనకు సంగీతం అంటే మహా ప్రీతి. అందుచేత ఎక్కడెక్కడి సంగీత విద్వాంసులను రప్పించి, గానసభలు చేయించి, గొప్పగొప్ప బహుమానాలతో సత్కరించటమే గాక, వాళ్లందరితోనూ "మీరు నా ఆస్థానవిద్వాంసులుగా ఉండిపొండి. మడులు, మాన్యాలు, అగ్రహారాలు ఇస్తాను" అని చెప్పేవాడు. అలానే వారు అక్కడే ఆస్థాన విద్వాంసులుగా స్థిరపడిపోతూవచ్చారు.

ఆస్థానంలోని అందరూ గొప్ప విద్వాంసులే అయినా అందరిలోకీ మొదట చెప్పవలసిన గాయకురాలు కామాక్షి. కామాక్షికంఠం ఎత్తితే, ఏడిచే పిల్లలు ఊరుకుంటూరు. మేసే పశువులు మేత మానేసి నిలబడిపోతై. పుట్టల్లో ఉన్న పాములు చక్కా వచ్చి పడగలెత్తి నాట్యం చేస్తయి. కామాక్షి పాట అంత గొప్ప పాట! అటువంటి విద్వాంసురాలు తన ఆస్థానంలో ఉండడం రఘునాథరాయలకు చాలా గర్వంగా ఉండేది. ఆయన ఆమెకు 'వసంతకోకిల' అనీ, 'మధురవాణి' అనీ బిరుదు లెన్నో యిచ్చాడు. కానుకలకు,మాన్యాలకు లెక్కే లేదు.

కామాక్షి గొప్ప గాయకురాలే గాని అందగత్తె మాత్రం గాదు. అందం లేకపోవటమేగాదు; కురూపే అని చెప్పాలి. ఐతేనేం ఆవిడసంగీతం వినటాని కొచ్చినవాళ్ళు గాన మాధుర్యంలో పరవశులైపోవటమే కాని ఆవిడ అందం ఊసువాళ్ళ కెందుకు?

ఇలా వుండగా ఒకసారి రాయల వారి మిత్రుడైన హైదరాబాదు నవాబు సపరివారంగా చూడ వస్తున్నట్లు కబురువచ్చింది. రాయల వారు బ్రహ్మానందభరితులై పోయారు. అపూపములైన వినోదాలూ అవీ జరిపించటానికి ఏర్పాట్లుచేశారు. నగరము, రాజసభ అద్భుతంగా అలంకరింపబడినై. నవాబు నగరంముంగిలికి వేంచేయ

పాటల్లో [illegible]

టంతోనే రాయలవారు సపరివారంగా ఎదురువెళ్లి స్వాగతం ఇచ్చి తీసుకువచ్చారు.

ఈ సందర్భంలో జరిగిన పాట కచ్చేరిలో కామాక్షి మహాజోరుగా పాడేసింది. 'అచ్ఛా! అచ్ఛా' అంటూ నవాబు మరీ మెచ్చుకొని స్వయంగా లేచివెళ్లి తన మెడలోని ముత్యాలహారాన్ని తీసి కామాక్షికి బహుమతి చేశాడు. నవాబుగారికి ఎడంకాలు కొంచెంసొట్టకాలవటంచే ఆయన సభలో కుంటుతో నడవ వలసివచ్చింది. అది గమనించిన సభ్యు లంతా 'ఇంత గొప్ప నవాబుకి ఈ కాలి కుంటియేమిటో పాపం!' అని లోలోన సానుభూతి కనపరిచారు. ఐతేనేం ఆసానుభూతి అంతా మరుక్షణంలోనే మాయిపోయింది. "తప్పంతా నవాబుదే! ఆ ముత్యాలహారం కామాక్షికి ఇచ్చినవాడు చక్కావస్తే తీరిపోయేది. అలా గాక ఏదో తెలివిగా మాట్లాడాలనుకొని కామాక్షిని అవమానం చేశాడు!" అన్నారు. ఆమె అందమైనదిగాదని అందరికి తెలిసినదే. నవాబు ఆమె దగ్గరగా వెళ్ళేటప్పటికి కామాక్షి కురూపి తనం స్పష్టంగా కనబడింది. నవాబు నవ్వుతూ! 'కామాచ్చీ, మీా సరస్వతి కానాగుడ్డిదకేం!" అని ఛలోక్తి విసిరాడు!

"ఏం ప్రభూ, సరస్వతీ దేవి గుడ్డిదని సెలవిస్తున్నారే?" అని కామాక్షి అడిగింది.

అందుకు నవాబు: "హేమియా? యెంతా గుడ్డిది ఖాఖాపోతే, నీవంటి ఖురూపినీ యెట్లా ఆశ్రయిస్తాదకే? నీమొఖం చూస్తే డోఖా వస్తాదీ కాదూ? హాట్వాంటీ మొఖం నీది! ఐనా, సరస్వాతీ నీసేతా బలేబాగా పాడిస్తాదీలే" అన్నాడు.

కామాక్షికి నవాబుగారి హాస్యం అర్థమైంది. "విద్యల సరస్వతి ఉత్త అంధురాలు గనుకనే, నీవు ఇంత కురూపి వని తెలుసుకోలేక నిన్ను ఆశ్రయించి, నీచేత ఇంత గొప్పగా పాడిస్తోంది"! అని ఆయన ఉద్దేశ్యం. ఆ మాటల్లో "కామాక్షీ, నువ్వు చాలా బాగా పాడగలవు!" అన్న మెప్పు ఉంది, "నువ్వు కురూపివి సుమా!" అన్న దెప్పుఉంది. మెచ్చుకుంటే సంతోషిస్తారు గాని ఎవరైనా టొంపుపొడిచి మాట్లాడితే ఊరుకొంటారూ? తమ అభిమాన గాయనికి అలా అవమానం చేశారు నవాబుగా రని సభలో అందరికీ కోపం వచ్చింది. వచ్చిందే కాని ఏంచెయ్యగలరు? మరొకడూ,మరొకడూనా?

కామాక్షి

హైద్రాబాదు నవాబాయన! కోట్లకొలది కాసులు ఖజానాలో మూలుగుతున్న ప్రభువు! అంచేత కోపం అంతా దిగమింగుకున్నారు ఎవళ్లమటుకి వాళ్ళు.

కాని కామాక్షిమాత్రం ఊరుకోలేదు; కుక్కకాటుకి చెప్పుదెబ్బలాగ నవాబుకు సమాధానం చెప్పింది. అందమంటే లేదుగాని, గడుసుదనానికీ, తెలివితేటలకూ ఏమంత తక్కువ కామాక్షి?

"ప్రభూ, ఒక్క సరస్వతీదేవి మాత్రమే గ్రుడ్డి[illegible]దు; లక్ష్మీదేవి కూడా గ్రుడ్డిదే!" అన్నది.

"హేంమ్టి? లచ్మీదేవి ఖూడా గుడ్డిదే?" అని ఉగ్రుడైనాడు నవాబు.

"చిత్తం ప్రభూ! కాకపోతే, తమ వంటి కుంటివారిని ఆశ్రయించి ఇంతటి గొప్ప ఐశ్వర్యం ఇవ్వడమేమిటి? గుడ్డిది కనుకనే ప్రభువుల కుంటికాలు ఆమె గమనించలేకపోయింది!" అన్నది నిర్భయంగా.

ఈ ఎత్తిపొడుపుకి నవాబుకి ఎక్కడలేని రోషం వచ్చింది. ఐతేం? తప్పంతా తనదే గనుక నోరెత్తలేక పోయాడు. ★

★ సంఘజీవి ★

(23-వ పేజీ చూడండి)

ఏవైనా పుస్తకాలు చదువుకుంటాను. లేదా లేసులుఅల్లుకుంటాను. అదికాదంటే కాసేపు నిద్రపోతాను. మీ రు అయిదుగంటలకల్లా యింటికొచ్చేస్తారు. కాఫీ తీసుకున్నతర్వాత మనం ఊరిబయటగా షికారెళ్తాము. రాత్రి భోజనమైన తర్వాత, వెన్నెల రాత్రయితే హాయిగా ఆకాశంలోకి చూస్తూ కూర్చోడానికి, ఎలాగూ డాబా వుండనే వున్నది. ఈ యింట్లో మనం తిన్నా, తినకపోయినా అడిగేవాళ్ళు లేరు..."

"నీకూ నీవారు లేరు, నాకూ నావారు లేరు...ఛల్ మోహనరంగ! అని పాటను సవరించుకోడం లెస్స" అన్నాడు కమలాకరం నవ్వుతూ.

పద్మావతి వరండాలో నిలబడి ఆ వీధివైపు చూచింది. ఇది నాళంవారి వీధిలా లేదు. ఇండ్లు అక్కడొకటీ, యిక్కడొకటీ చెల్లాచెదరుగా వున్నాయి. కానీ ఈ ఎదురింటో ఒక సుందరమ్మక్క, ప్రక్కయింట్లో ఒక పార్వతమ్మ పిన్ని, ఆ పెంకుటింట్లో ఒక సుహాసిని వుండరనుకోడానికి వీల్లేదు. ఈ అమ్మలక్కలు మొదట మొదట ఎంతో ఆప్యాయతగా స్నేహానికి రాదీస్తారు. ముక్కనొచ్చినా ముఖం వాచినా పరామర్శల వర్షం కురిపించి, ఆత్మీయతను ఒలకబోస్తారు. దినాలు గడిచినకొద్దీ వీళ్ళ అసలు బండారం బయటపడుతుంది. బాబూ! వీళ్లకొక నమస్కారం. ఇందాకా జరిగిన శాస్తి చాలు!

"ఏమిటి పద్మా! చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నావు?" అన్నాడు కమలాకరం.

"అఖ్ఖే ఏముంది? వీళ్ళకందరికీ మనం బోనులో పడనున్న కొత్త జంతువులకు మల్లే కనిపిస్తున్నామేమో! అప్పుడే కిటికీలు తెరచుకుని మనల్ని చూడ్డానికి సిద్ధమయ్యారు. అమ్మో! వీళ్ళ ఆటలు నాదగ్గరేం సాగవు! మీరు లోపలికి వచ్చెయ్యండి" అంటూ పద్మావతి బిరబిరా లోపలికి వెళ్లిపోయింది.

కమలాకరం తెల్లబోయి "అదేమిటి పద్మా! వీళ్ళపైన కత్తు గట్టినట్టు మాట్లాడేస్తున్నావు?" అన్నాడు.

నాబాధ మీకేం తెలుసు నన్నట్లు పద్మావతి భర్తవైపు అదోమాదిరిగా చూచింది.

పోనీలే, నాకెందుకు లెమ్మనుకున్నాడు కమలాకరం.

కానీ పద్మావతి చిత్తప్రవృత్తిలో వస్తున్న ఈచిత్రమైన మార్పుయొక్క విశ్వరూపాన్ని గమనించినకొద్దీ కమలాకరం మాటిమాటికీ విస్తుపోవలసి వచ్చింది.

"ఇంతకు మునుపు ఎక్కడుండేవారమ్మాయ్?" అని ఎదురింటావిడ ప్రశ్నిస్తే, పద్మావతి "అదేమిటండీ! అలా అడుగుతున్నారు. మనుషులన్న తర్వాత ఊళ్ళో వుండక అడివిలోవుంటారా" అని సమాధానమిచ్చింది.

"మీ వారి ఉద్యోగ మేమిటండీ?" అని ఎవరో అడిగితే "ఉదరపోషణకై వుద్యోగమైతే ఏమిటండీ? ఏదో ఒకటి" అంటూ పుల్లవిరిచినట్లు బదులు చెప్పింది.

"ఏమిటమ్మాయ్! కాస్తా తలుపు తెరవకూడదూ! ఎంతసేపూ నాలుగు గోడలమధ్య ఖైదిలా కూర్చుంటావెందుకూ?" అంటూ కడపదాకా వచ్చిన వాళ్ళని "ఒంట్లో ఏమీ బాగుండడం లేదండీ! డాక్టరుగారు విశేషంగా మాట్లాడగూడదన్నారు" అని చల్లగా సాగనంపింది.

"నిష్కారణంగా వీళ్ళతో విరోధం కొని తెచ్చుకుంటున్నావేమో పద్మా!" ఓ రోజు కమలాకరం బాధగా అన్నాడు.

"వీళ్ళతో స్నేహంగా వుంటే మనకు ఒరిగే దేమిటి, లేకుంటే తరిగే దేమిటి? మనం ఈ యింటికి కాపుర మొచ్చి ఒక నెలరోజు లవుతాయి గదా! వీళ్ళకు మనం యింతకు మునుపు ఎక్కడుండే వాళ్ళమో తెలియదు. మీరుచేస్తున్న వుద్యోగమేమిటో తెలియదు. అసలు నాపేరేమిటో తెలియదంటేనమ్మండి తెలుసుకోవాలన్న కుతూహలం వున్నప్పటికీ నన్ను ప్రశ్నించడానికి వీళ్ళకు గుండెల్లేవు. నేను పెడసరంగా తప్ప మరోక విధంగా బదులు చెప్పనన్న సంగతి వీళ్ళకు బాగా తెలిసిపోయింది. నాకిప్పుడెంతో హాయిగా వుంది" అంటూ పద్మావతి విజయగర్వంతో నవ్వింది.

4

కానీ జీవితం ఎల్లకాలమూ హాయిగానే గడచిపోదు!

ఓ రోజు ఉదయం పదిగంటలకే ఆఫీసుకు వెళ్ళిన కమలాకరం పన్నెండుకల్లా యింటికి తిరిగి వచ్చేశాడు

"ఏమిటండీ! ఏం జరిగింది?" అంటూ పద్మావతి కంగారు పడిపోయింది.

"మరేం భయపడకు పద్మా! శుభవార్త చెప్పిపోదామని రెక్కలు గట్టుకుని యిలా రివ్వున వచ్చేశాను. మనకు ప్రమోషను వచ్చేసింది! ఆఫీసరుగారు స్వయంగా పిలిచి ఆర్డరు చేతికిచ్చారు." అంటూ కాగితాన్ని జేబులోనుంచీ పైకితీసి గాలిలో రెపరెప లాడించాడు కమలాకరం.

"నిజంగా?" కళ్ళు ఆకర్ణాంత విశాలాలై పోతుండగా ఆశ్చర్యంతో ప్రశ్నించింది పద్మావతి.

"నిజం నిజం! నువ్వు తీరిగ్గా ఆశ్చర్య పడుతూ వుండు! నేను అయిదు అయిదు నిమిషాల్లో వచ్చేస్తాను" అంటూ కమలాకరం సైకిలుపైన తుర్రున వెళ్ళిపోయాడు.

పద్మావతి నిలువుటద్దం ముందు నిల్చుని తన సౌందర్యానికి తనే మురిసిపోయింది. ఆ తరువాత పెళ్ళయిన క్రొత్తలో జంటగా తీయించుకున్న ఫోటోను గుండెల కదుముకుని ఏదో మధురగీతిక పాడుకుంది. కుర్చీలో కూర్చుంది. ఈజీచేర్‌లో పడుకుంది. ఉండి ఉండీ యిల్లు నలుమూలలా కలయతిరిగింది...

పది పదిహేను నిమిషాలిలా అవస్థపడిన తర్వాత,—పట్టరానంత ఆనందాన్ని, ఏను గెక్కినంత సంబరాన్ని యిలా నాలుగు గోడల మధ్యకుదించి వుంచడం ఆమెకు దుస్తరంగా తోచింది-పద్మావతి ధనుర్యుక్తమైన బాణంలా రివ్వున వీధిలోకి వచ్చేసింది.

ఎదురింటావిడ సంచి చేతబట్టుకుని మెట్లు దిగి వీధిలో అడుగుపెడుతోంది.

"ఏమండీ పిన్నిగారూ! బజారుకు వెళ్తున్నారేమిటి" అంటూ ఆప్యాయంగా పలకరించింది పద్మావతి.

"ఏం బజార్లోతే తల్లీ! మా బ్రతుకే బజారులా వుంది" అంటూ ఎదురింటావిడ ముఖం త్రిప్పుకుని విసవిస నడచిపోయింది.

చింత నీళ్ళు చిలకరించినటుగా పద్మావతి ముఖం ముకుళించుక పోయింది. కొండంత ఉత్సాహం నేలమట్టానికి అణగారి పోగా ఆమె గిరుక్కునవెనుదిరిగింది-అయ్యో తను చేసింది చాలా ఘోరమైన పొరబాటు. తన యిష్టాయిష్టాలకు అనుగుణ్యంగా ఒకప్పుడు తనతో ప్రసక్తి కలిగించుకుని, మిగిలినప్పుడు దూరంగా వైదొలిగి వుండడానికి లోకులు తనచేతి కీలుబొమ్మలుగారు. వాళ్ళు మైత్రి నెరపుతారు. కలహిస్తారు. అసూయ పడతారు. గౌరవిస్తారు. పదిమందిలో తనూ ఒకర్తెగా మెలగదలచుకున్నంతవరకూ స్నేహమో, విరోధమో, అసూయో, గౌరవమో ఎప్పుడేది ఎదురైతే అప్పుడు దాన్ని స్వీకరించడానికి సిద్ధంగా వుండక తప్పదు! అలా కాదనీ తను లోకుల్ని తృణీకరిస్తే, వాళ్ళు తన వ్యక్తిత్వాన్ని గుర్తించడానికే నిరాకరిస్తారు!

"అవును, యిప్పుడు నాకు విధింపబడిన శిక్ష యిదే!" అనుకున్నది పద్మావతి.

ప్రమోషను వచ్చిన పదిరోజులకే కమలాకరం రేడియో కొన్నాడు. కంతులమేరకు డబ్బు చెల్లించడానికి ఒప్పందమై మోటర్ సైకిలుకూడా కొనుక్కున్నాడు. ఐతే రేడియోగానీ, మోటర్ సైకిలుగానీ సంతృప్తినీ, సంతోషాన్ని యింటిలోపలికి వెంటబెట్టుక రాలేకపోయాయి—సంతోషమూ, సంతృప్తీ డబ్బిస్తే బజార్లో దొరికే వస్తువులు గావు.

కమలాకరానికి ప్రమోషను వచ్చినమాట నిజమే! కానీ ఆ ప్రమోషనుమూలంగా లభ్యంగావలసిన ఆనందం మాత్రం ఆకాశకుసుమంలా అంతంతదూరంలోనే వుండిపోయింది. దీన్నే మరోకవిధంగా చెప్పొచ్చు—వ్రతం నెరవేరింది, కానీ ఫలం మాత్రం దక్కలేదు!

5

అద్దెయింటికోసం మళ్ళీ నాళంవారి వీధిలోనే అన్వేషణ ప్రారంభించిన కమలాకరం "ఇప్పుడున్న యింటికేమండి?" అని ప్రశ్నించిన పరిచితులందరికీ "అబ్బే! అది దయ్యాల కొంపండీ! రాత్రుల్లో గంగాళాలు దొర్లుతాయి! డాబాపైన రాళ్ళు పడతాయి! పెట్టిన వసువు పెట్టినచోట వుండదు" అంటూ దీనంగా ప్రత్యుత్తర మిచ్చాడు! ★

★ అపశ్రుతి ★

(31-వ పేజీ తరువాయి)

యింటికివచ్చి పాఠం చెప్పుకుంటాను. సంగీతమంటే నాకు ప్రాణం. నా చేతిలో వీణె పలుకుతుంది గానీ, గొంతెత్తి పాడే శక్తి నాకు లేదు. గాత్రం మీదగకే నేర్చుకోవాలని ఆశపడుతున్నాను. అన్నయ్య మీకు చెప్పేవుంటాడు యీ విషయం." ఆమె ఆవేశంతో మాట్లాడుతుందేమో అనిపించింది. మధుమూర్తి తలెత్తి ఆమెవంక చూశాడు. ఆమె కళ్ళు విశాలంగా, అమాయికంగా వున్నాయి. దీనంగా, నా మాట వినవూ అన్నట్లు పలుకరిస్తున్నాయి.

"నిజం మాస్టరుగారూ, మీరు గట్టిగా కాదంటే నేను ఎప్పుడో నేర్చుకున్న ఆ అపశ్రుతుల వీణనే వాయించుకుంటాను" అన్నది. మధుమూర్తి నవ్వాడు—నాకు ఉద్ధరింపా అన్నట్లు. కానీ—పాపం ఏమి అపచారం చేసింది యీ పిల్ల? ఎందుకు వెనుదీస్తోంది మనస్సు.

కానీ—"రేపు సాయంకాలం నుంచి ప్రారంభిస్తాను. నీ వీణె పంపు. చూస్తాను" అన్నాడు.

* * *

యామినికి పాఠం చెప్పడం సులువు అనిపించింది, మధుమూర్తికి. ఆమె కంఠంలోని మార్దవం ఆతన్ని ఆశ్చర్యపరిచేది. సునాయాసంగా వంపులు తిరిగేది ఆ కంఠం. లోకమంతా ఏదో యాతనల్లో పడివుంటుంటే, నాకు అవేమీ లేవుసుమా అన్నట్లు, చిరునవ్వుతో పాడుతున్నట్లుండేది ఆమె కంఠం. మధుమూర్తి స్వరం అందివ్వడం ఆలస్యం. సన్నని ఆమె వ్రేళ్ళు వీణె మెట్లమీద పాగేవి, మెత్తని ఆమె కంఠం మధురంగా పలికేది.

ఆమె పాడుతుంటే తలచి తలచి ఆమె చూపులను పరీక్షించేవాడు మధుమూర్తి. భక్తి గౌరవం, ఏదో ఆకాంక్షవుండేవి ఆమెసజల నయనాల్లో. ఆమె చూపులు చలిస్తున్నా వాటిలో అమాయకత్వం ప్రస్ఫుటిత మయ్యేది. ఆమెకు పాఠం చెబుతుంటే అనుకోకుండా సుందరి జ్ఞాపకం వచ్చేది మధుమూర్తికి. ఆమె అతని ఆలోచనల్లో పవిత్రంగా, దేవతాత్వం మూర్తీభవించినట్లుండేది. సుందరిని గురించిన భావాలు చల్లనివి మనస్సుకి ప్రశాంతత నిచ్చేవి. తన పుత్రికను వివాహంచేసి అత్తవారింటికి పంపి, ఆమె

★ అపశృతి ★

శృతులలో బాధపడే తండ్రివలె వుండే వాడు మధుమూర్తి. అవే భావాలు అతనివి.

యామినికి పాఠం చెప్పడం సునాయాసమే కదా, ఎందుకో మధుమూర్తి మనస్సు నిర్మలంగా ఉండేది కాదు. ఎంత శ్రద్ధగా నేర్పుతుంటేనేమిటి, నాకు పేరు తీసుకువస్తుందా యీమె అనుకునేవాడు. తన మనస్ఫూర్తిగా ఆమెకు చెబుతున్నాడా? ఒకనాడు ఒక రాగకళ పొరపాటు చెప్పాడు, మరొకనాడు ఒక కీర్తనలో ఒక చరణం మర్చిపోయాడు, ఇంకొకనాడు ఒక కీర్తనతాళం తప్పు చెప్పాడు. ఎందుకు జరుగుతుంది యిల్లాగ.?

యామిని వీణ బాగా నేర్చుకుంది. ఏడాది తిరిగేలోగానే ఆమె చాలా కృతులు నేర్చుకుంది. స్వరకల్పన, రాగాలాపన, ప్రస్తారం చేయసాగింది,

"యామినీ, నువ్వు యింట్లో సాధన చేసుకోలేవు నేను లేకపోతే?" అన్నాడు ఓనాడు. యామిని ఆశ్చర్యపోయింది.

"ఏం మాస్టారూ, మీరు యీ వూరు నుంచి వెళ్ళిపోతున్నారా?" అన్నదామె.

"ఏమీలేదు. ఊరికే నే అన్నాను." నిజమే తను ఎందుకల్లా అన్నాడో తనకే తెలియదు. యామిని ఆ రోజు 'కాఫీ' రాగం ఆలపించి, కీర్తన పాడింది. పూర్తిగా గంటసేపు ఆకీర్తనే పాడిందామె స్వరంతో సహా. ఆమె కంఠం తేలిపోతుంటే ఏవో చెప్పలేని లాలనలు, మమతలు స్ఫురిస్తున్నాయి. ఆమె వీణ వూపులో మనస్సే ఉర్రూతలూగింది. మురులుకొలిపే ఆ మాధుర్యం—మధుమూర్తి మనస్సు ఊగిసలాడి యధాస్థానానికి రావడానికి నిరాకరిస్తోంది.

"ఇది వద్దు యామినీ భైరవిలో కీర్తన పాడు." అన్నాడు. కానీ ఆమె కీర్తన పాడలేదు. రాగమే అందుకుంది, సుందరిపాడేది యీ రాగం—మనస్సంతో జాలితో, చెప్పలేని ఆర్ద్రితతో నిండేది మధుమూర్తికి. కానీ యిదేమిటి? తలవంచుకుని కూర్చున్న పెండ్లికూతురు, సిగ్గుపడి నవ్వే నవవధువు—ఏవో కళ్ళముందు కనుపిస్తున్నాయి మధుమూర్తికి. అతను లేచి నిల్చున్నాడు.

"యామినీ, రేపు పాడుకుందాం. వద్దు" అన్నాడు. యామిని అతనికి నమస్కారం చేసింది. ఆమె కళ్ళల్లో భక్తి గోచరించింది మళ్ళీ—కానీ తనకళ్ళల్లో ఏ భావముంది?

* * *

ఆ సంధ్యాసమయంలో తోటలో కూర్చున్నాడు మధుమూర్తి. అతనికి ప్రతిరాగం ఒక సంపూర్ణరసం, ప్రతిరాగం ఒక పవిత్రభావాన్ని కలిగింపచేస్తుంది, ఒక చక్కని దృశ్యాన్ని కనులముందుంచుతుంది. లయ, సాహిత్యం మొదలైనవన్నీ తరువాతి అంశాలు. రాగం, ఆ రాగంలోని ఒక్కస్థాయి మనస్సుకి దరిదాపుగావెళ్ళి, భావాలని కలిగింప చేస్తాయి. కానీ ఆ భావాలకి, గాయకునికి సంబంధం లేదు. గాయకుని గాత్రం మాత్రమే అక్కడముఖ్యం. ఆ గాత్ర మాధుర్యంమాత్రమే అక్కడముఖ్యం కానీ వీటన్నిటినీ మించి గాయకునిమీద పరదృష్టి కేంద్రీకరింపరాదు. కానీ తన మనస్సులో ఏమిటి విచిత్ర పరిణామాలు? తానింక గురువుగా ఉండడానికి తగడా?

మధుమూర్తి ఆలోచించలేదు. తన మనశ్శక్తిని కూడదీసుకోవడమే ప్రథమ కర్తవ్యంగా భావించాడు. తను యామినివంటి మధుర గాయనిని దూరం చేసుకోరాదు. ఎప్పటికప్పుడు ఓటమి నంగీకరిస్తూ, చేసిన ప్రతి అడుగుని వెనక్కి తీసుకోవడం, క్షణక్షణానికీ యాత్రాపథం మార్చడం తగనిపని అనుకున్నాడు.

* * *

"మీరు ఏమి చెబితే అది నేర్చుకుంటాను. ఏమి పాడమంటే అది పాడతాను" అన్నది ఆ మరునాడు యామిని. "మీరు మూడ్సులో పడితే ఈ వ్రేళ్లు సాగవు" అన్నది నవ్వుతూ.

మధుమూర్తి ఆమె ముఖం చూశాడు. ఆ కళ్ళలో మెరుపులు గోచరిస్తున్నాయి. తను మొదట్లో చూసిన అమాయకమైన నీలినయనాలు కావు, తళతళ మిరుమిట్లు గొలిపే నేత్రాలివి. ఆ నవ్వు—చల్లగాలేదు, వెన్నెల మెరుగుని చూపిస్తోంది.

"యామినీ! నీకీ పేరు ఎవరు పెట్టారు?" యామిని కిలకిలనవ్వింది. "ఏమండీ, ఎన్నడూలేని ప్రశ్న ఇవ్వాళ వచ్చింది? పున్నమినాడు పుట్టానని మా నాన్నగారు పెట్టారు."

నదితరంగాల్లో పరుచుకుపోయి, వెండిలా నీటిని మెఱపించే వెన్నెలలు కనుపిస్తున్నాయి కళ్ళకి. యామిని తెల్లని పలువరుస, సొట్టపడిన చుబుకం కనుపిస్తోంది ఎదురుగా.

తన క్రింది పెదవిని పంటితో కఱచుకున్నాడు మధుమూర్తి. అతని కళ్ళు చెమర్చాయి. ఈ బాలిక స్వభావం తెల్సుకోవాలి. "యామినీ, నన్ను చూస్తే నీ కేమనిపిస్తుంది?"

యామిని అర్థం కానట్లు చూసింది. కాస్సేపు రెప్పలల్లార్చి తలవంచుకుంది. "మంచి వారనిపిస్తుంది" అన్నది.

"నన్ను గురువుగా గౌరవించ గలుగుతున్నావా యామినీ?" నిశ్చలంగా అడుగుతున్నాడు మధుమూర్తి.

"పూజించాలనిపిస్తుంది—మీరు అంగీకరిస్తే ఆనందబాష్పాలతో మీ పాదాలు అభిషేకం చెయ్యాలనిపిస్తుంది."

"నన్ను గౌరవంతో ప్రేమతో చూస్తావా నువ్వు?"

యామిని మాటాడలేదు వణికే ఆమె వ్రేళ్లు ఏమీ తోచక చలించాయి—వీణ పలికింది.

"యామినీ! నిన్ను ప్రేమిస్తున్నాను. నీ సంగీతానికి ముగ్ధుడనైనాను. నన్ను కనికరించవూ?" అతని చెవులకి అపశ్రుతులు వినిపిస్తున్నాయి ఈ మాటల్లోంచి. కానీ—ఎలా?

యామినికళ్లు వాలిపోతున్నాయి. బుగ్గలు

తెంపులైనాయి. వీణమీటిన ఆమెకోలు కొంచెం కదిలింది. మెల్లిగా నవ్వింది ఆమె.

"మంచిది మాష్టరుగారూ, పాఠం చెప్పరా యివ్వాళ్లికి?" అన్నది.

మధుమూర్తి ఆరోజు పాఠం చెప్పలేదు. ఆమెచేత నే ఎన్నో పాడించేవాడు. శృంగార రసప్రధానమైనఖమాసురాగంపాడమన్నాడు. ఆమెపాడింది. ఆమెకంఠమాధుర్యం అనన్యం అన్నాడు. ఆమె గంధర్వగాయని అన్నాడు. ఇంకా ఎన్నో అన్నాడు, అనిపించాడు— అనుభూతులలో మునిగిపోయాడు. బాగా చీకటిపడింది యామిని యింటికి వెళ్లేటప్పటికి.

* * *

ఇరవై నాల్గు గంటలు కాలేదు. యిదంతా జరిగి—తను యిప్పుడు రైల్లో 1000 మైళ్ళ దూరానికి టికెట్టు కొనుక్కొని ప్రయాణం చేస్తున్నాడు. తనభావాల్లో ఏది విశ్వసనీయము? తనకి నిశ్చితాభిప్రాయాలు వున్నాయా? వాటికి భంగం వాటిల్లకుండా వుంచడానికి ఒకనాడు సుందరిని విడిచి వచ్చాడు — ఒక ఆశయంకోసం. పవిత్ర భావనాసిద్ధి ఈరోజు కనీసం కానీయిప్పుడు? తన మనస్సు విడిచి తను ఎక్కడికిపోగలడు? తనఆశయాలన్నీ సమూలంగా చెంతిపోయాయి యామిని సమక్షంలో. పారిపోతున్నాడు — దూరంగా, అన్నిబాంధవ్యాలను త్రెంపుకుని పారిపోతున్నాడు.

ప్రకృతిసిద్ధమైనభావాలని, మానసికపరిణామాలని కాదంటున్నాడా తను?

మధుమూర్తికి యోచనాశక్తి చాలటంలేదు. ఊపిరాడనీని ఆవేశం, యామినిని గురించిన స్మృతులు ముసురుకుంటున్నాయి. కెరటాలవంటి యీ ప్రేమ...ఆకారంలాగా వున్న యీ ప్రేమనుంచి ఎక్కడికి తప్పించుకుపోతాడు తను? "ఆమె నా శిష్యురాలు కాదు - కాదు... నేనా మెగురువుని కాను." అని పదేపదే అనుకున్నాడు. కానీ — ఎందుకు తను ఒకనాడు ఏర్పఱచుకున్న నిర్వచనాన్ని మార్చుకోవాలి? ఆ న్విచనం విలచి, తను ఆప్రకారం ప్రవర్తిస్తే ఎంత బాగుంటుంది! తన ఆశయసిద్ధి కలగడం ఎంత గొప్పవిషయం!......?

తెల్లవారింది రైల్లోనే. ఉలిక్కిపడి లేచాడుమధుమూర్తి ఏదోసేషను. ఎదురుగా మరోరైలుంది, ఎదురుదిక్కువేపు పోయే రైలు, ఉదయభానుణ్ణి చూస్తే — సుందరి ఆనాడు ఆలపించిన 'మలయమారుతం' రాగం జ్ఞప్తికి రాలేదు, అరుణరాగరంజితములైన యామిని చెక్కిళ్ళు, యామిని ఫాలభాగం జ్ఞప్తికి వచ్చాయి.

ఎదురురైలు కూతవేస్తోంది. తనకి పది గజాలదూరంలో ఇంటికి తిరిగివెళ్లే సాధనం వుంది—"యామినీ! యామినీ!" అని రహస్యంగా అనుకున్నాడు. వెళ్ళేరైలుని చూడకుండా కళ్ళు మూసుకున్నాడు. ఆకూత తన చెవుల్లో పడనివ్వలేదు.

రెపరెపలాడే మనస్సు — చెదరిపోయిన తనమనస్సు — ప్రోగుచేసుకుని, చెమర్చే కళ్లతో "వెనుపోను." అనుకున్నాడు. ★

దగాపడిన తమ్ముడు

(43-వ పేజీ తరువాయి)

వుంచి చూడలేకపోయాను. పతితుల్ని ప్రేమించే మంచితనం నాలో లేకపోయిందోయ్! అంతా నాదనే అహంకారంతో కూలిపోయాను. ఈలోకంలో పెరిగిపోతున్న కష్టాలకి కారణ మేమంటావ్? మనిషి అంతా నాదనేమాయలో చిక్కుకున్నాడు. ఈ మాయని యే ప్రభుత్వం తగ్గించగలుగుతుందో అదే రామరాజ్యాన్ని తేగలుగుతుంది. ఆ మాయ మానవుల్లో దురాశా రూపంతో అంకురించివుంది. సుగ్రానికి కళ్లెంలాగ ఆ దురాశకు ప్రభుత్వం కళ్లెం వెయ్యకపోతే దానిషం వచ్చినట్లు గంతి బీభత్సం చెయ్యదా? పరిపాలించే వాడే కళ్ళెంలేని సుగ్రమైతే అంతాసరి! వాడు సారథి కావాలంటే వాడి మెదడులో ఒక్క న్యాయదృష్టివుంటే చాలదు. తెలివి తేటలుండాలి! ఆ ఒక్కడి న్యాయం తెలివి కొట్ల ప్రజలకు సుఖాన్ని యిస్తుంది. పూర్వకాలంలో రాజుల న్యాయం మంత్రుల తెలివి కలిసే దేశాలు వర్ధిల్లాయ్—ప్రజలు సుఖపడ్డారు! అంచేత మనుషుల్లో అంతా సమానమనే వెఱ్ఱి అహంభావాన్ని లేకతించి నిరాశ కెయ్యించి వాళ్లని పతనం చెయ్యటం నాకు ఘోరాతి ఘోరమైన విషయంగా కనిపిస్తోంది! బాబూ! నీవు చాలా విశ్వాసమైన జాతిలోని వాడివోయ్ అంచేత నీతో ఇంత చెప్పకుంటున్నాను - అర్థం అవుతోందా?"

కుక్క చిన్న మొరగు మొరిగింది. బూచోగు నవ్వుకున్నాడు. ఇంతలో ఏదో యేడుపు వినిపిస్తోంది. మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ కుక్క కాస్త పెరిగినా క్రింద వదిలితే యేతయ తీసుక వెళ్లారనే భయముతో ఎత్తుకొనే అక్కడకు వెళ్లాడు. గడపలో శవం! ఆశవం పైపడి యిద్దరు పిల్లలు భార్య యేడుస్తున్నారు. వాళ్ల గోడు విని యిరుగుపొరుగున వున్నవాళ్ల కళ్ళల్లో నీళ్లు కారిపోతున్నయ్.

బూచోడు అలా నిల్చొని చూచాడు. "తమ్ముడా! చనిపోయావా?" అన్నాడు. అక్కడ మూగివున్న వాళ్ళు బూచోడివైపు వినయంగా చూస్తున్నారు. వాడిగడ్డం విరగబోసిన జుత్తు ఆ తెల్లని ముఖవర్చస్సు చూసి నలుగురిలోను అదో గౌరవభావం ఏర్పడింది. బూచోడు మరి కాస్తా దగరకు వెళ్లి:

"ఎందుకు నాయనలారా గగ్గోలు పెట్టారు. ఇదిగో!" అంటూ ఒక సమకోణ త్రిభుజం దానిభుజాలమీద చతురస్రాలురాయిముక్కతో తారురోడుమీద గీసాడు. మళ్ళీ ఆ చతురస్రాలను చూపిస్తూ "ఇదిమనసు. యిది ఆత్మ. ఈ రెండు కలిస్తేగానీ పరమాత్మతో సమానం కాదు—మనసునూ ఆత్మనూ కలపలేక పోయాడు-చచ్చిపోయాడు-అలా కలపనంత వరకూ పుట్తూనే వుంటాడు—చచ్చిపోతుంటాడు"-తరవాత కాస్తసేపు మానంగా లేచి ఇటూ అటూ తిరిగాడు. అంతా బూచోడు ఏ మాహాత్మ్యం చూపిస్తాడో అని ఆశతో చూస్తున్నారు. కానీ కొంతసేపటికి మాటాడకండానే తనదారిలో తానుపోయాడు!

—ఇంకా వుంది.]

వనితావాణి

(39-వ పేజీ తరువాయి)

ఫులుసాప్ లేదు ముందు కూర్చున్నవారు మాట్లాడవద్దండి అనేటప్పటికి ఆమె పూరుకుంది. అసలు వీళ్లు మాట్లాడడానికి వస్తారో? సినిమా చూడడానికివస్తారో అర్థంకాదు. ఈ వ్యాసం వ్రాసిన రచయిత్రికి నా అభివందనాలు.

* * *

కుమారి కాజ వెంకటకమలగారు (విజయవాడ) "పేను కొరుకుడు"గాను మందు అడిగినారు. నాకు తెలిసిన వైద్యం వ్రాస్తున్నాను. కాకమారి విత్తినాలు అని (కిరాణా)అంగళ్లలో అమ్ముతారు. దానిని 0-1-0 ది తెచ్చుకొని రోట్లో వేసి మెత్తగా నూరి కల్తీలేని కొబ్బరినూనెలో వేసి, ఒక దినము అలాగే వుంచి, ప్రతిదినము తలకు పూసుకొంటే పేనులు చనిపోతాయి. తలంటిపోసుకున్నప్పుడు పుల్లపెరుగు తలకు బాగా వేసి వేసి రుద్దితే ఈర్లు చనిపోతాయి.

—వి. అహల్యాదేవి, బళ్లారి]

* * *

'పేను కొరుకుడు' ఒకసారి నాకుకూడా వచ్చింది. దానికి నే చేసినది చెబుతాను. దానివలన నాకు నా సోదరునకు సుగుణం కనబడ్డది. ఎర్ర మందారపూవును పొద్దుక పూట (8 గంటలవేళ) 5, 6 పూలను కోసి పేనుకొరుకుడు వున్నచోట వాటిని గట్టిగా రుద్దాలి. తరువాత ఎండినపూలను చూర్ణము చేసి కొబ్బరినూనెను వెచ్చచేసి ఆపొడుమును నూనెలో వేసుకొని చల్లపడ్డ తదుపరి తలకు రాచుకొనవలెను. అట్లు ఒక నెల రోజులు చేసినట్లయిన వెంట్రుకలు మరల వస్తవి. మొదటివారము చర్మం నల్లపడుతుంది. తరువాత వెంట్రుకలొస్తవి. ★

—ఎం. హనుమంతరావు,
జొన్నారు - కృష్ణా జిల్లా]

సినిమా

'ఇన్విటేషన్ టు మాజిక్' అనే 'చిన్న చిత్రం' ఒకటి ఈమధ్య విడుదల అయింది. ట్వెంటియత్ సెంచరీ ఫాక్స్ వారి చిత్రాలతో చూపిస్తున్నారు. అందులో ప్రముఖ అమెరికన్ మెజీషియన్‌లు అరడజనుమందిని పరిచయంచేశారు. చూస్తున్నంతసేపూ అద్భుతరసంలో మునిగితేలుతాం. బిలియర్డ్ బంతులతో గారడీల దగ్గరనుండి, పేక బొత్తిలోంచి, మనం కావాలనుకున్న అరటుముదాం దానంతట అదే లేచి పైకి రావడంవంటి వాటివరకూ రకరకాల గారడీలు చూపించారు. చూస్తేగాని నమ్మలేమంటారుగాని, చూసినా నమ్మలేమనిపిస్తాయి ఇందులో వింతలు.



జలరుహా వారి 'రాజనందిని'లో జి. వరలక్ష్మి

ఒకాయన, గదిమధ్య ఒక చట్రం నిలబెట్టి అందులో ఓ కాగితం బిగించి, దానిమీద బీర్‌పీపా బొమ్మ వేస్తాడు పెన్సిలుతో. ఆనక, చిన్న కొళాయి గొట్టం ఒకటి తెచ్చి అందులో గుచ్చుతాడు. తరవాత, ఆ కొళాయి తెరిస్తే బీరుపడుతుంది. గ్లాసులలోకి పట్టి దాహం పుచ్చుకోవచ్చు!

"అయితే పది గ్లాసులకన్న ఎక్కువ రాదు" అంటాడు ఆ ఇంద్రజాలికుడు గంభీరంగా; ఆశ్చర్యచకితులైన ప్రేక్షకులు, ఈ

బొంబాయి సినిమాలేఖ

ఇంద్రజాలంలో మళ్ళీ ఈ పరిమితులూ, గట్రా విని మరింత కంగారుపడిపోతారు. వీటి తమాషాలే అంత. ఆ కబుర్లు మనని మరీ కంగారుపెడతాయి. వింతచూసి, మనం కొంత ఆశ్చర్యపడి, ఇది ఎలా సాధ్యం అయిందా అని దాని కిటుకు పసిగట్టడానికి కిందా మీదా పడుతూ వుంటే 'ఇందులో పెద్ద వింతేముంది' అన్నట్టు చూసి, తమాషాగా నవ్వుతూ మరింత హడలగొడతారు.

* * *

మొన్న బొంబాయిలో వీటిని మించిన అద్భుతాలు చూడడం జరిగింది. ఈ ఇంద్రజాలి భారతీయుడే. ఆయన పేరు శ్రీ ఎ. సి. సార్కార్. బెంగాలీ. వాళ్ల కుటుంబ విద్య ఇది. అమియ చిత్రవారి 'డిటెక్టివ్' చిత్రంలో ఈయన ఇంద్రజాల విద్యను కొంత ఉపయోగించుకున్నారు. కన్నవాళ్లు విన్నవాళ్లకి చెప్పగా, వారూ వీరూకూడా పదే పదే ఈయన్ని పది సెట్‌లకి ఆహ్వానించి సార్కార్ విద్య చూచి ఆనందించారు. బొంబాయి నటులలో జానీవాకర్ ఈయనకి పెద్ద ఫాన్ అయిపోయాడు. కాగితం పొట్లం కట్టి అందులో పాలుపోసి అవి మాయంచేసి చూపేసరికి నర్గిస్ అప్రతిభురాలైపోయింది

సార్కర్ తమాషాలలో, డెయిసీఇరానీని రంపంతో పదోపన్నెండో పెట్టి 'భాగించి,' మళ్ళీ అన్నిటినీ 'కూడి' పూర్తిగా తయారు చెయ్యడం ఒకటి బ్రహ్మాండంగా ఉంది. అయితే, ఇలాటివి మీరు చూసేఉంటారు. కాని, పైన చెప్పిన అమెరికన్ చిత్రంలో, టీరుపీపా రేఖా చిత్రంలోంచి టీరు తీసిన మాజిషియన్‌లా, సార్కర్ చేసిన మరో అద్భుతం సరికొత్తది. దీన్ని ఇంతవరకు ఎవరు చేసి ఉండరు. ఆయనే చెయ్యలేదు.

ప్రాజెక్షన్ థియేటర్‌లో తెరమీద ఒక 'స్లైడ్' వెయ్యమన్నాడు. తెరమీద బొమ్మ ఒకగది. అందులో భార్యాభర్తలు కూర్చుని ఫోటో-జెనిక్ గా నవ్వుతున్నారు. సార్కర్ ఒక పువ్వుగుచ్ఛం పట్టుకు తెర దగ్గరకివెళ్ళి ఆ దంపతులలో చిలకను పలకరించి, పూలసుతిని అందించాడు 'ఇంద' అని. ఆబొమ్మ చెయ్యి ముందుకుచాచి, సార్కర్ చేతి పూలగుతిని తీసుకుంది! అంతేకాదు, బొమ్మలో మేష్టారు సిగరెట్టు తీసుకున్నాడు జేబులోంచి. సార్కర్ గారు తన జేబులోంచి 'లైటర్' తీసి వెలిగించి, ఆ బొమ్మ మూతి [illegible]ర పెట్టాడు ఈ నిప్పుతో ఆయన సిగరెట్టు వెలిగించాడు!

అమియా చిత్ర వారి 'డిటెక్టివ్' చిత్రంలో సార్కర్ ఇంద్రజాలం చాలా ఉంది. ఇవన్నీ సార్కర్ చేసినా, హీరో ప్రదీప్ కుమార్ పేరుకు జమ అవుతాయి. ఈ గారడీ' చేసేది దర్శకుడు శక్తి సమంత. 'డిటెక్టివ్'లో నాయిక మాలాసిన్హా. డెయిసీ ఇరానీ, జానీ జోకర్, కె. ఎన్. సింగ్ కూడా పాల్గొంటున్నారు. మాజిక్ లో కాదు; చిత్రంలో.


ప్రభా ప్రొడక్షన్స్‌వారి 'ఆడపెత్తనం'లో అంజలీదేవి

వార్తలు

జోకర్ జానీవాకర్ హీరోగా రెండు చిత్రాలు తయారవుతున్నాయి. రెండిటిలోనూ రాణి, 'శ్యామ. ఒకటి 'మిస్టర్ కార్టూన్' రెండోది 'మిస్టర్ జాన్'. ఇవి కాక, చాంద్ ఉస్మానీతో కలసి, 'నయా పైసా'లోకూడానటిస్తున్నాడు జానీవాకర్.

* * *

'బంబైకా బాబూ' రాజ్ ఖోస్లా దర్శకత్వాన తయారవుతోంది. బాబూ పేరు దేవానంద్. 'మేమ్ సాబ్' ఎవరో ఇంకా తెలియదు. దొరికితే, కొత్త అమ్మాయికి అవకాశం ఇవారనిమటుకు తెలిసింది. ఈ చిత్రానికి ఎస్. డి. బర్మన్ సంగీతం సమకూర్చుతున్నారు.

* * *

నవకేతన్‌వారి కొత్త చిత్రం 'కాలా బజార్'లో 'ఆనంద్ బ్రదర్స్' ముగ్గురూ కనిపిస్తారు. నాయకుడు దేవానంద్. వాళ్ళఅన్న చేతనానంద్, తమ్ముడు విజయానంద్ ప్రముఖ పాత్రలు నిర్వహిస్తున్నారు. విజయ ఆనంద్ దర్శకత్వంకూడా స్వీకరించాడు.

ఈ చిత్రంలో నాయిక మధుబాల. ఆగా, అభి భట్టాచార్య, బేబీనందాకూడా పాల్గొంటారు.

సంగీత దర్శకుడు, నవకేతన్ సంస్థ శ్రేయోభిలాషి, ఆనంద్ సోదరులకు అగ్రజతుల్యుడు, ఆప్త మిత్రుడు అయిన సచిన్ దేవ్ బర్మన్. ★

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)



'వీరప్రతాప్ చిత్రంలో' శివాజి గణేశన్, పద్మిని.

అంతర్జాతీయ ఉత్సవాలు

జూలై రెండో వారంలో జరుగనున్న కార్లొవీవారీ (జెకోస్లోవాకియా) అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి, ఈ సారి మహబూబ్ ప్రొడక్షన్స్ వర్ణచిత్రం 'మదరిండియా' అఖిలభారత ప్రశంసాపత్రం అందుకొన్న బెంగాలీచిత్రం 'అంధేరీ ఆలో'లను పంపిస్తున్నారు. సువర్ణపతకం సంపాదించిన డాక్యుమెంటరీ చిత్రం 'హిమాలయన్ టాపెస్ట్రీ' (బర్మాషెల్ సంస్థ నిర్మించినది), ఫిలింస్ డివిజన్‌వారి 'ఏషన్ ఆఫ్ మెర్సీ' ను డాక్యుమెంటరీల పోటీకి పంపుతున్నారు.

కార్లొవీ వారీ ఉత్సవాన్ని గతసంవత్సరమే కాన్స్, బెర్లిన్ ప్రభృతి ప్రథమ శ్రేణి ఉత్సవాల స్థాయికి పెంచడం విదితమే.

జూన్ [illegible] ఉత్సవం జరుగుతుంది. రాష్ట్రపతి సువర్ణపతకం పుచ్చుకున్న శాంతారాం చిత్రం 'దో ఆంఖేఁ బారాహాత్'ను ఈ ఉత్సవానికి పంపిస్తారు.

మాన్‌హీం (పశ్చిమ జర్మనీ) లో రెండు వారాల క్రితం జరిగిన చలనచిత్రోత్సవంలో సత్యజిత్ రాయ్ చిత్రం 'అపరాజిత' పాల్ జిల్స్ తీసిన డాక్యుమెంటరీ 'డ్రమ్, ప్యోర్ అండ్ డాన్సెస్ ఇన్ మలబార్" ప్రదర్శించారు. అక్కడికివచ్చిన దేశదేశాల ప్రతినిధులు ఈ చిత్రాలు చూచి ప్రశంసించారు.

*　　*　　*

కాన్స్‌లో సోవియట్ చిత్రానికి ప్రథమ బహుమతి

కాన్స్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ఈయేడాది ప్రథమబహుమతి 'వెన్ ది స్టార్క్స్ పాస్' అనే సోవియట్ చిత్రానికి లభించింది. ఇందులో తాత్యానా సమొలోవా, అలెక్సీబాటలోవ్ ముఖ్యనటులు ప్రపంచ యుద్ధంవల్ల క్షోభపడ్డవారందరి గాథలూ ప్రతిబింబించేలా చిన్న కథను కట్టి ఇందులో చిత్రించారు.

'మోన్ అంకుల్' అనే ఫ్రెంచి చిత్రానికి ప్రత్యేక బహుమతినిచ్చారు. ఉత్తమ దర్శకత్వానికిచ్చే బహుమతి 'వారా లీవెట్' అనే చిత్రం తీసిన ఇంగ్‌మర్ బెర్‌మన్ (స్వీడన్)కు లభించింది.

మౌలికతను మెచ్చి 'గియోవాని మూర్తి' అనే ఇటాలియన్ చిత్రం స్క్రిన్‌ప్లే రచయితలకు బహుమతులు ఇచ్చారు.

ఉత్తమ నటుడి బహుమతి ట్వెంటియత్ సెంచరీ ఫాక్స్ చిత్రం 'లాంగ్ హాట్ సమ్మర్'లో నటించిన పాల్ న్యూమన్‌కు లభించింది. స్త్రీలలో స్వీడిష్ చిత్రం 'త్రెషోల్డ్ ఆఫ్ లైఫ్'లో నటించిన ఈవా డాల్‌బెక్, ఇన్‌గ్రిడ్ తూలిన్, బీబీ అండర్సన్‌లు ముగ్గురికీ బహుమతులిచ్చారు.

'గోహా' అనే ట్యునీషియన్ చిత్రానికీ, 'విసేజెస్ డి బ్రాంజ్' అనే స్విస్ చిత్రానికీ అంతర్జాతీయ బహుమతులిచ్చి సత్కరించారు. ★

*　　*　　*

సి. నారాయణరెడ్డికి సినీనటుల సన్మానం

చెన్నపురి 'కళాప్రభాస' తరఫున మైలాపూరులోని సేట్స్‌హోటలులో మొన్న ఆదివారం సాయంత్రం (మే 25) సినీనటుడు శ్రీ జగయ్య ప్రఖ్యాతకవి శ్రీ సి. నారాయణ రెడ్డికీ, ధ్వన్యనుకరణ కళానిపుణుడు శ్రీ వేణుమాధవ్‌కూ సన్మానంజరిపి కానుకలు బహూకరించారు. శ్రీ అక్కినేని నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. చలనచిత్ర కళాకారులు, సినీరచయితలు, ఇతరసారస్వతకళాభిమానులు పలువురు హాజరైనారు. శ్రీ నారాయణ రెడ్డి తమ 'కర్పూర వసంతరాయలు' అనే కావ్యంనుంచి కొన్ని ఘట్టాలు చదివి వినిపించారు. శ్రీ వేణుమాధవ్ కొంతమంది రాజకీయ నేతల, సినీనటుల, ఉపన్యాసక, నటనా రీతులను అనుకరించి సభికులను ఆహ్లాదపరిచారు. ఒథెల్లో - నాటకంలోని ఒథెల్లో - డెస్డిమోనా సంభాషణా ఘట్టాన్ని చక్కగా ఏకపాత్రాభినయం చేశారు. వరంగలు నివాసిఅయిన శ్రీ వేణుమాధవ్ ఈ ధ్వన్యనుకరణకళలో ముందుముందు ఇంకా పరిపూర్తిని సాధించగలరనే ఆశాభావాన్ని శ్రీముద్దుకృష్ణ, శ్రీ ఇంటూరు వెంకటేశ్వర రావు ప్రకటిస్తూ మాట్లాడారు.

'దొంగలున్నారు జాగ్రత్త'

ప్రతిభావారి క్రొత్తచిత్రం 'దొంగలున్నారు జాగ్రత్త' నిర్మాణం పూర్తి కావచ్చింది. జగయ్య, జి. వరలక్ష్మి, గిరిజ,

శీలారావు, గుమ్మడి, సి. ఎస్. ఆర్., రాజబాల, చదలవాడ, రమణారెడ్డి, శివరావు మొదలగు వారు పాల్గొన్నారు. మాటలూ పాటలూ ఆత్రేయ వ్రాశారు. సంగీతం కె. వి. మహాదేవన్. దర్శకత్వం బి.ఎస్.ఆర్. నిర్వహించారు. నిర్మాత ఘంటసాల కృష్ణమూర్తి.

'ఋష్యశృంగ'

గీతా పిక్చర్స్ వారి 'ఋష్యశృంగ' ముక్కామల కృష్ణమూర్తి దర్శకత్వాన చురుకుగా తయారవుతోంది. ఏప్రిల్ 21 నుండి నెల రోజులపాటు ఈ చిత్రం నిర్మాణబృందం ఊటీలో ఔట్‌డోర్ దృశ్యాలను చిత్రించారు. చిత్రంలో దాదాపు మూడువంతుల భాగం ఇక్కడే పూర్తి అయింది.

ముఖ్య పాత్రను హరనాథ్ అనే కొత్త నటుడు నిర్వహిస్తున్నాడు. రేలంగి, గుమ్మడి, సి. ఎస్. ఆర్., సూరిబాబు, రఘురామయ్య, వంగర, సీతారాం, రాజసులోచన, గిరిజ, సీతాదేవి, లత, కుచలకుమారి మొదలగు వారంతా పాల్గొంటున్నారు. రచయిత సముద్రాల రామానుజం (జూనియర్). ఛాయాగ్రహణం. ఆది ఎం. ఇరానీ. నృత్యదర్శకత్వం పసుమర్తి కృష్ణమూర్తి నిర్వహిస్తున్నారు. నిర్మాత శేషాచలం చెట్టియార్. ★

రొనాల్డ్ కోల్మన్ స్మృతి

చంచలమైన వాటిలో, సినీతారల తార సినిమా సింహాసనం మీద చోటును పేర్కొనవచ్చునని, అందుమీద కూర్చున్న, కూర్చుంటున్నవాళ్ళు అంటూ ఉంటారు. అందువల్ల అందాకా వెళ్ళాక, ఆశయాలూ ఆదర్శాలూ వగైరాలను ఉతికి ఇస్త్రీచేసి, ప్లెళ్ళి అయిన కొత్తల్లో రాసుకున్న ప్రేమలేఖలతో బాటు పెట్టెఅట్టడుగున పడేస్తారు. అవన్నీ బాల్యస్మృతుల జాబితాలో చేరిపోతాయి. ఆపైన, తామున్న ఉన్నత స్థానంలో ఉండడానికై అనేక విధాల ఆయాసపడుతూ, అప్పుడప్పుడు అడియాసపడుతూ లేస్తూ కాలక్షేపం చేస్తారు. ఆ ప్రపంచం అలాటిది. రిషభ గాంధారాల మీద ఆనందగీతం ఆలపించబోవడంలాటిదా జీవితం. వక్రస్వరాల మీద చెవులకింపైన పాట పలికించడం అంత కష్టం.

రోనాల్డ్ కోల్మన్ ఈ రకం ఆశలూ, అడియాసలకూ, అతీతుడై, విఫలమైన ఆయాసం పడకుండానే నలభైయేళ్ళు - ఖచ్చితంగా 80 యేళ్లు చలనచిత్ర నటశ్రేణిలో మాన్యుడై నిలచాడు. ప్రజ్ఞావంతుడని పలుగురూ చెప్పుకునే పాటి పేరు గడించిన తరువాత, దానికి డబ్బ్యా పబ్లిసిటీపోసి పెంచడానికి అతను తాపత్రయపడలేదు. తెరమీద ఎంత సరదాగా, హాయిగా, బేఖాతరీ మనిషిగా కనబడ్డాడో జీవితం మీదా అలాగే తిరిగాడు. కత్తి యుద్ధాలు చేసినా, కబుర్లు చెప్పినా కోల్మన్ మాటలలో చేతలలో ఒకమాధుర్యం ఉంది. సిడ్నీ కార్టన్ పాత్ర ధరించి సముద్రమంత బాధను, నీలాభ్రమంతటి చిరునవ్వు తెరవేసి ప్రేక్షకుల గుండెలు కలవరపరచినా, కరుణతో నింపివేసినా ఆప్రజ్ఞ సర్వదా అతను ధరించినపాత్రకన్న, అవ్యక్తికే చెందినదనిపిసుంది. కోల్మన్ హాసం ప్రపంచావధిని ఎందరో ప్రేక్షకులను ముగ్ధులను చేసింది. గ్లామరుసీమలో 'కోల్మన్ మస్కట్' ఎందరో యువకులకు ఆదర్శం అయింది. కోల్మన్ మంద్రసాయి మధుమధుర కంఠస్వరంలో ఎంతటి గాంభీర్యం ఉందో అంతటి-దాదాపు స్పర్శకు అందుతుందనిపించేటంతటి-మార్దవం ఉంది.

రోనాల్డ్ కోల్మన్ బ్రిటిషు నటుడు. నాటకాలలో వేస్తూ అమెరికావచ్చి సినిమాలో చేరాడు. 80 ఏళ్ళ పాటు ఉచ్ఛస్థానంలో వుండి, పేరుతో పాటు ప్రజ్ఞకూడా పెంచుకొన్న నటుడుగా గౌరవం, అభిమానం గడించుకున్నాడు. బోజెస్ట్, విన్నింగ్ ఆఫ్ బార్బరావర్, రాఫిల్స్, అరోస్మిత్, ఎ టేల్ ఆఫ్ టూ సిటీస్, అండర్ టూ ఫ్లాగ్స్, ప్రిజనర్ ఆఫ్ జెండా, ది లాస్ట్ హారైజన్, ఇఫ్ ఐవర్ కింగ్, లేఫ్ విత్ కాగోలిన్, రాండమ్ హార్వెస్ట్ కిస్మత్, ఎ డబుల్ లైఫ్, చాంపిన్ ఖర్ సీజర్, కోల్మన్ చిత్రాల్లో స్మరణీయమైనవి. 40 ఏళ్ల తెరజీవితంలో అనేకరకాల పాత్రలను ధరించాడు కోల్మన్. 'డబుల్ లైఫ్' చిత్రంలో నటనకు అకాడమీఅవార్డ్ వచ్చింది.

చిత్రంలో పని లేనపుడల్లా, హాలీవుడ్‌కు దూరంగా ఒకనదిఒడ్డున కుటీరంలో, కవులు మురిసిపోయే వాతావరణంలో పుస్తకాలు చదువుతూ కాలం గడపడం అతని పద్ధతి. అందుకనే హాలీవుడ్ ఫాన్ పత్రికలలో అతని బొమ్మలు కనబడవు.

హాలీవుడ్ అపురూపంగా ఉపయోగించుకొనే సమ్మోహనాస్త్రం రోనాల్డుకోల్మన్, మే 19వ తేదీన 67వ యేట మరణించాడు. మంచి కథలూ, ప్రాణాలున్న పాత్రలూ తెరమీద కనిపించినప్పుడు, నటన విలువ తెలిసిన ప్రేక్షకులకు, కోల్మన్ లేని వెలితి స్ఫురిస్తూనే వుంటుంది. ★



వినోదావారి 'మహాదేవి'లో ఎం. జి. రామచంద్రన్

లోకంతీరు

(7 వ పేజీ తరువాయి)

కాని శకునఫలితం ఇల్లా జరుగుతుందని నేను ఎంతమాత్రమూ అనుకోలేదు. క్షమించండి అసలు ఏం జరిగిందో నేనింకా చెప్పలేదు కదూ?

అరగంటసేపట్లో కుర్రాడు యింటికి తిరిగి వచ్చేశాడు! మేము ఆశ్చర్యంతో 'ఏంజరిగింది' అంటూ ఖంగారుగా అడిగాం.

'నేను బడికివెళ్లేసరికి పదకొండుగంటలు దాటిపోయింది. అప్పటికి పరీక్ష ప్రారంభమయి అరగంటకుపైగా అయిపోయిందిట! నేను ఆలస్యంగా వచ్చానని పరీక్ష రాయనివ్వనన్నారు మేష్టరు!' అన్నాడు ఆ కుర్రాడు ఏడుస్తూ! ఆవిడకు నామీద కోపంవస్తుందని నాకు తెలుసు ననుకోండి— కాని ఆ సమయంలో ఆవిడ మొహంచూసిన నేను నవ్వకుండా వుండలేకపోయాను.

జీవితంలో జరిగిన అనుభవం ఒకటి చెప్పినతరువాత పూర్వకాలం పాతకథకూడా ఒకటి చెప్పొద్దూమరి?

ప్రాతఃకాలంలో లేవగానే జంట కాకుల్ని చూసినటయితే జయంకలుగుతుందని, అది చాలామంచి శకునమని ఒక స్వాములవారు, ఒక రాజుగారితో చెప్పారుట! పొద్దున్నే జంటగా కాకులు ఎక్కడ వుంటాయో చూసిచెప్పమని, ఆనాటినుంచీ ఆ పనికి ప్రత్యేకంగా ఒక భటుణ్ణి నియమించారుట ఆ రాజుగారు. ఒకరోజు పొద్దున్నే ఒకచోట రెండు కాకులుండటం చూసి, పరిగెత్తుకొనివెళ్ళి ఆ సంగతి రాజుగారికి తెలియజేశాడుట ఆ సేవకుడు. రాజుగారు వెంటనే, ఏమాత్రమూ ఆలస్యం చెయ్యకుండా నిద్రమంచంమీదనుంచి లేచి, తోటలోకి పరిగెత్తుకొని వచ్చారుట. దురదృష్టవశాత్తూ అంతవరకూ జంటగా కూర్చున్న రెండుకాకుల్లో ఒక కాకి ఎగిరిపోయిందిట రాజుగారు అక్కడికి వచ్చే

వరికీ! దాంతో ఆ రాజుగారికి ఆగ్రహం ముంచుకొచ్చేసిందిట. ఆ పక్కనే వున్న ఒక చెట్టుకొమ్మ విరిచి ఆ సేవకుణ్ణి చితకబాదేశారుట రాజుగారు. దెబ్బలు అంత ఘాటుగా తగిలినా ఆ సేవకుడు 'మహారాజా! పొద్దున్నే జంటకాకుల్ని చూసినందుకు నాకు చాలామంచి శుభంజరిగింది' అని వినయంగా అన్నాడుట! ఈ రోజుల్లోఅయితే అధిక ప్రసంగం అని, పెంకితనం అని, ఆ సేవకుణ్ణి వెంటనే 'డిస్మిస్' చేసేస్తారు. కాని ఆ రోజులువేరు. ఆ మనుష్యులువేరు, ఆ సేవకుడు అన్నమాటల్లో ఆ రాజుగారు సిగ్గుపడిపోయి, క్షమార్పణ చెప్పుకొని, వెయ్యివరహాలు బహుమానంకూడా యిచ్చారుట. ఈ సంగతి ఖచ్చితంగా ఎప్పుడు జరిగిందో, ఆ రాజుగారు ఎవరో వివరంగా తెలియకపోవటంవల్ల "ట" కార శబ్దాన్ని ఉపయోగించాను. ఇటువంటి విషయాలు చాలాజాగ్రత్తగా రాయాలి మరి!

ఈ రచయితకు శకునాలు చూడటం ఇష్టం లేదు కాబోలు—అనుకొంటున్నారా? శకునాలమీద నాకు కూడా నమ్మకం వుంది లెండి! కాని....ఒక్క శకునం మాత్రమే చూస్తే ఏం లాభం? మన పూర్వీకులున్నారు చూశారూ? (మరి వాళ్ళెక్కడున్నారో తెలీయదు!) వాళ్ళకి నిజంగా దణ్ణం పెట్టాలి! పెట్టాలేమిటి? నేను పెడుతూ నేవున్నాను. వాళ్ళు మనకు చేసిన మంచి ఎంత మంచిదో కదా! సంవత్సరంలోని 365 రోజులలోనూ యించుమించు 300 రోజులకు పైగా శుభకార్యాలకి పనికిరావు! అంటే ఆరోజులన్నీ శుభకార్యాలకి సెలవులన్నమాట! ఈ కాలంలో మనకి ఒక్కరోజంటే ఒక్కరోజు—వారంలో—ఆదివారంనాడైనా సెలవు దొరకటం చాలా దుర్లభమయిపోతోంది. మన పెద్దలు మనకు చేసిన ఏర్పాట్లవల్ల సంవత్సరంలో ఎన్ని సెలవు రోజులు లెక్కవేస్తే...! (ఈ వ్యవహారం చాలా చాలా పెద్దదిలెండి. కాని అతి క్లుప్తంగా కొన్ని మాత్రమే ఇక్కడ చెప్తాను.)

ఏదైనా ఒక శుభకార్యం చెయ్యాలంటే, నెల, లగ్నం, వారం, నక్షత్రం, తిథి, వర్జ్యం, వారశూల, తారాబలం, చంద్రబలం-ఇత్యాదులన్నీ చూడాలి. ఒక్క శకునం మాత్రం చూసుకొంటే సరిపోతుందా?

నెలల్లో ఆషాఢం, భాద్రపదం, మార్గశిరం, పుష్యం పనికిరావు!

సింహం లగ్నం అన్నింటికన్నా చెడ్డది! మకర లగ్నం అక్షరాభ్యాసానికి తప్ప ఎందుకూ పనికిరాదు!

ఆదివారం కష్టము, మంగళవారం అగ్నివల, దొంగలవల్ల అరిష్టము, శనివారం శనిరోజు!

ఆదివారంనాడు మఖ, విశాఖ, జ్యేష్ఠ నక్షత్రాలు, సోమవారంనాడు హస్త, చిత్త, పూర్వాభాద్ర నక్షత్రాలు, మంగళవారంనాడు అశ్విని, ధనిష్ఠ నక్షత్రాలు, బుధవారంనాడు ఉత్తరాషాఢ, రేవతి, భరణినక్షత్రాలు, లక్ష్మీవారంనాడు శతభిషం, రోహిణి నక్షత్రాలు, శుక్రవారంనాడు పుష్యమి, శనివారంనాడు మృగశిర నక్షత్రాలు మంచివి కావంటారు.

పాడ్యమి, చవితి షష్ఠి, అష్టమి, నవమి, చతుర్దశి, పౌర్ణమి, అమావాస్య తిథులు మంచివికావు!

వర్జ్యం ప్రతిరోజూ సాధారణంగా వుంటూనే వుంటుంది!

వారశూల, తారాబలం, చంద్రబలం-వ్యవహారం అంతా చాలా పెద్దగ్రంథం!

ఇన్ని గండాలూ దాటుకొని, ఒక మంచి శుభముహూర్తాన్ని నిర్ణయించుకొని, 'అనుకొన్న పని' ఆరంభించబోయే సమయంలో ఏ మహాత్ముడైనా 'హాచ్చి' అని ఒక్క తుమ్ము తుమ్మారంటే చాలు! గోవిందార్పణం! ఇంక ఆ పని అవాల్టికి వాయిదా పడిందన్నమాటే!

ఎందుకంత నవ్వుతారు? కొంచెం నవ్వు దాచుకోండి! ★

—వచ్చే వారం మరోకటి]

కోపం

[35 వ పేజీ తరువాయి]

ఏ ఫ్రెండ్సో- అతిథులో, యింటికొచ్చిన సమయంలో, యిల్లాలిమీద కోపం తెచ్చుకుని, పెద్దగా అరిచేస్తుంటారు. ఓర్పుగల యిల్లాలయితే వూరుకుంటుంది. అదిఓర్పులేని ఆమెఅయితే తనూ కోపంతో రెండు మాటలనేస్తుంది.

ఇదంతా, ఆ అతిథులే, వినడం గనుక జరిగితే ఎంతఅసభ్యంగా వుంటుందో చూడండి. ఆ అతిథులకుకూడ వీళ్ళింటికి ఎందుకువచ్చామురా భగవంతుడా అనిపించేస్తుంది. అక్కడ ఉండలేక, వెళ్ళలేక ఏమీ అనలేక ఊరుకోలేక అవస్థపడతారు. సమయాసమయాలు చూడకుండా కోపంచేయడం ఎవ్వరికైనా మంచిదికాదు.

మాభద్రయ్య, మావయ్యలాంటి వాళ్ళు కొందరున్నారు. అంటే "తుమ్మితే ముక్కు వూడిపోయేరకమన్నమాట, మాభద్రయ్య మావయ్యకి ఏమాట చెప్పినా కోపమే, అఖరికి, మామయ్యా అని పిల్చినా కూడ కోపమే, "ఏం? ఎందుకూ? ఏంమాట కట్టుకొచ్చావు మావయ్యకూ?-అంటూ మండిపోతాడు.

ఇట్లా చీటికి మాటికి కోపం తెచ్చుకునే వాళ్ళనుచూస్తే, ఎవ్వరికైనా చిరాకెయ్యక మానదు.

కోపం రావడం సహజమే అయినా, దానిని నిగ్రహించుకునేందుకు, ప్రయత్నించాలి. కోపంతో, ఏమాటలు అంటున్నది తెలీక, అవతలివాళ్ళ మనస్సును నొప్పించి, తర్వాత చింతించడంకన్నా, ముందుగానే శాంతం తెచ్చుకోవడం మంచిది. కాలు జారితే తీసుకోగలంకానీ, నోరు జారితే తీసుకోలేముగదా: కోపంలో తెలీక కొట్టి ప్రాణాలు పోగొట్టిన వాళ్ళు కూడా వున్నారు. ఎవ్వరికైనా, ఓర్పు, శాంతము వుండాలి. "త్యాగరాజన్నట్టు శాంతము లేకపోతే, సౌఖ్యం వుండదుమరి. ★

పంటిపోటు

(12-వ పేజీ తరువాయి)

'అడిగావా! విను! మరికొంతసేపటికి పట్టకారు పట్టుకొని యింకో కళ్ళద్దాల నూటు-బూటు పెద్దమనిషి చక్కా వచ్చాడు. వాని పక్కనే చిన్నగిన్నెతోటి దూదితోటి ఓ పెద్ద గౌను తొడుక్కున్న ఆడది. ఒకటే కంగారు-పెళ్ళి కంగారు చల్లగా వుండా-ల్లా అయిందా — "చూపించు!-ఏ పన్ను బాధ పెడుతోందో చూపించు!- చప్పున చూపించు!" అంటూ ఆయన - ఆ నూటు బూటు పెద్దమనిషి - అందర్నీ అడుగుతూ - పళ్లు పీకిపారేస్తూ-ఏదో దూదిముంగు ఇస్తూ-పరిగ్గా నాదగ్గరకి వచ్చాడు. బాధపెట్టేపన్ను చూపించమన్నాడు. నాకు అన్నీ పళ్లూ ఒకలాగే వున్నాయి. బాధపెట్టే పన్నుని ఆనవాలు పెట్టుకున్నావా-పాడా! ఆ పెద్దమనిషికి ఒకటే తొందర. మాటాడ తోచదు మంతీ తోచదు. పోటు ఎక్కడ ఆరంభమయిందో కొంచం ఆనవాలు వుందిగా - అక్కడ వేలు పెట్టి చూపెట్టాను. చూపెట్టిందే తడవుగా పట్టకారుతో పట్టి లాగి-పన్ను బయటపడేశాడు - పిల్ల యముడులాగ—' అన్నాడు భానుమూర్తిగారు.

'మొత్తానికి పన్ను తీయించేశారన్న మాట. పాపం - కొంతసలుపు వుంటుంది లెండి యివాళిటికి. రేపటికి పూర్తిగా సుళువిస్తుంది. పాడుపన్ను ఎంత పీడించిందండీ—'అని నేనంటూండగానే-ఆయన యిలా అందుకున్నాడు.

'అదికాదయ్యా మహానుభావా!' అన్నాడు చిరాకుగా.

'మరేది-ఏంజరిగిందో చెప్పండి మరి' అన్నాను.

'నేను చూపించినపన్ను. బాధపెట్టే పన్ను కాదు. మంచి ఫస్టాసైనపన్ను. అతిమ్మిరిలో బాధపెట్టేపన్ను దాక్కుంది. మంచిపన్ను పైపు వాచేయి పోయింది. ఈ గొడవలో ధర్మాసుపత్రి డాక్టరుగారు పీకినపన్ను బాధలేనిది. ఈబాధ పెట్టేపన్ను యింకా - ఇలాగేవుంది చూడు-' అంటూ భానుమూర్తిగారు మళ్ళీ బాధపడటం ప్రారంభించాడు.

నిష్కారణంగా మంచిపన్ను పోయింది. పోటుపెట్టేపన్ను అలాగేవుంది. పాపం భానుమూర్తిగారి బాధని ధర్మాసుపత్రి తీర్చలేకపోయింది-' అనుకున్నాను.

'పోనీ-రేపువెళ్లి జరిగిన సంగతంతా చెప్పి ఆపోటు పెట్టేపన్నును పీకించకూడదా' అన్నాను.

'భయంవేస్తోందోయి బాబూ - ఆ వరస వారీగా మంచోవడం - వాళ్ళధాటికి తట్టుకోవడం మాటలా? ఇంత ఓపికపట్టి రెండు రోజులు రెండురూపాయలు ఖర్చుపెట్టుకొని మంచిపన్ను తీయించుకున్నాను. విన్నావా!' అన్నాడు భానుమూర్తిగారుదీనంగా. నాకూ జాలివేసింది ఆయన్ని చూస్తే.

అంతట్లోనే మాఅమ్మ చక్కావచ్చింది ప్రక్కయింటి పళ్ళడాక్టరుతో. భానుమూర్తిగారు ఏవనుకొన్నాడోమరి - డాక్టరుగారికి నమస్కరించాడు. కొంప తివ్వ - ధర్మాసుపత్రిఫార్సు - యీయనకి చెప్పిందా మా అమ్మ అనుకున్నాను, నాకుమాత్రం చెప్పాలని లేదు.

తెలుసునో మరి తెలియదో ఆ డాక్టరు ప్రశ్నించకుండానే ఆ బాధపెట్టే పంటిని తీసేసి - మందుకూడా యిచ్చి - రావలసిన అయిదు రూపాయల ఫీజు పుచ్చుకొని — ఫరవాలేదు భానుమూర్తిగారూ అంటూ ధైర్యంచెప్పి చరచరా వెళ్లిపోయాడు డాక్టరు. ఆ పన్ను తీశాక - నిద్రకు మొహం వాచిన భానుమూర్తిగారికి సుఖనిద్ర పట్టింది.

"రా రా యింటికిపోదాం" అంది అమ్మ. ంఇటికి వచ్చాం. 'ఎంత లోభంవుంటే అంత ఖర్చు అవుతుందమ్మా,' అన్నారమ్మ అన్నాను అమ్మతో.

'మంచిపన్ను తీయించడానికి రెండు రూపాయలు ఖర్చుచేసినప్పుడు - బాధపెట్టే పన్ను తీయించడానికి అయిదు రూపాయలు ఖర్చుచేయడం దుబారా కాదురా' అంది అమ్మ.

మర్నాడు భానుమూర్తిగారు — 'కొంత మక్కయ్యా' అంటూ వచ్చాడు. 'కులాసాగా వున్నారా - బాధ తగ్గిందికదా-' అంది అమ్మ. 'తగ్గకేంచేస్తుంది. ఎన్నాళ్లు బాధపడాలో అన్నాళ్లూ బాధపడక తప్పదు ఎలాంటి వాళ్లకైనా—' అన్నాడు భానుమూర్తిగారు.

'బాధపెట్టే పన్ను అయిదు రూపాయలకు పోయినా - నొప్పిలేని పన్ను నిష్కారణంగా రెండు రూపాయలు మింగిందే — గ్రహచారం' అని నేనంటూంటే — భానుమూర్తిగారు అన్నాడు - 'కిలం వదిలితేనే కాని ఫలం దక్క'దని, మర్నాడు నేను ఆఫీసుకు పోతూంటే - పంటిడాక్టరు ప్రత్యక్షమయ్యాడు. ఒకరికొకరు నమస్కారాలు చెప్పుకున్నాం. 'మీ భానుమూర్తిగారు కులాసాగా వున్నారు కదా!' అన్నాడాయన. 'మీదయవల్ల కులాసాగానే వున్నాను సార్—' అన్నాను నేను. 'చూశావా -- ఉడుం పట్టుపట్టి -- అయిదు రూపాయిల్ని ఆయన బిగపటినా - మనకి దక్కే యోగం వున్నప్పుడు ఆయన అడ్డు పెట్టగలడా చెప్పండి' అన్నాడాయన, అందుకనే సార్ - వేమన్న.

"ప్రాప్తమున్నచో ఫలమేల తప్పురా!
విశ్వదాభిరామ వినురవేమ"— అన్నాడన్నాను.

'బాగాచెప్పారే!' అనే అభినందన ఆయన చేస్తూండగానే- నవ్వుకుంటూ ఆయన అటూ - నేనిటూ విడివడ్డాం. ★

(9-వ పేజీ తరువాయి)

ఆదేశాలకే భిన్నమైన సిఫార్సులు చేయడానికి ఉద్యమించింది, అంచనాల సంఘాన్ని నీయమిస్తూ ఏమాత్రం ఆలోచించకుండా నిర్వచించిన నియమనిబంధనలే ఈ రగడకంతకూ కారణం. దీనివిషయమై రాజధానిలో ఇప్పుడిప్పుడే జ్ఞానోదయమవుతున్నది. కేంద్ర న్యాయశాఖమంత్రి ఈ సంఘ నియామక నిబంధనలలో వున్న అసందర్భాన్ని పురస్కరించుకొని ఒక తాఖీదు తయారు చేసినట్లు తెలుస్తున్నది. నిబంధనల మార్పుకు పారమెంటులో త్వరలోనే ఒక ప్రతిపాదన రావచ్చు. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



వింతలలో వింత—ఆవులింత!

—ఫోటో: ఎన్. కామేశ్వరరావు, రాజమండ్రి.]

Regd. No. M. 4479

